16 . 04. 2026

VELTHURU TELUGU DAILY

# వెలుతురు

గురువారం | రంగారెడ్డి , నల్లగొండ

సంపుటి :07 సంచిక : 303 , పేజీలు : 12 వెల : రూ.5/-

SRI SHANTHI PUBLICATIONS PUBLISHED FROM TELANGANA | ANDHRA PRADESH

తెలుగు దిన పత్రిక

www.velthuru.com

velthuru Newspaper

## రేవంత్ రెడ్డిపై కాంగ్రెస్ పార్టీ పట్టు కోల్పోయింది: జీవన్ రెడ్డి



2లో



2లో

## మార్కెటింగ్, మార్క్ ఫెడ్ అధికారులతో సమీక్ష నిర్వహించిన మంత్రి తుమ్మల

- మార్కెట్ యార్డ్ లలో గత రెండు సంవత్సరాలలో చేపట్టిన పనుల పురోగతిని సమీక్షించిన మంత్రి తుమ్మల
- మార్కెట్ యార్డ్ లలో జీరో బిజినెస్ జరగకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని ఆదేశాలు
- గడ్డిఅన్నారం మార్కెట్ లో చేపట్టిన 'IT' Interference పై మంత్రికి వివరించిన అధికారులు
- కోహెడ మార్కెట్ పనులకు సంబంధించిన డిజైన్ల రూపకల్పన, టెండర్లను నిర్ధిష్ట కాలపరిమితి పెట్టుకొని ముందుకు వెళ్లాలన్న మంత్రి తుమ్మల
- ప్రయోగాత్మకంగా చేపట్టిన రూఫ్ టాప్ సోలర్ల నిర్మాణ ప్రగతి పై ఆరాతీసిన మంత్రి తుమ్మల
- ధాన్యం కొనుగోళ్లను సంబంధించి అవసరమైనన్ని టార్పలిన్ లు, తేమ కొలమాని, ఆరబెట్టే యంత్రాలు సిద్ధం చేయాలని ఆదేశించిన మంత్రి తుమ్మల

## తెలంగాణలో భగ్గుమన్న

# సూరీడు..

### పలు జిల్లాల్లో 43 డిగ్రీలు దాటిన ఎండలు





2

**హైదరాబాద్ వెలుతురు ఏప్రిల్ 15 :** తెలంగాణలో భానుడు ఉగ్రరూపం ప్రదర్శిస్తున్నాడు. రాష్ట్రవ్యాప్తంగా ఎండలు మండిపోతుండటంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఏప్రిల్ మధ్యలోనే ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో నమోదవుతుండటం ఆందోళన కలిగిస్తోంది. మంగళవారం నాటి వాతావరణ శాఖ నివేదికల ప్రకారం నల్గొండ జిల్లా అడవి దేవులపల్లి మండలంలో అత్యధికంగా 43.5 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. జగిత్యాల జిల్లా కోరుట్లలో 43.4 డిగ్రీలు, నిర్మల్, నిజామాబాద్ జిల్లాల్లో 43.3 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. ఆదిలాబాద్‌లో 43.2 డిగ్రీలు నమోదు కాగా, సిద్దిపేట, కామారెడ్డి, కరీంనగర్, మంచిర్యాల, సిరిసిల్ల, సంగారెడ్డి జిల్లాల్లో కూడా పగటి ఉష్ణోగ్రతలు 42.8 డిగ్రీలకు పైగా ఉన్నాయి. ఉదయం 8 గంటల నుంచే ఎండ తీవ్రత ప్రారంభమై మధ్యాహ్నానికి గరిష్ఠ స్థాయికి చేరుకుంటోంది. తీవ్రమైన ఎండలకు తోడు ఉక్కపోత కూడా అధికంగా ఉండటంతో జనం ఇళ్లకే పరిమితమవుతున్నారు.

- తెలంగాణలో పలు ప్రాంతాల్లో 43 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు
- రానున్న మూడు రోజుల్లో ఒకటి నుంచి రెండు డిగ్రీలు పెరిగే అవకాశం
- వడగాలులు దల వీచే జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ
- తెలంగాణలో ఉగ్రరూపం దాల్చిన ఎండలు.. రానున్న 5 రోజులు కీలకం
- నల్గొండ జిల్లాలో అత్యధికంగా 43.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు
- పలు జిల్లాల్లో 42 డిగ్రీలు దాటిన పగటి ఉష్ణోగ్రతలు
- రానున్న ఐదు రోజుల్లో 45 డిగ్రీలు దాటే అవకాశం
- వాతావరణ శాఖ నుంచి ప్రజలకు హెచ్చరిక



2లో

## డీలిమిటేషన్‌పై దక్షిణాది రాష్ట్రాలు ఆందోళన చెందాల్సిన పనిలేదు : కేంద్రం

- లోక్‌సభలో అన్ని రాష్ట్రాల వాటాను ఏకరీతిగా 50శాతం పెంచనున్నట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడి
- అన్ని పార్టీలతో మాట్లాడిన తర్వాతే ఒక నిర్ణయం : నిర్మలా సీతారామన్
- ఖర్గే నివాసంలో కాంగ్రెస్ కీలక సమావేశం

## రాజేంద్ర నగర్ టీజీ ఐఆర్డీలో మంత్రి సీతక్క సమీక్ష

గ్రామీణాభివృద్ధికి వినూత్న కార్యక్రమాలు రూపొందించాలని ఆదేశాలు



2లో

## విదేశీ పర్యాటకునితో మంత్రి జూపల్లి ముచ్చట

హైదరాబాద్ ఆతిథ్యంపై ఆరా.. చౌమొహల్లా ప్యాలెస్‌లో ఆసక్తికర సన్నివేశం





2లో

## బిహార్ సీఎంగా సమ్రాట్ చౌధరీ ప్రమాణస్వీకారం- తొలి బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు



2లో

## 'ఈ 9 పనులు చేస్తామంటూ ప్రతిజ్ఞ తీసుకోవాలి'- ప్రజలకు ప్రధాని మోదీ విజ్ఞప్తి



2లో

## మహిళా రిజర్వేషన్ బిల్లుకు కేసీఆర్ పూర్తి మద్దతు.. డీలిమిటేషన్‌పై వార్నింగ్

- పార్టీ ముఖ్య నేతలతో మహిళా రిజర్వేషన్ బిల్లు, డీలిమిటేషన్‌పై కేసీఆర్ చర్చ
- మహిళా రిజర్వేషన్లకు అనుకూలంగా గతంలోనే తీర్మానం చేశామన్న కేసీఆర్
- డీలిమిటేషన్ కారణంగా దక్షిణాదికి ఇప్పుడున్న 24 శాతం సీట్లు తగ్గకూడదని వార్నింగ్

## ఎక్సైజ్ శాఖలో సమసిన వివాదం

తెలంగాణ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ (టీజేఏసీ)



2లో

## పిల్లల నుంచే ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన ఉండాలి: మంత్రి పొన్నం ప్రభాకర్



**ఆదిలాబాద్ వెలుతురు ఏప్రిల్ 15:** రహదారి నిబంధనలపై అవగాహన అనేది చిన్ననాటి నుంచే అలవడాలని, అప్పుడే భవిష్యత్తులో బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదుగుతారని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. బుధవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని చావర పాఠశాలలో రవాణా శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'అరైవ్ అలైవ్' కార్యక్రమంలో

మిగతా 3లో



2లో

## 24 ఏళ్లలో మోదీపై ఒక్క అవినీతి మచ్చ లేదు

### - టీఎంసీ దోచుకున్న ప్రతి పైసా తిరిగి వసూలు చేస్తాం: అమిత్ షా

**బంగాల్ వెలుతురు ఏప్రిల్ 15:** బంగాల్‌లో తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే తృణమూల్ కాంగ్రెస్ దోచుకున్న ప్రతి పైసాను వడ్డీతో సహా తిరిగి వసూలు చేస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా హామీ ఇచ్చారు. 24 ఏళ్లుగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధికారంలో ఉన్నప్పటికీ, ఆయనపై ఒక్క అవినీతి ఆరోపణ కూడా లేదని ఆయన పేర్కొన్నారు. బుధవారం ఉత్తర బంగాల్‌లోని జల్పాయ్‌గుడి జిల్లా రాజ్‌గంజ్‌లోని ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు. "ముఖ్యమంత్రి మమతా బెనర్జీ అధికారం నుంచి వైదొలగడం ఖాయం. ఆ ప్రక్రియను ప్రారంభించే బాధ్యత ఇక్కడ నుంచే ప్రారంభమవుతుంది.

మిగతా 2లో

### అదే జరిగితే కేసీఆర్ ముందుండి ఉద్యమాన్ని నడిపిస్తారు:

## బీజేపీకి కేటీఆర్ హెచ్చరిక



2లో

- మహిళా రిజర్వేషన్ బిల్లుకు మద్దతిస్తామన్న కేటీఆర్
- డీలిమిటేషన్ బిల్లు పేరుతో దక్షిణాదికి అన్యాయం చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరిక
- బీజేపీ తెలంగాణకు ఎప్పుడూ మంచి చేయదని విమర్శ

## బలవంతపు భూసేకరణ ఆపకపోతే ఉద్యమం ఉధృతం: వికారాబాద్‌లో కల్వకుంట్ల కవిత గర్జన

- పరిగి ప్రాంత రైతుల నుంచి సాగు భూములను లాక్కుంటున్నారంటూ కవిత ధర్నా
- అన్నదాతల పొట్ట కొట్టడం అన్యాయమని వ్యాఖ్య
- రైతుల సమ్మతి లేకుండా ఒక్క ఎకరా భూమి కూడా తీసుకోవడానికి వీల్లేదన్న కవిత



2లో

# డీలిమిటేషన్‌పై దక్షిణాది రాష్ట్రాలు ఆందోళన చెందాల్సిన పనిలేదు : కేంద్రం

**ఢిల్లీ వెలుతురు ఏప్రిల్ 15:** మహిళా రిజర్వేషన్ బిల్లు అమలు కోసం చేపట్టే నియోజకవర్గాల పునర్విభజనపై దక్షిణాది రాష్ట్రాలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కేంద్రవర్గాలు తెలిపాయి. లోక్‌సభలో అన్ని రాష్ట్రాల వాటాను ఏకరీతిగా 50శాతం పెంచనున్నట్లు ప్రభుత్వ వర్గాలు చెప్పినట్లు జాతీయ మీడియా పేర్కొంది. దక్షిణాది రాష్ట్రాలు ఆందోళన చెందాల్సిన పనిలేదని కేంద్రవర్గాలు పేర్కొన్నాయి. 2011 జనాభా లెక్కలు ఇక్కడ నిర్ణయాత్మక అంశం కావని తెలిపాయి. అంటే దామాషా పరంగా చూస్తే ఎటువంటి మార్పూ ఉండదని, ప్రాతినిధ్యం తగ్గుతుందేమోనన్న దక్షిణాది ఆందోళనలను ఈ విధానం నివారిస్తుందని వివరించాయి. దక్షిణాది రాష్ట్రాలకు ఎటువంటి నష్టమూ వాటిల్లదని, ప్రతీ రాష్ట్రానికి కేటాయించిన సీట్ల సంఖ్య కూడా 50 శాతం పెరుగుతుందని స్పష్టం చేశాయి.

**అన్ని పార్టీలతో మాట్లాడిన తర్వాతే ఒక నిర్ణయం : నిర్మలా**

మరోవైపు నియోజకవర్గాల పునర్విభజనను ప్రతిపక్ష కూటమి వ్యతిరేకిస్తున్న నేపథ్యంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పందించారు. డీలిమిటేషన్ కమిషన్ ప్రతి రాజకీయ పార్టీని సంప్రదిస్తుందని స్పష్టం చేశారు.
బంగాల్‌లోని పూర్బ బర్ధమాన్‌లో పర్యటించిన ఆమె, ఈ మేరకు ప్రముఖ వార్త సంస్థ ఏఎన్ఐతో మాట్లాడారు. డీలిమిటేషన్ విభజిస్తుందన్న బంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ వ్యాఖ్యలపై నిర్మలా సీతారామన్ తీవ్రంగా విరుచుకుపడ్డారు. ఆమె మహిళలకు రిజర్వేషన్లను ఆపి, బంగాల్ ప్రజల మనసుల్లో భయాన్ని నింపడానికి ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. "లోక్‌సభలో సీట్లను 850కి పెంపు అనేది ఒక గరిష్ఠ పరిమితి. ప్రతి రాష్ట్రానికి ఒక డీలిమిటేషన్ కమిటీ ఉంటుంది. అది అన్ని పార్టీలతో మాట్లాడిన తర్వాతే ఒక నిర్ణయం తీసుకుంటుంది. మరి భయం ఎందుకు? మీకు ఎస్ఐఆర్ అంటే భయమా? ఎన్నికల సంఘం, పార్లమెంట్ ఆమోదించిన ప్రతి చట్టం గురించి మీకు భయం. కానీ ఇక్కడ మీరేమీ చేయరు" అని నిర్మలా సీతారామన్ అన్నారు

**ఖర్గే నివాసంలో కాంగ్రెస్ కీలక సమావేశం**

ఇదిలా ఉండగా, పార్లమెంటు ప్రత్యేక సమావేశాల నేపథ్యంలో మహిళా రిజర్వేషన్ల చట్టానికి సంబంధించిన వ్యూహాన్ని చర్చించేందుకు కాంగ్రెస్ కీలక సమావేశం ఏర్పాటు చేసింది. పార్లమెంట్‌లో అనుసరించాల్సిన వ్యూహాలపై పార్టీకి అగ్రనేతలు అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నివాసంలో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో మహిళా రిజర్వేషన్ల అంశంతో పాటు నియోజకవర్గాల పునర్విభజన అంశంపై కూడా చర్చించారు. కాగా, మహిళా రిజర్వేషన్ల చట్టం, నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించిన బిల్లులను ప్రభుత్వం మంగళవారం ఎంపీలకు పంపిణీ చేసింది.

**డీలిమిటేషన్ ప్రక్రియ నిష్పక్షపాతంగా జరగాలి : చిదంబరం**

డీలిమిటేషన్ ప్రక్రియ నిష్పక్షపాతంగా, పారదర్శకంగా జరగాలని కాంగ్రెస్ రాజ్యసభ ఎంపీ, మాజీ కేంద్ర మంత్రి పి. చిదంబరం డిమాండ్ చేశారు. తమిళనాడు కోయంబత్తూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడిన ఆయన, లోక్‌సభ సీట్లను 50 శాతం పెంచాలన్న ప్రతిపాదనను ఒక భ్రమగా అభివర్ణించారు. మహిళా రిజర్వేషన్లు, లోక్‌సభ సీట్లు 850కి పెంచే రాజ్యాంగ సవరణ ఆమోదించేందుకు ఏర్పాటు చేసిన ప్రత్యేక పార్లమెంట్ సమావేశాల సమయాన్ని ఆయన వ్యతిరేకించారు. తమిళనాడు, బంగాల్‌లో ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో పలువురు ప్రతిపక్ష ఎంపీలు పార్లమెంట్‌కు హాజరు కాలేకపోవచ్చని అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం లోక్‌సభలో 543 సీట్లు ఉన్నాయి. 2029 లోక్‌సభ ఎన్నికల నుంచి అమలు చేయాలనే ఉద్దేశంతో, లోక్‌సభ సీట్ల సంఖ్యను 850కి పెంచాలని కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. ఇందులో 815 సీట్లు రాష్ట్రాలకు, మిగిలిన 35 సీట్లు కేంద్రపాలిత ప్రాంతాలకు కేటాయించనున్నట్లు సమాచారం. ఏప్రిల్ 16 నుంచి జరగనున్న పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో రాజ్యాంగ సవరణ బిల్లును ప్రవేశపెట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. లోక్‌సభ సీట్ల సంఖ్యలో 50 శాతం పెరుగుదల ఉండనున్నప్పటికీ, ఈ పెరుగుదల ప్రతి రాష్ట్రానికి జనాభా నిష్పత్తి ఆధారంగా ఉండదని ప్రతిపక్ష పార్టీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

# 'ఈ 9 పనులు చేస్తామంటూ ప్రతిజ్ఞ తీసుకోవాలి'- ప్రజలకు ప్రధాని మోదీ విజ్ఞప్తి

**నీటి సంరక్షణ, ప్రకృతి వ్యవసాయం నుంచి ఫిట్‌నెస్, సేవ వరకు 9 ప్రతిజ్ఞలు తీసుకోవాలని పిలుపు**

**ఢిల్లీ వెలుతురు ఏప్రిల్ 15:** ప్రజలందరూ 9 పనులు చేస్తామంటూ ప్రతిజ్ఞ తీసుకోవాలని కోరారు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ. నీటి సంరక్షణ, ప్రకృతి వ్యవసాయం నుంచి ఫిట్‌నెస్, సేవ వరకు 9 ప్రతిజ్ఞలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. అభివృద్ధి చెందిన కర్ణాటక, భారత్‌ను సాకారం కోసం 9 పనులు చేయాలన్నారు. కర్ణాటక మాండ్య జిల్లాలో పర్యటించిన ప్రధాని నరేంద్ర మోదీ, ఆదిచుంచనగిరి మఠంలో గురు భైరవైక్య మందిరాన్ని ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రసంగించిన మోదీ, ఈ మేరకు 9 ప్రతిజ్ఞలు పాటించాలని చెప్పారు.

**మాతృమూర్తి పేరిట మొక్క నాటాలని మోదీ పిలుపు**

ఈ సందర్భంగా మాట్లాడిన మోదీ, మొదటి వాగ్దానంగా జల సంరక్షణను ప్రస్తావించారు. తర్వాత ప్రతి ఒక్కరూ 3 మొక్కలు నాటాలని సూచించిన ప్రధాని, అందులో ఒకటి తమ మాతృమూర్తి పేరిట నాటాలని కోరారు. బహిరంగ, మతపరమైన ప్రాంతాల్లో పరిశుభ్రత, స్థానిక ఉత్పత్తుల కొనుగోలు, స్థానిక పర్యాటకాన్ని ప్రోత్సహించడం, చిరుధాన్యాలు తినడం, నూనె వాడకాన్ని తగ్గించడం ద్వారా ఆరోగ్యకరమైన భోజనం చేయడం వంటి ప్రతిజ్ఞలు చేయాలని సూచించారు. యోగా, శారీరక దారుఢ్యం, ప్రకృతికి సేవ చేయడం వంటి అంశాలను కూడా ప్రస్తావించారు.
"శ్రీ కాల భైరవ ఆలయాన్ని సందర్శించి పూజలు చేయడం, శ్రీ గురు భైరవైక్య ఆలయాన్ని ప్రారంభించడం నా మనసులో ఎప్పటికీ నిలిచిపోతాయి. మీ అందరి మధ్యకు వచ్చే అవకాశం లభించడం నా అదృష్టంగా భావిస్తున్నాను. నా హృదయం ప్రస్తుతం ఎన్నో భావోద్వేగాలతో నిండిపోయింది. వాటిని మాటల్లో వర్ణించడం కష్టం. భారతదేశం వేల సంవత్సరాలుగా వర్ధిల్లుతున్న ఒక సజీవ నాగరికత. ప్రపంచంలోని అతి తక్కువ దేశాలకు మాత్రమే ఇంత సుదీర్ఘ కాలం పాటు నిలిచి ఉండే సంప్రదాయాలు ఉన్నాయి. ఆదిచుంచనగిరి మహాసంస్థాన మఠం సంప్రదాయ నిరంతరతకు ప్రతీక. దాదాపు 2,000 సంవత్సరాల చరిత్ర ఈ మఠానికి ఉంది. మన సమాజంలో కేవలం ఆధ్యాత్మిక మార్గదర్శకత్వానికే పరిమితం కాని మహనీయులు పుడుతూనే ఉన్నారు. వారు ప్రజల మధ్యే జీవించారు. వారు ప్రజల సుఖదుఃఖాలను అర్థం చేసుకున్నారు. ప్రజల కష్టాలను స్వయంగా అనుభవించి, సమాజాన్ని దుఃఖం, బాధలు ఇబ్బందుల నుంచి బయటపడేసే మార్గాన్ని చూపించారు. దివంగత బాలగంగాధరనాథ మహాస్వామి విద్య, వైద్య రంగాల్లో మార్పు కోసం ఎంతో కృషి చేశారు. కర్ణాటక ఫిలాసఫి, టెక్నాలజీ రెండింటిలోనూ మెరుగ్గా ఉంటుందని నేను ఎప్పుడూ చెబుతూనే ఉంటాను."

**కోట్ల మంది ప్రజలకు ఉచితంగా వైద్య సౌకర్యం**

అంతకుముందు కర్ణాటక మాండ్య జిల్లాలో పర్యటించిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఆదిచుంచనగిరి మఠానికి వెళ్లి అక్కడ గురు భైరవైక్య మందిరాన్ని ప్రారంభించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదిచుంచనగిరి మఠం 71వ పీఠాధిపతి బాలగంగాధరనాథ మహాస్వామి స్మృత్యర్థం ఈ ఆలయం నిర్మించారు. తర్వాత అక్కడ జరిగిన సభలో పాల్గొన్న ప్రధాని మోదీ, సౌందర్య లహరి- శివ మహిమ స్తోత్రం అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రధాని ఎఱ దేవెగౌడ, కేంద్ర మంత్రి కుమారస్వామి, శోభా కరంద్లాజే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయుష్మాన్ భారత్ పథకంలో భాగంగా కొన్ని కోట్ల మంది ప్రజలకు ఉచితంగా వైద్య సౌకర్యం అందిస్తున్నామని ప్రధాన మోదీ వెల్లడించారు. ప్రస్తుతం ఈ పథకం కింద 70 ఏళ్లు దాటిన వృద్ధులకు కూడా అవకాశం కల్పించామని వివరించారు.

## బలవంతపు భూసేకరణ ఆపకపోతే ఉద్యమం ఉద్ధృతం: వికారాబాద్‌లో కల్వకుంట్ల కవిత గర్జన

**హైదరాబాద్ వెలుతురు ఏప్రిల్ 15:** పారిశ్రామికీకరణ పేరుతో పరిగి ప్రాంత రైతుల నుంచి బలవ ంతంగా సాగు భూములను లాక్కుంటున్నారంటూ తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రత్యక్ష పోరాటానికి దిగారు. వికారాబాద్ ఆర్డీవో కార్యాలయం వద్ద వందలాది మంది రైతులతో కలిసి ఆమె భారీ ధర్నా నిర్వహిం చారు. ఈ సందర్భంగా రోడ్డుపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ, భూసేకరణ నోటిఫికేషన్‌ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రైతుల సమ్మతి లేకుండా ఏ ఒక్క ఎకరా భూమిని తీసుకోవడానికి వీల్లేదని, ప్రభుత్వం తన మొండివైఖరిని వీడక పోతే ఈ పోరాటాన్ని రాష్ట్ర వ్యాప్తంగా ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. పారిశ్రామికీకరణ ముసుగులో భూసేకరణకు పాల్పడుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. కవిత పిలుపుతో ఈ ఆందోళనలో స్థానిక నాయకులు, తెలంగాణ జాగృతి కార్యకర్తలు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో వికారాబాద్ పరిసరాల్లో ఉద్రిక్తత నెలకొంది. పరిస్థితిని గమనించిన పోలీసులు అక్కడ భారీగా మోహరించారు. కవిత రాకతో ఈ భూపోరాటం ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో ప్రాధాన్యత సంతరించుకుంది.

## రాజేంద్ర నగర్ టీజీ ఐఆర్డీలో మంత్రి సీతక్క సమీక్ష

**హైదరాబాద్ వెలుతురు ఏప్రిల్ 15:** రాజేంద్ర నగర్‌లోని టీజీ ఐఆర్డీ (Telangana Institute of Rural Development) కార్యాలయంలో సంస్థ కార్యక్రమాలు, కార్యకలాపాలపై పంచాయ తీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్ష సమావేశంలో శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సంజయ్ కుమార్, టీజీ ఐఆర్డీ సీఈఓ కె. నిఖిలతో పాటు ప్రొఫెసర్లు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంస్థలో జరుగుతున్న శిక్షణ కార్యక్రమాల పురోగతిని సీఈఓ నిఖిల మంత్రి సీతక్కకు వివరించారు. టీజీ ఐఆర్డీ ద్వారా ఇప్పటివరకు వివిధ విభాగాల పరిధిలో చేపట్టిన శిక్షణల ఫలితాలు, వాటి ప్రభావం గురించి కూడా వివరించారు. ముఖ్యంగా, శిక్షణ పూర్తి చేసిన మాస్టర్ ట్రైనర్లు రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో సర్పంచ్‌లకు శిక్షణ ఇచ్చినట్లు, ప్రస్తుతం వార్డు సభ్యులకు శిక్షణ కార్యక్రమాలు కొనసాగుతున్నట్లు తెలిపారు. మంత్రి సీతక్క సంస్థలోని వివిధ విభాగాల పనితీరును సమగ్రంగా పరిశీలించి, పలు కీలక సూచనలు చేశారు. ఎంతో మంది నిపుణులున్న టీజీ ఐఆర్డీ.. గ్రామీణాభివృద్ధిని వేగవంతం చేసేలా వినూత్నమైన కార్యక్రమాలను రూపొందించాలని ఆమె సూచించారు. ప్రజలకు, ప్రజా ప్రతినిధులకు స్థానిక సంస్థల విధులు,నిధులు, హక్కులపై స్పష్టమైన అవగాహన కల్పించేందుకు సులభంగా అర్థమయ్యే శిక్షణ మెటీరియల్ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు తమ హక్కులు భాధ్యతలు తెలియచెప్పితే గ్రామాల అభివృద్ధి సంపూర్ణమవుతుందని తెలిపారు. అదేవిధంగా, ఏజెన్సీ ప్రాంతాల్లో అమలులో ఉన్న చట్టాలపై స్థానిక అధికారులు, ప్రజా ప్రతినిధులకు అవగాహన పెంపొందించే దిశగా ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలను టీజీ ఐఆర్డీ ద్వారా నిర్వహించాలని సూచించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరా నికి సంబంధించిన యాక్షన్ ప్లాన్ అమలులో ఖచ్చితత్వం ఉండేలా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని, సంస్థలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి భాగంగా ఆడిటోరియం నిర్మాణానికి అవసరమైన నిధులు కేటాయిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. పంచాయతీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి రంగాల్లో అత్యున్నత శిక్షణా సంస్థగా పేరుగాంచిన టీజీ ఐఆర్డీ ప్రతిష్ఠను నిలబెట్టేలా సిబ్బంది మరింత కట్టుదిట్టంగా పనిచేయాలని మంత్రి సీతక్క సూచించారు. సంస్థ ద్వారా అందించే శిక్షణలు గ్రామీణ పాలనలో నాణ్యతను పెంచేలా ఉండాలని ఆమె ఆకాంక్షించారు.

## మార్కెటింగ్, మార్క్ ఫెడ్ అధికారులతో సమీక్ష నిర్వహించిన మంత్రి తుమ్మల



**హైదరాబాద్ వెలుతురు ఏప్రిల్ 15:** బుధవారం రోజున సచివాలయంలో మార్కెటింగ్ మరియు మార్క్ ఫెడ్ అధికారులతో, గౌరవ వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు సమగ్ర సమీక్ష నిర్వహించారు. మార్కెటింగ్ డైరెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రంలో అన్నీ వ్యవసాయ మార్కెట్ కమిటీలలో మార్కెట్ రుసుము వసూళ్లను పారదర్శకంగా మరియు సమర్ధవంతంగా చేయడానికి చర్యలు తీసుకొంటున్నామని తెలిపారు. అదేవిధంగా రూ 568.50 కోట్లు గత రెండు సంవత్సరాలలో, మార్కెటింగ్ యార్డ్ లలో 630 అభివృద్ధి పనులు ప్రభుత్వం మంజూరు చేసిందని, వీటిలో 128 కోట్లు విలువైన 113 పనులు పూర్తయినట్లు తెలిపారు. ఈ సందర్భములో గౌరవ మంత్రి మాట్లాడుతూ, ఇంకా కొన్ని చోట్ల జీరో బిజినెస్ జరుగుతున్నట్లు ప్రభుత్వం దృష్టికి వస్తుందని, దీని పట్ల కఠినంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. జీరో బిజినెస్ చేసే ట్రేడర్ల లైసెన్సు రద్దు చేయడానికి ఉపేక్షించవద్దని, అదేవిధంగా దీనికి ఎవరైనా అధికారులు సహకరిస్తే క్రమశిక్ష చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశించారు. అభివృద్ధి పనులను వేగవంతంగా చేయాలని, వాటి పురోగతిని రోజు వారి సమీక్షించేటందుకు వీలుగా ఒక డాష్ బోర్డు ను ఏర్పాటు చేయాల్సిందిగా ఆదేశించారు. మార్కెట్ యార్డ్ లకు వచ్చే రైతులకు సౌకర్యం కల్పించే పనులను ప్రాధాన్యత పాతిపదికన చేపట్టాలని అదేవిధంగా, పంట ఉత్పత్తులు రక్షించే విధంగా చేపట్టే పనులకు ప్రాధాన్యత ఇవ్వాల్సిందిగా సూచించారు. మార్కెటింగ్ డిపార్ట్మెంట్ లో ఇంజనీరింగ్ విభాగములో అవసరమైతే మరికొంత మందిని వేరే శాఖల నుండి డిప్యూటేషన్ పై తీసుకొనే అవకాశాన్ని పరిశీలించాల్సిందిగా సెక్రటరీగారిని మంత్రి కోరారు.
గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీలో 'స్మార్ట్ మార్కెట్ యార్డ్ ' సాఫ్ట్ వేర్ ల ద్వారా మార్కెట్ కార్యదర్శులు పర్యవేక్షిస్తున్నట్లు అధికారులు మంత్రికి తెలిపారు. మంత్రి స్పందిస్తు ఒక సీజన్ లో అమలు చేసిన తరువాత, ఆశాజనక ఫలితాలు ఉంటే, అన్నీ మార్కెట్ యార్డ్ కమిటీలను " డిజిటలైజేషన్ చేసి జీరో బిజినెస్ ను ఆరికట్టే విధంగా చర్యలు తీసుకోవాల్సిందిగా అధికారులను ఆదేశించారు. మార్కెట్ కమిటీల అభివృద్ధి, నిర్వహణకు అవసరమైన బడ్జెట్ ల ప్రభుత్వం సమయానికి విడుదల చేస్తున్నట్లు తెలిపారు. కోహెడ పండ్ల మార్కెట్ ను సంబంధించి ఎంపిక చేసిన ప్రదేశంలో సర్వే పూర్తయిందని, పనులను చేపట్టడానికి టెండర్ల ప్రక్రియ త్వరలో చేపట్టనున్నట్లు తెలిపారు. మార్కెట్ కమిటీ అభివృద్ధి పనులైనా కోహెడ మార్కెట్ పనులైనా, ప్రతీది నిర్ధిష్ట కాలపరిమితి పెట్టుకొని దాని ప్రకారం రోజువారీ, ప్రగతి సమీక్షించుకొంటూ ముందుకు వెళ్తే తప్ప పనులు మనం అనుకొన్న సమయంలో పూర్తికావని కాబట్టి అధికారులు అందరూ ప్రతీ పనికి, ప్రారంభతేది, గడువు తేది నిర్ధారించుకొని ముందుకు వెళ్ళాలని నిర్దేశించారు.
HACA ద్వారా 5 సంవత్సరాల సమగ్ర నిర్వహణలో వ్యవసాయ మార్కెట్ కమిటీల అంతటా విద్యుత్ బిల్లుల తగ్గించడానికి గ్రిడ్ ను అను సంధిస్తూ సోలార్ రూప టాప్ ప్యానెల్ ల ద్వారా విద్యుత్పత్తి అవకాశాలను పరిశీలించాలని కోరారు. ఇప్పటికే ఈ దిశలో ప్రయోగాత్మకంగా 4 మార్కెట్ యార్డ్ లలో చేపట్టిన పనుల పురోగతి పై ఆరాతీశారు. దీనికి అధికారులు సమాధానమిస్తూ టెండర్ల ప్రక్రియ పూర్తయిందని జులై చివరి కల్ల సోలార్ ప్యానెళ్ళు నిర్మించి విద్యుత్ ఉత్పాదన చేసే విధంగా చర్యలు తీసుకొన్నట్లు పేర్కొన్నారు.
**పంటల కొనుగోళ్లు :-** గత ఖరీఫ్‌లో చేపట్టిన ప్రత్తి కొనుగోళ్లు పూర్తయిందని ప్రస్తుతం మార్కెట్ లలో మిర్చి అధికమొత్తంలో వస్తుందని, రైతులకు మంచి ధర దక్కేటందుకు అన్నీ చర్యలు తీసుకొంటున్నట్లు మార్కెటింగ్ డైరెక్టర్ తెలిపారు. ధాన్యం కొనుగోళ్లకు కూడా ప్రభుత్వం ఆరంభించనున్నందున కొనుగోళ్లకు అవసరమైన సామగ్రి అన్నీ కొనుగోళ్ళ కేంద్రాలలో అందుబాటులో ఉంచాలని, ముఖ్యంగా టర్పాలిన్ లు, తేమ శాతం కొలిచే పరికరాలు, క్లీనింగ్ డ్రైయర్లు అవసరమైనన్ని సిద్ధంగా ఉంచాలని కోరారు. మొక్కజొన్న కొనుగోళ్లకు సంబంధించి మార్కఫెడ్ అధికారులు కొనుగోళ్ళ కేంద్రాలకు తీసుకువచ్చే ధాన్యం పటిష్ట చర్యలు తీసుకోవాలని, కొనుగోళ్ళ కేంద్రాలకు తీసుకువచ్చే రైతుల ఉత్పత్తులను పరిరక్షించే విధంగా ముందుగా మార్కెట్ యార్డ్ లలో కొనుగోలు సెంటర్ల ఏర్పాటు చేయాలని, అదే విధంగా రైతుల వద్ద నుండే సేకరించే మొక్కజొన్నకు సంబంధించిన మొత్తాన్ని రైతుల ఖాతాలకు విడుదల చేసేటందుకు, గౌరవ ముఖ్యమంత్రి అనుమతితో నిధులు సమకూరు స్తామని మంత్రి తెలిపారు. ఈ సమీక్ష సమావేశంలో సురేంద్ర మోహన్ ఐఏఎస్, కార్యదర్శి తో పాటు మార్కెటింగ్ డైరెక్టర్ శ్రీమతి లక్ష్మీబాయి, మార్కఫెడ్ మానేజింగ్ డైరెక్టర్ శ్రీ శ్రీనివాస్ రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## 24 ఏళ్లలో మోదీపై ఒక్క అవినీతి మచ్చ లేదు- టీఎంసీ దోచుకున్న ప్రతి పైసా తిరిగి వసూలు చేస్తాం: అమిత్ షా

ప్రధాని మోదీ గుజరాత్‌లో 12 ఏళ్లు పాలించారు. కేంద్రంలో మరో 12 ఏళ్లుగా నాయకత్వం వహిస్తున్నారు. అయినా సరే ఒక్క రూపాయి అవినీతి ఆరోపణ కూడా ఎదుర్కోలేదు. బంగాల్‌లో బీజేపీని అధికారంలోకి తీసుకురండి. టీఎంసీ నాయకులు ప్రజల నుంచి దొంగలించిన ప్రతి పైసాను, వడ్డీతో సహా మేం తిరిగి రాబడతాం" అని అమిత్ షా తెలిపారు.

**టీ తోట కార్మికులకు భూ హక్కులు** బీజేపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత టీచర్ల నియామక స్కాంలో రూ.300 కోట్లు, ఉత్తర బంగాల్ వరద సహాయ నిధుల్లో రూ.100 కోట్లు దుర్వినియోగం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అమిత్ షా హెచ్చరించారు. ఉత్తర బంగాల్ మూడు 'టీ'లతో (టీ, టింబర్, టూరిజం) ప్రసిద్ధి చెందిందని, కానీ సీఎం మమతా నాలుగో టీగా బీజేపీ కార్యకర్తల కన్నీళ్లను జోడించారని విమర్శించారు. ఉత్తర బంగాల్ అభివృద్ధికి ప్రత్యేక పథకాలు అమలు చేస్తామని హామీ ఇచ్చారు. టీ తోట కార్మికులకు భూ హక్కులు కల్పించి వారిని భూస్వాములుగా మారుస్తామని వెల్లడించారు. టీఎంసీ గూండాలను గుర్తించి చట్టం ముందు నిలబెట్టడం తమ బాధ్యతగా భావిస్తున్నామని తెలిపారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రం (ఈవీఎం)లో కమలం గుర్తుపై ఓటు వేసి బీజేపీని అధికారంలోకి తీసుకురావాలని ప్రజలను కోరారు.

**'లవ్, ల్యాండ్ జిహాద్‌కు ముగింపు పలుకుతాం' :** ప్రజలు బీజేపీ ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకురావాలని, అప్పుడు బంగాల్ అంతటా ఎవరూ నాలుగు వివాహాలు చేసుకోలేరని అమిత్ షా తెలిపారు. తాము లవ్, ల్యాండ్ జిహాద్‌కు ముగింపు పలుకుతామని అన్నారు. అలాగే మహిళలకు ప్రతి నెలా రూ. 3 వేలు, నిరుద్యోగ యువతకు రూ. 3000 ఇస్తామమని చెప్పారు. తల్లులు, సోదరీమణులు ప్రభుత్వ బస్సుల్లో టికెట్లు కొనాల్సిన అవసరం ఉండదు, వారు ఉచితంగా ప్రయాణించగలుగుతారుని అన్నారు.

## తెలంగాణలో భగ్గుమన్న సూరీడు..

ఈ నేపథ్యంలో వాతావరణ శాఖ కీలక హెచ్చరిక జారీ చేసింది. రానున్న ఐదు రోజుల పాటు ఎండల తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని, ఉష్ణోగ్రతలు 45 డిగ్రీల మార్కును కూడా దాటవచ్చని అధికారులు తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా వృద్ధులు, పిల్లలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు.రాష్ట్ర వ్యాప్తంగా ఎండలు దంచికొడుతున్నాయి. గరిష్ఠ ఉష్ణోగ్రతలు 43 డిగ్రీలకు పైగా నమోదవుతున్నాయి. రానున్న మూడు రోజులు గరిష్ఠ ఉష్ణోగ్రతలు క్రమేపీ ఒకటి నుంచి రెండు డిగ్రీలు పెరిగే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. ఒకవైపు ఎండల తీవ్రత మరో వైపు ఉక్కపోతతో జనం అల్లాడిపోతున్నారు. ఉదయం 10 గంటలు దాటిందంటే ప్రజలు ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకు బయపడుతున్నారు. నిన్న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 43.3 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

**జాగ్రత్తలు తీసుకోవాలని అధికారుల సూచనలు :** రానున్న మూడు రోజులు గరిష్ఠ ఉష్ణోగ్రతలు క్రమేపీ ఒకటి నుంచి రెండు డిగ్రీలు పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఇవాళ, రేపు, ఎల్లుండి పలు జిల్లాల్లో వడ గాల్పులు వీచే అవకాశం ఉందని, ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు. మధ్యాహ్నం సమయంలో ప్రజలు అవసరమైతేనే బయటకు రావాలని అధికారులు సూచిస్తున్నారు. డీహైడ్రేషన్ బారిన పడకుండా చల్లని నీరు, మజ్జిగ, కొబ్బరి నీరు లాంటివి మధ్యమధ్యలో తీసుకోవాలన్నారు. ఎండ నేరుగా తగలకుండా టోపీ లేదా గొడుగు ఉపయోగించడం మంచిదని సూచించారు.

**పలు జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ :** ఇవాళ ఉమ్మడి ఆదిలాబాద్, మహబూబ్ నగర్, నిజామాబాద్‌తో పాటు ఖమ్మం, మెదక్, మేడ్చల్ మల్కాజిగిరి, హైదరాబాద్ జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేశారు. రేపు ఉమ్మడి ఆదిలాబాద్, ఖమ్మం, మహబూబ్ నగర్‌తో పాటు నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, మేడ్చల్ మల్కాజ్‌గిరి, హైదరాబాద్ జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేశారు. ఎల్లుండి ఉమ్మడి ఆదిలాబాద్, ఖమ్మం, మహబూబ్ నగర్‌తో పాటు నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, మేడ్చల్ మల్కాజ్ గిరి, హైదరాబాద్ జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేశారు. ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసిన జిల్లాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 41 నుంచి 44 డిగ్రీల మేర నమోదయ్యే అవకాశం ఉందని తెలిపారు.

## మహిళా రిజర్వేషన్ బిల్లుకు కేసీఆర్ పూర్తి మద్దతు.. డీలిమిటేషన్‌పై వార్నింగ్

**హైదరాబాద్ వెలుతురు ఏప్రిల్ 15:** మహిళా రిజర్వేషన్ బిల్లు, నియోజకవర్గాల పునర్విభజన అంశాలపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తన గళాన్ని వినిపించారు. ఎర్రవెల్లిలోని ఫామ్ హౌస్ లో పార్టీ ముఖ్యనేతలు కేటీఆర్, హరీశ్ రావులతో నిర్వహించిన భేటీలో జాతీయ రాజకీయ పరిణామాలు, దక్షిణాది రాష్ట్రాల ప్రయోజనాలపై ఆయన సుదీర్ఘంగా చర్చించా రు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ... చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లుకు బీఆర్ఎస్ సంపూర్ణ మద్దతు ఇస్తుందని ప్రకటించారు. గతంలోనే తాము అసెంబ్లీలో దీనికి అనుకూలంగా తీర్మానం చేశామని గుర్తు చేస్తూ, రాజ్యసభలో తమ ఎంపీలు ఈ బిల్లుకు మద్దతు తెలుపుతారని స్పష్టం చేశారు. ఇదే సమయంలో... నియోజకవ ర్గాల పునర్విభజన వల్ల దక్షిణాది రాష్ట్రాలకు జరిగే అన్యాయంపై కేసీఆర్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.
ప్రస్తుతం లోక్‌సభలో దక్షిణాది రాష్ట్రాలకు 24 శాతం ఎంపీ సీట్లు ఉన్నాయని... జనాభా నియంత్రణను సమర్థవంతంగా అమలు చేసిన దక్షిణాది రాష్ట్రాల సీట్ల శాతం (ప్రస్తుతం ఉన్న 24 శాతం) తగ్గకుండా చూడాలని డిమాండ్ చేశారు. ఒకవేళ దక్షిణాది ప్రయోజనాలకు విఘాతం కలిగితే రాజీలేని పోరాటం చేస్తామని కేంద్రానికి హెచ్చరికలు జారీ చేశారు. ఈ నెల 20న జగిత్యాలలో జరగనున్న భారీ బహిరంగ సభ, అలాగే ఏప్రిల్ 27న పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలని కేటీఆర్, హరీశ్ రావులను ఆదేశించారు.

## అదే జరిగితే కేసీఆర్ ముందుండి ఉద్యమాన్ని నడిపిస్తారు: బీజేపీకి కేటీఆర్ హెచ్చరిక

**హైదరాబాద్ వెలుతురు ఏప్రిల్ 15:** నియోజకవర్గాల పునర్విభజన బిల్లులో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరిగితే కేసీఆర్ ముందుండి ఉద్యమాన్ని నడిపిస్తారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. డీలిమిటేషన్ బిల్లు పేరుతో మనకు అన్యాయం జరిగితే కేసీఆర్ నాయకత్వంలో ఉద్యమం మొదలవుతుందని హెచ్చరించారు. పార్లమెంటులో ప్రస్తుతం దక్షిణాది రాష్ట్రాల వాటా 24 శాతంగా ఉందని, డీలిమిటేషన్ తర్వాత ఇది అలాగే ఉండాలని అన్నారు. బీజేపీ పార్టీ తెలంగాణకు ఎప్పుడూ మంచి చేయదని విమర్శించారు. అసెంబ్లీ నియోజకవర్గాలు, పార్లమెంటు సీట్లను 50 శాతం పెంచుతామని కిషన్ రెడ్డి చెబుతున్నారని, కానీ డీలిమిటేషన్ బిల్లులో ఆ అంశమే లేదని అన్నారు. కిషన్ రెడ్డి చెప్పిన ప్రకారం అసెంబ్లీ స్థానాలు 119 నుంచి 179కి, 17 లోక్ సభ స్థానాలకు 26 పెరుగుతాయని చెప్పారని తెలిపారు. కానీ బిల్లులో ఈ పెరుగుదల లేదని అన్నారు. బీజేపీ ఎప్పుడూ తెలంగాణకు మిత్రుడు కాదని విమర్శించారు. 2014 ఏపీ పునర్విభజన బిల్లులోనే సీట్ల పెంపు హామీ ఉందని గుర్తు చేశారు. కానీ ఇప్పటి వరకు ఆ హామీని నెరవేర్చలేదని అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు బీఆర్ఎస్ అనుకూలమేనని, కానీ డీలిమిటేషన్ బిల్లులో మాత్రం తెలంగాణకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. దేశవ్యాప్తంగా నియోజకవర్గాల పునర్విభజనను అమలును వేగవంతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది.

## విదేశీ పర్యాటకునితో మంత్రి జూపల్లి ముచ్చట

**హైదరాబాద్, వెలుతురు ఏప్రిల్ 15:** చారిత్రక చౌమొహల్లా ప్యాలెస్‌లో బుధవారం ఒక ఆసక్తికర సన్నివేశం చోటుచేసుకుంది. ప్యాలెస్ సందర్శనకు వచ్చిన పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుకు బ్రిటన్ నుంచి వచ్చిన ఓ పర్యాటకుడు తారసపడ్డారు. దీంతో మంత్రి సదరు విదేశీయుడితో ముచ్చటించారు. హైదరాబాద్ పర్యటన ఎలా సాగుతోందని మంత్రి ఆయనను అడిగి తెలుసుకున్నారు. నగరంలో ఇంకా ఏయే ప్రదేశాలు చూశారని వాకబు చేయగా.. ఇప్పటికే తాము కుతుబ్‌షాహీ సమాధులను దర్శించుకున్నట్లు ఆ పర్యాటకుడు బదులిచ్చారు. భాగ్యనగర ఆతిథ్యం ఎలా ఉంది? ఇక్కడి రుచికరమైన వంటకాలు నచ్చాయా? అని మంత్రి వాకబు చేశారు. పర్యాటకుల నుంచి లభించే సలహాలు, సూచనల ఆధారంగా రాష్ట్రంలోని చారిత్రక కట్టడాల వద్ద సౌకర్యాలను మరింత మెరుగుపరుస్తామని ఈ సందర్భంగా మంత్రి జూపల్లి పేర్కొన్నారు. తెలంగాణ పర్యాటక రంగాన్ని అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా తీర్చిదిద్ది, విదేశీ పర్యాటకులకు గమ్యస్థానంగా మారుస్తామని ఆయన పునరుద్ఘాటించారు.

## ఎక్సైజ్ శాఖలో సమసిన వివాదం

**హైదరాబాద్ వెలుతురు ఏప్రిల్ 15:** ఎక్సైజ్ శాఖలో గతనాలుగైదు రోజులుగా జరుగుతున్న పరిణామాలపై బుధవారం రోజున ఎక్సైట్ కమీషనర్ ను తెలంగాణ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ (టీజీజేఏసీ ) పక్షాన కలిసి వివరణ అడగగా, సుమారు మూడువేలమంది ఎక్సైజ్ కానిస్టేబుల్స్ మరియు హెడ్ కానిస్టేబుల్స్ బదిలీలను రాష్ట్రంలోని ఏడు జోన్ల పరిదిలో 2018 రాష్ట్రపతి ఉత్తర్వుల ప్రకారం వారం రోజుల నుండి రాత్రి పగలు కమిషనర్ తోపాటు రాష్ట్రంలోని ఎక్సైజ్ ఉన్నతాధికారులు అందరం కలిసి పని చేయడం వల్ల కొంత ఒత్తిడికి లోనై, ఒక అధికారినీ పనిలో భాగంగా ఒక మాట అనడం వాస్తవం, కమీషనర్ ఆ మాటను ఉద్దేశ్య పూర్వకంగా అన్నమాట కాదు అని, ఈ విషయం పై నేను విచారం వ్యక్తం చేస్తున్నానని ఎక్సైజ్ కమీషనర్ తెలంగాణ ఉద్యోగుల జాంట్ యాక్షన్ కమిటీ నాయకత్వంతో తెలిపారు.
ఎక్సైజ్ శాఖలో కొంతమంది జిల్లా, రాష్ట్ర స్థాయి డిపార్ట్మెంట్ అధికారులు కూడా వారి క్రింది స్థాయి ఉద్యోగులపై మాటలు తూలుతున్నారని టీజీజేఏసీ దృష్టిలో వచ్చినట్లు, వారు కూడా వారి పద్ధతిని మార్చుకొని సరైన విధంగా పనితీసుకొని క్రమశిక్షణతో ఎక్సైజ్ శాఖ ఉన్నతి కొరకు పనిచేస్తూ, రాష్ట్ర ఆదాయాన్ని పెంచే విధంగా కృషిచేయాలి అని టీజీజేఏసీ తెలుపుతుంది.
కొన్ని రాజకీయ పక్షాలు, ఎక్సైజ్ శాఖ విషయంలో జోక్యం చేసుకొని వ్యక్తిగత లబ్ధి పొందుటకు ప్రయత్నం చేయటం, ప్రభుత్వాన్ని బదనామ్ చేయటం శోచనీయం. దయచేసి ఉద్యోగులు, అధికారులు మరియు ప్రభుత్వం మధ్య ఆఘాతం సృష్టించవద్దని తెలపనైనది.
వరంగల్, జనగామ జిల్లాల కలెక్టర్లు మరియు రాష్ట్ర ఎన్నికల సంఘంలో పని చేస్తున్న ఒక ఉన్నతాధికారితో సహ ఇంకొంత మంది జిల్లా మరియు రాష్ట్ర స్థాయి పై అధికారులు వారి క్రింద పనిచేసే సిబ్బందిపై మాటలు జారుతూ ప్రభుత్వానికి చెడ్డ పేరు తెస్తున్నట్లు తెలియ వచ్చింది వారు కూడ వారి పద్ధతిని మార్చుకోవాలి లేనట్టైతే వారిపై సంబందిత శాఖ కార్యదర్శులకు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికీ, సంబందిత శాఖ మంత్రీ వర్యులకు మరియు గౌరవ ముఖ్యమంత్రి వర్యుల దృష్టికీ తీసుకెళ్తామని ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యోగుల జేఏసీ ఒక ప్రకటన లో తెలియజేశారు. అవసరమైతే ప్రత్యక్ష కార్యాచరణ చేపడతామని తెలిపినారు. ఈ కార్యక్రమంలో టీజీజేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రెటరీ జనరల్ ఏలూరి శ్రీనివాస రావు, ూవీ. హుస్సిని(ముజీబ్), బి. శ్యామ్, తెలంగాణ ప్రొహిబిషన్ & ఎక్సైజ్ గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్ష కార్యదర్శులు టి. లక్ష్మణ్ గౌడ్, చంద్ర శేఖర్, ఎం. బి కృష్ణ యాదవ్, డా కె రామారావు, ఎం. జ్ఞానేశ్వర్, కె విజయ్ కుమార్, రామా కృష్ణ, శ్రావణ్ కుమార్ శ్రీనివాసులు, ఏడుకొండలు, శిరీష, ఎం. రాజిరెడ్డి, షౌకత్ హుస్సైన్, మొగిలియ నాయక్ తదితరుల పాల్గొన్నారు.

# పిల్లల నుంచే ట్రాఫిక్ నిబంధనలపై

# అవగాహన ఉండాలి: మంత్రి పొన్నం ప్రభాకర్

ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన 'చిల్డ్రన్స్ ట్రాఫిక్ అవేర్నెస్ పార్క్'ను మంత్రి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని జ్యోతి వెలిగించి ప్రారంభించి, విద్యార్థులతో రహదారి భద్రతపై ప్రతిజ్ఞ చేయించారు.

అనంతరం మంత్రి మాట్లాడుతూ.. 'మొక్కై వంగనిది మానై వంగునా' అన్న సామెతను గుర్తు చేస్తూ, చిన్న వయసులోనే ట్రాఫిక్ నియమాలపై అవగాహన లేకపోతే భవిష్యత్తులో ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందన్నారు. ఈ పార్క్ ద్వారా విద్యార్థులు ట్రాఫిక్ సిగ్నల్స్, రోడ్డు గుర్తులపై ప్రత్యక్షంగా అవగాహన పెంచుకోవచ్చని తెలిపారు. జిల్లాలోని ప్రతి పాఠశాల నుంచి విద్యార్థులు ఇక్కడికి వచ్చి అవగాహన పొందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రహదారి భద్రతలో నాలుగు అంశాలు ఎడ్యుకేషన్, ఇంజనీరింగ్, ఎన్ఫోర్స్మెంట్, ఎమర్జెన్సీ కీలకమని మంత్రి వివరించారు. గతంలో ప్రమాదం జరిగితే సాక్ష్యంగా ఉండాల్సి వస్తుందనే భయంతో ఎవరూ ముందుకు వచ్చేవారు కాదని, కానీ ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'రహవీర్' అవార్డు ద్వారా ప్రాణాలు కాపాడిన వారికి 25 వేల నగదు బహుమతితో పాటు సత్కారం అందిస్తున్నట్లు గుర్తుచేశారు. హెల్మెట్ ధరించడం, మద్యం సేవించి వాహనం నడపకపోవడం, రాంగ్ రూట్‌లో వెళ్లకపోవడం వంటి జాగ్రత్తలు పాటించాలని కోరారు. భవిష్యత్తులో పాఠశాల పాఠ్యాంశాల్లో కూడా రహదారి భద్రతను ఒక అంశంగా చేర్చే దిశగా ప్రభుత్వం ఆలోచిస్తోందని మంత్రి వెల్లడించారు. స్థానిక శాసన సభ్యులు పాయల్ శంకర్ మాట్లాడుతూ, రహదారి నిబంధనల పాటించడం ప్రతి ఒక్కరి బాధ్యతన్నారు. నిత్యం జరుగుతున్న రోడ్డు ప్రమాదాల వల్ల ఎంతో మంది అమాయకులు ప్రాణాలు కోల్పోవడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు.

సాంకేతికతతో మనిషి దేనినైనా తిరిగి పొందగలడు కానీ, ప్రాణాన్ని మాత్రం తిరిగి తీసుకురాలేమని, కాబట్టి ప్రతి ఒక్కరూ రహదారి నిబంధనల పట్ల అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ముఖ్యంగా యువత, విద్యార్థులు ట్రాఫిక్ రూల్స్‌ను తూచా తప్పకుండా పాటించాలని కోరారు. కేవలం పోలీసుల జరిమానాలకే భయపడకుండా, తమ ప్రాణ రక్షణ కోసం నిబంధనలు పాటించాలనే ఆలోచన ప్రజల్లో కలగాలని ఆయన



ఆకాంక్షించారు. రహదారి భద్రతపై అవగాహన కేవలం పట్టణాలకే పరిమితం కాకుండా, ప్రతి గ్రామంలోని పాఠశాలలు, పంచాయతీల వరకు విస్తరించాల్సిన అవసరం ఉందని చెప్పారు. జాతీయ రహదారులపై మితిమీరిన వేగంతో ప్రయాణించడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని, ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని ఆయన తెలిపారు. ఖానాపూర్ శాసనసభ్యులు వెడ్మ బొజ్జు పటేల్ మాట్లాడుతూ, రహదారి నిబంధనలు కచ్చితంగా పాటించడం ద్వారా ప్రమాదాలను తగ్గించి అమూల్యమైన ప్రాణాలను రక్షించుకోవచ్చని అన్నారు. ప్రస్తుతం పెరుగుతున్న రోడ్డు ప్రమాదాల దృష్ట్యా ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా వాహనాలు నడపాలని, ముఖ్యంగా యువత ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. చిన్న ప్రయాణమైనా హెల్మెట్ ధరించడం అలవాటు చేసుకోవాలని, తల్లిదండ్రులు తమ పిల్లల్లో ఈ అలవాటు పెంపొందించాలని కోరారు. ట్రాఫిక్ సిగ్నల్స్‌ను గౌరవించడం, డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్ వంటి పత్రాలను ఎల్లప్పుడూ వెంట ఉంచుకోవడం అవసరమని తెలిపారు. ఉట్నూర్ ఏజెన్సీ ప్రాంతానికి కేంద్రంగా ఉన్నందున ఇక్కడ ఆర్‌టీఓ యూనిట్ కార్యాలయం ఏర్పాటు చేయాలని కోరారు. ఉట్నూర్ బస్టాండ్ పరిసరాల్లో ఖాళీ స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టి స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని సూచించారు. ఉట్నూర్ నుండి ఆదిలాబాద్‌కు ఉదయం వేళల్లో ఉద్యోగాలు, విద్య కోసం వెళ్లే ప్రజల సౌకర్యార్థం కనీసం రెండు నాన్‌స్టాప్ మినీ బస్సులను ప్రవేశపెట్టాలని విజ్ఞప్తి చేశారు. మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూషా మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నియమాలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ముఖ్యంగా సెల్‌ఫోన్ వినియోగం, మద్యం సేవించి డ్రైవింగ్, అతివేగం ప్రమాదకరమని హెచ్చరించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని కోరారు. ప్రజలు బాధ్యతాయుతంగా వాహనాలు నడిపి ప్రమాద రహిత సమాజం నిర్మాణానికి సహకరించాలని పిలుపునిచ్చారు. రవాణా శాఖ ప్రిన్సిపాల్ సెక్రెటరీ వికాస్ రాజ్ మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాలను నివారించడం, ప్రాణనష్టాన్ని తగ్గించడం లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకమైన 'ఎరైవ్ అలైవ్' కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని తెలిపారు. చిన్నతనం నుంచే ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించేందుకు ప్రతి పాఠశాలలో ట్రాఫిక్ అవేర్నెస్ పార్క్ ఉండాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులతో పాటు వెనుక కూర్చునే వారు కూడా తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. రోడ్డు ప్రమాదానికి గురైన వారికి 1.5 లక్షల రూపాయల వరకు ఉచిత వైద్య సహాయాన్ని ప్రభుత్వం అందిస్తుందని, దీని కోసం రాష్ట్రవ్యాప్తంగా సుమారు 300 ఆసుపత్రులను గుర్తించడం జరిగిందని తెలిపారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను తూచా తప్పకుండా పాటించి ప్రమాద రహిత సమాజ స్థాపనకు సహకరించాలని కలెక్టర్ కోరారు. ఆర్ టి సి ఎండి నాగిరెడ్డి మాట్లాడుతూ, గత ఏడాది జిల్లాలో 117 మంది రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందగా, ఎక్కువ మంది ద్విచక్ర వాహనదారులేనని తెలిపారు. హెల్మెట్ వినియోగం తప్పనిసరి అని సూచించారు. తెలంగాణ ఆర్టీసీ సేవలను ప్రశంసిస్తూ, డ్రైవర్లకు మెరుగైన శిక్షణ కోసం సిమ్యులేటర్లు అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు చెప్పారు. జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంపే ప్రాణరక్షకు మార్గం అని అన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణలో ప్రజల అవగాహన అత్యంత కీలకమని తెలిపారు. విద్యార్థులకు చిన్న వయసు నుంచే ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించేందుకు 'ఖాకీ కిడ్స్' కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. జిల్లాలో గత వారం రోజుల్లో 14 నుంచి 17 సంవత్సరాల మధ్య వయస్సు గల సుమారు 400 మంది మైనర్లు వాహనాలు నడుపుతూ గుర్తించబడినట్లు తెలిపారు. వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించి, మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని హెచ్చరించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ కఠినతరం చేయడంతో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు తగ్గుముఖం పట్టినట్లు తెలిపారు. రోడ్డు ప్రమాదాల వల్ల కుటుంబాలు తీవ్రంగా ప్రభావితమవుతున్నాయని, అందువల్ల ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించి బాధ్యతాయుతంగా ప్రవర్తించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం రోడ్డు భద్రత నియమాలపై అవగాహనా కల్పించిన విద్యార్థులను మంత్రి అభినందించి, మెడల్ లను అందించారు.

ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ ఛైర్మెన్ మల్లెపూల నర్సయ్య, జిల్లా ఇంచార్జి కలెక్టర్ యువరాజు మర్మాట్, ఎస్పీ అఖిల్ మహాజన్, అదనపు కలెక్టర్ రాజేశ్వర్, ఆర్డీఓ స్రవంతి, రవాణా శాఖ డిప్యూటీ ట్రాన్స్పోర్ట్ కమిషనర్ పి. రవీందర్ కుమార్ గౌడ్, మోటార్ వెహికిల్ ఇన్స్పెక్టర్ ఎస్. శ్రీనివాస్, అసిస్టెంట్ మోటార్ వెహికిల్ ఇన్స్పెక్టర్ కె. హరీంద్ర కుమార్, అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## సెవెన్ టూంబ్స్ కటోరా హౌస్, కేబీ మ్యూజియంను ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ తో కలిసి క్షేత్ర స్థాయిలో పరిశీలించిన పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు





**హైదరాబాద్ వెలుతురు ఏప్రిల్ 15:** కుతుబ్ షాహీ టూంబ్స్ లోని ఇంటర్ప్రిటేషన్ సెంటర్ లో జరుగుతున్న పనులను పరిశీలించారు. వక్ఫ్ ట్రిబ్యునల్‌లో కేసు పెండింగ్ గురించి చర్చించారు. కేసు పూర్వాపరాలను గురించి వివరించారు. ట్రిబ్యునల్ పరిధిలో పెండింగ్ లో ఉన్న పనులను మినహాయించి, మిగిలిన పనులను వారంలోగా ప్రారంభించి, వెంటనే పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

**రోప్ వే..** కుతుబ్ షాహి టూంబ్స్ నుంచి గోల్కొండ కోట వరకు 1.3 కిలోమీటర్ల రోప్ వే నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలు ఏ స్థాయిలో ఉన్నాయని ఆరా తీశారు. క్లియరెన్స్ స్టేజిలో ఉన్నాయని, ఆయా శాఖల నుంచి అనుమతులు వచ్చిన వెంటనే డీపీఆర్ సిద్ధం చేస్తామని అధికారులు చెప్పారు.

**అనంతరం కటోరా హౌస్‌ను సందర్శించారు.**

పురావస్తు శాఖ, GHMC, HMDA, కులీకుతుబ్ షా అర్బన్ డెవలప్మెంట్ ఆటోఆరిటీని సమన్వయం చేసుకుని , డీపీఆర్ ను సిద్ధం చేయాలని పర్యాటక శాఖ అధికారులను ఆదేశించారు. కటోరా హౌస్ ను పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలని సూచించారు. కటోరా హౌసే పరిసర ప్రాంతాల్లో ఉన్న వ్యర్థాలను వెనువెంటనే తొలగించాలని +నవీజ అధికారులు ఆదేశించారు. తర్వాత గోల్కొండ కోట సమీపంలోని బస్ స్టాప్ వద్ద ఉన్న ఖాళీ ప్రదేశంలో లాడ్ బజార్ తరహాలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాన్నారు. ఈ ప్రతిపాదనలను నేషనల్ మోనుమెంట్ మిషన్ అథారిటీకి పంపి అనుమతులు పొందాలని సూచించారు. అక్కడి నుంచి ఖజానా బిల్డింగ్ మ్యూజియంకు చేరుకున్నారు. ఎంతో చారిత్రాత్మక విలువైన కళాఖండాలు ఉన్న ఈ మ్యూజియంను పర్యాటకంగా అభివృద్ధి చేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ ప్రదేశంలో చేనేత వస్త్రాల ( ఖాదీ) ప్రదర్శన ను ఏర్పాటు చేయాలని పురావస్తు , టీజీటీడీసీ, ~~~~~ అధికారులను ఆదేశించారు. కేబీ మ్యూజియం వెనక భాగంలో ఉన్న ఆక్రమణలను పోలీస్ శాఖ సహకారంతో వారం రోజుల్లో తొలగించాలని అన్నారు.

**ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ..**

తెలంగాణలో అద్భుతమైన చారిత్రక కట్టడాలు, వారసత్వ సంపద, ప్రకృతి రమణీయ ప్రదేశాలు ఉన్నాయని, వాటిని ప్రపంచ పర్యాటకులకు పరిచయం చేసేలా ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. దేశీయ, అంతర్జాతీయ పర్యాటకులను ఆకర్షించేలా వాటిని అభివృద్ధి చేయడంతో పాటు మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీజీటీడీసీ ఎండీ గౌతమి, పురావస్తు శాఖ డైరెక్టర్ అర్జున రావు, ఇతర శాలల అధికారులు పాల్గొన్నారు.

## రేవంత్ రెడ్డిపై కాంగ్రెస్ పార్టీ పట్టు కోల్పోయింది: జీవన్ రెడ్డి

**హైదరాబాద్ వెలుతురు ఏప్రిల్ 15:** రేవంత్ రెడ్డిపై కాంగ్రెస్ పార్టీ పట్టు కోల్పోయిందని మాజీ మంత్రి జీవన్ రెడ్డి విమర్శించారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ రేవంత్ రెడ్డి ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీగా మారిందని ఎద్దేవా చేశారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఎమ్మెల్యేలకు రేవంత్ రెడ్డి కనీసం అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వడంలేదని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీని రేవంత్ రెడ్డి ఖతం చేస్తున్నాడని అన్నారు. కేసీఆర్ తన వయసును గౌరవించి 'అన్న' అని పిలుస్తారని తెలిపారు. కేసీఆర్‌కు ప్రజలంటే గౌరవం ఉందని, ఆయన రేవంత్ రెడ్డి లాంటి వ్యక్తి కాదని వ్యాఖ్యానించారు. తాను బీఆర్ఎస్ పార్టీలో చేరడంపై స్పందిస్తూ, ఆఖరి వరకు ప్రజల కోసమే పోరాడతానని స్పష్టం చేశారు. సాధారణంగా పార్టీ సూచనలను బట్టి ప్రభుత్వం నడుస్తుందని, కానీ రేవంత్ రెడ్డి పాలనలో ప్రభుత్వం సూచన మేరకు పార్టీ నడుస్తుందని విమర్శించారు.

## బిహార్ సీఎంగా సమ్రాట్ చౌధరీ ప్రమాణస్వీకారం- తొలి బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు

**హైదరాబాద్ వెలుతురు ఏప్రిల్ 15:** బిహార్ రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. రాష్ట్రానికి చెందిన సీనియర్ బీజేపీ నేత సమ్రాట్ చౌధరీ నూతన ముఖ్యమంత్రిగా బుధవారం ఉదయం బాధ్యతలు చేపట్టారు. పట్నాలోని లోక్ భవన్‌లో జరిగిన ఘన కార్యక్రమంలో గవర్నర్ సయ్యద్ అతా హస్నైన్ ఆయన చేత ప్రమాణ స్వీకారం చేయించారు. ఆ కార్యక్రమానికి మాజీ ముఖ్యమంత్రి, జేడీయూ అధినేత నీతీశ్ కుమార్ తోపాటు పలు బీజేపీ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, జాతీయ నాయకులు హాజరయ్యారు. రాజ్యసభకు ఎన్నికవ్వడంతో నీతీశ్ కుమార్ ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయడం ద్వారా ఆ మార్పులకు నాంది పలికింది. దీంతో బిహార్‌లో తొలిసారిగా బీజేపీ సొంతంగా ప్రభుత్వం ఏర్పాటు చేయడం చారిత్రాత్మక ఘట్టంగా మారింది. ఈ నేపథ్యంలో సమ్రాట్ చౌధరీ సీఎం పదవిని చేపట్టడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. అయితే సమ్రాట్ చౌధరీ ప్రమాణ స్వీకార కార్యక్రమం ముందు పట్నాలోని పంచముఖి హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆ తర్వాత లోక్ భవన్‌కు చేరుకుని అధికారిక కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయనతో పాటు ఉపముఖ్య మంత్రులుగా జేడీయూ సీనియర్ నేతలు విజయ్ కె చౌధరీ, బిజేంద్ర ప్రసాద్ యాదవ్ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కూటమి సమీకరణం బిహార్ రాజకీయాల్లో కొత్త సమతుల్యతను సూచిస్తున్నట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. 1968 నవంబరులో జన్మించిన సమ్రాట్ చౌధరీ రాజకీయ నేపథ్యం గల కుటుంబానికి చెందినవారు. ఆయన తండ్రి శకుని చౌధరీ తారాపుర్ నియోజకవర్గం నుంచి ఆరు సార్లు ఎమ్మెల్యేగా గెలిచి ప్రత్యేక గుర్తింపు పొందారు. అదే నియోజకవర్గం నుంచి సమ్రాట్ చౌధరీ 2025 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా విజయం సాధించి తన ప్రభావాన్ని చాటుకున్నారు. సమ్రాట్ చౌధరీ రాజకీయ ప్రస్థానం 1990లలో ప్రారంభమైంది. మొదట ఆర్జేడీలో చేరి రాజకీయాల్లో అడుగుపెట్టారు. అనంతరం జేడీయూలో చేరి కీలక పాత్ర పోషించారు. 2017 చివర్లో బీజేపీలో చేరిన ఆయన పార్టీ అభివృద్ధికి కృషి చేసి కీలక నాయకుడిగా ఎదిగారు.

## లండన్‌లో మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్‌కి ఘన స్వాగతం పలికిన ఎన్నారై బిఆర్ఎస్ యూకే సభ్యులు





**లండన్ వెలుతురు ఏప్రిల్ 15:** పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా పనిచేస్తున్న స్వచ్ఛంద సేవా సంస్థ ఇగ్నైటెడ్ మైండ్స్ నిర్వాహకులు, మాజీ రాజ్య సభ సభ్యులు, గ్రీన్ ఇండియా ఛాలెంజ్ వ్యవస్థాపకులు జోగినపల్లి సంతోష్ కుమార్ గారు ప్రతిష్టాత్మక గ్లోబల్ గ్రీన్ ఐకాన్ పురస్కారాన్ని అందుకోవడానికి లండన్ విచ్చేసిన సందర్భంగా ఎన్నారై బీ.ఆర్.యస్ శాఖ అధ్యక్షులు నవీన్ రెడ్డి ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఎన్నారై బీ.ఆర్.యస్ వ్యవస్థాపక అధ్యక్షులు ఉ ఎఫ్డీసి మాజీ చైర్మన్ అనీల్ కూర్మాచలం, అధ్యక్షులు నవీన్ రెడ్డి, గ్రీన్ ఇండియా కో ఫౌండర్ రాఘవేంద్ర యాదవ్, ఉపాధ్యక్షులు హరి గౌడ్ నవాబుపేట్, సత్య మూర్తి చిలుముల, మాజీ అధ్యక్షులు అశోక్ గౌడ్ దూసరి, కార్యదర్శి – ఐటీ, మీడియా ఉ పీఆర్ రవి ప్రదీప్ పులుసు, యూత్ వింగ్ సెక్రటరీలు పవన్ కుమార్ గౌడ్, తరుణ్ లునావత్, యూత్ వింగ్ కో ఆర్డినేటర్ అమరేశ్వరి బోయిని, మీడియా కో ఆర్డినేటర్ సాయి కిరణ్ రావు పేరాల, లెస్టర్ ఇంచార్జ్ సాకేత్ కాచవరపు మరియు టాక్ జనరల్ సెక్రటరీ సుప్రజ పులుసు మరియు ముఖ్య సభ్యులు సుమంత్, సంకీర్త్ రెడ్డి, శివ చరణ్, యూకే లేబర్ పార్టీ విద్యార్థి నాయకుడు కార్తీక్ వున్నారు.

# సోషల్ మీడియా ట్రెండ్స్ వెంట పడకండి..

# ట్రాఫిక్ రూల్స్ పాటించండి: సైబరాబాద్ సీపీ డా. ఎం. రమేష్

**హైదరాబాద్ వెలుతురు ఏప్రిల్ 15:** సైబరాబాద్ ట్రాఫిక్ పోలీస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "అరైవ్ అలైవ్" రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమంలో భాగంగా, మాదాపూర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఖూం యూనివర్సిటీ, విద్యార్థులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సైబరాబాద్ సీపీ డా. ఎం. రమేష్ విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ రోడ్డు భద్రత మరియు సామాజిక బాధ్యతపై దిశానిర్దేశం చేశారు. ప్రస్తుత సోషల్ మీడియా ట్రెండ్స్ గురించి విద్యార్థులతో జరిగిన ఇంటరాక్టివ్ సెషన్‌లో, ఐపీఎల్ జట్లు మరియు సినిమా హీరోల గురించి యువతలో విపరీతమైన చర్చ జరుగుతోందని సీపీ గుర్తించారు. మనం అభిమానించే సెలబ్రిటీలు లేదా క్రీడా బృందాలు ఎప్పుడైనా మన వ్యక్తిగత క్షేమం గురించి అడిగారా అని ప్రశ్నించారు. కేవలం మన కుటుంబ సభ్యులు, స్నేహితులు మరియు సమాజం మాత్రమే మన క్షేమాన్ని కోరుకుంటారన్నారు. కాబట్టి వారి కోసం మనం బాధ్యతాయుతంగా ప్రవర్తించాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులకు సీపీ పలు సూచనలు చేస్తూ.. మొబైల్ ఫోన్ మన నియంత్రణలో ఉండాలని, మనం దానికి బానిసలం కాకూడదని హితవు పలికారు. ముఖ్యంగా వాహనాలు నడిపేటప్పుడు లేదా రోడ్లపై నడిచేటప్పుడు మొబైల్ వినియోగాన్ని పూర్తిగా తగ్గించాలన్నారు . విద్యార్థులు తమ విలువైన సమయాన్ని కెరీర్ మరియు భవిష్యత్తుపై దృష్టి పెట్టాలన్నారు. ఇది రోడ్డు భద్రత యొక్క ఆవశ్యకతను సభలో ఉన్న వారందరికీ స్పష్టం చేసింది. రోడ్డు ప్రమాదాల తీవ్రతను విద్యార్థులకు వివరిస్తూ, గతంలో తమ కుటుంబాల్లో ఎవరికైనా ప్రమాదాలు జరిగాయా అని సీపీ అడగగా, పలువురు విద్యార్థులు తమ వ్యక్తిగత అనుభవాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా దీక్షిత మాట్లాడుతూ 2001 సమయంలో మా నాన్నగారు ఒక భయంకరమైన రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. ఆ ప్రమాదంలో ఆయన తన






రెండు కాళ్లను కోల్పోయారు. ఆ అనుకోని సంఘటన వలన మా కుటుంబానికి కోలుకోలేని దెబ్బ తగిలించింది. అంతే కాకుండా మా జీవితాలను ఆర్థికంగా, సామాజికంగా, మానసికంగా పూర్తిగా మార్చివేసింది. అదే సమయంలో నేను కూడా రోడ్డు ప్రమాదాన్ని ఎదుర్కొన్నాను. ఒక చిన్న అజాగ్రత్త ఎంతటి పెద్ద విషాదానికి దారి తీస్తుందో మేము అనుభవించాం. ఆ ఘటనలు నా జీవితంలో ఎప్పటికీ మర్చిపోలేని చేదు జ్ఞాపకాలుగా మిగిలిపోయాయి.

అందుకే పోలీసులు మరియు అధికారులు చెబుతున్నట్లుగా, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించాలి. ప్రమాదం జరిగిన తర్వాత బాధపడటం కంటే, అది జరగకముందే జాగ్రత్తపడటం ఎంతో ముఖ్యము. రోడ్డుపై మనం తీసుకునే చిన్నపాటి జాగ్రత్తలు మన ప్రాణాలను మాత్రమే కాదు, మనపై ఆధారపడిన కుటుంబాన్ని కూడా కాపాడుతాయి. కాబట్టి బాధ్యతగా వాహనాలు నడుపుతూ, ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ, సురక్షితంగా జీవిద్దాం.

మరో రోడ్డు ప్రమాద బాధితుడు, విద్యార్థి ఆల్బర్ట్ మాట్లాడుతూ "నేను ఒక ప్రమాదానికి గురయ్యాను, నాకు తీవ్ర గాయాలయ్యాయి. అది నాకు ఎంతో గుణపాఠాన్ని నేర్పింది. రోడ్డుపై వెళ్లేటప్పుడు ఎడమ, కుడి వైపుల గమనిస్తూ ఉండటం మరియు ట్రాఫిక్ నిబంధనలను పాటించడం చాలా ముఖ్యం. నాకు ఎదురైన ఆ అనుభవం ద్వారా నేను తెలుసుకున్నది ఏమిటంటే, ప్రయాణంలో వేగం కంటే ప్రాణం ముఖ్యం. వాహనం నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి మరియు చిన్ స్ట్రాప్(హెల్మెట్ బెల్ట్ ) ను సరిగ్గా పెట్టుకోవాలి. ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో రూల్స్ పాటిస్తూ సురక్షితంగా ప్రయాణించాలని కోరుకుంటున్నాను."

ఈ సందర్భం గా రియా మాట్లాడుతూ,, తాను టీవీల్లో మరియు రోడ్లపై జరిగే ప్రమాదాలను చూసినప్పుడు, సురక్షితంగా వాహనాలు నడపడం ఎంత ముఖ్యమో అర్థం చేసుకున్నానని తెలిపారు. తన వ్యక్తిగత అనుభవాల వల్ల ఈ అవగాహన మరింతగా పెరిగిందని అన్నారు. మనం బయటకు వెళ్లిన ప్రతిసారి ఇంట్లో మన కోసం ఎదురు చూస్తున్న కుటుంబ సభ్యులను గుర్తు పెట్టుకోవాలని ఆమె సూచించారు. చిన్నపాటి నిర్లక్ష్యం కూడా పెద్ద ప్రమాదాలకు దారితీస్తుందని, అందుకే ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను తప్పకుండా పాటించాలని పేర్కొన్నారు.

సురక్షితంగా వెళ్లి సురక్షితంగా తిరిగి రావడం మన బాధ్యత అని, కుటుంబం కోసం జాగ్రత్తగా డ్రైవ్ చేయాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో చురుగ్గా పాల్గొని, రోడ్డు భద్రతపై తమ అభిప్రాయాలను పంచుకున్న విద్యార్థులు దీక్షిత, ఆల్బర్ట్ మరియు రియాను సీపీ ప్రత్యేకంగా అభినందించి సత్కరించారు. విద్యార్థుల్లో ట్రాఫిక్ నియమాల పట్ల అవగాహన పెంపొందించడం, బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దడమే ఈ అరైవ్ అలైవ్ కార్యక్రమ ప్రధాన లక్ష్యమని అధికారులు తెలిపారు. ఈ సదస్సులో ట్రాఫిక్ డీసీపీ–I జే. రంజన్ రతన్ కుమార్, ఏడీసీపీ–I జి. హనుమంతరావు, మాదాపూర్ ట్రాఫిక్ ఏసీపీలు కె. చంద్రశేఖర్ రెడ్డి, మాదాపూర్ లా అండ్ ఆర్డర్ CH.శ్రీధర్, KLH యూనివర్సిటీ డీన్ బి. ఆనంద్, కొండాపూర్ ఎంవీఐ నవీన్, మాదాపూర్ ట్రాఫిక్ ఎస్‌హెచ్ఓ ఎ. శ్రీధర్ కుమార్, ఆర్ఐ శ్రీకాంత్, డీఐ విజయ్ మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు. విద్యార్థులు ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటిస్తామని ప్రతిజ్ఞ చేయడంతో ఈ కార్యక్రమం ముగిసింది.

# సంపాదకీయం..

# యుద్ధం వెనుక దాగిన మానవత్వం: శిథిలాల మధ్య చిగురించిన ఆశ

మానవ చరిత్ర వికాసం ఎన్ని మలుపులు తిరిగినా, నాగరికత శిఖరాగ్రాన నిలిచినా కాల గమనంలో యుద్ధం అనే ఒక నల్లని నీడ మనల్ని వెన్నాడుతూనే ఉంది. శతాబ్దాలు మారుతున్నాయి, ఆయుధాల రూపం మారుతోంది, కానీ ఆ పోరు భేరీ వినిపించినప్పుడల్లా వేలాది జీవితాలు ఆవిరి కావడం మాత్రం మారడం లేదు. యుద్ధం అంటే కేవలం సరిహద్దు రేఖల మధ్య జరిగే తుపాకుల మోత మాత్రమే కాదు. అది మానవ మనస్సులోని అత్యున్నత త్యాగానికి, అత్యంత హీనమైన స్వార్థానికి మధ్య జరిగే ఒక మహా నాటకం. ఈ పోరాట రంగంలో అసలైన కథానాయకుడు ఎవరు? తుపాకీ పట్టిన సైనికుడా? లేక బాంబుల మోతల మధ్య బిడ్డను గుండెకు హత్తుకున్న తల్లా? శత్రువు అని తెలిసి కూడా ఆకలితో ఉన్న ప్రత్యర్థికి రొట్టె ముక్క అందించే మానవత్వమా? నిశితంగా పరిశీలిస్తే, యుద్ధం విధ్వంసాన్ని మాత్రమే కాదు, మనిషిలోని దైవత్వాన్ని కూడా నిరూపిస్తుంటుంది.యుద్ధం ఎందుకు జరుగుతుంది? ఈ ప్రశ్నకు చరిత్రకారులు, మేధావులు వేల ఏళ్లుగా సమాధానాలు వెతుకుతూనే ఉన్నారు. నేల కోసం, నీటి కోసం, మతం ముసుగులో, రాజ్య కాంక్షతో లేదా వనరుల వేటలో కారణాలు ఏవైనా కావచ్చు, కానీ చివరికి మిగిలేది మాత్రం శ్మశాన నిశ్శబ్దం. ఒక్క క్షణం ఆలోచించండి, ఒక సైనికుడు ఉదయం తన బిడ్డ ముఖం చూసి మురిసిపోతాడు, అదే చేతులతో సాయంత్రానికి మరో బిడ్డ తండ్రిని అంతం చేస్తాడు. ఇదొక హృదయ విదారకమైన వైరుధ్యం. యుద్ధం దేశాల మధ్య సరిహద్దులను చెరపవచ్చు లేదా గీయవచ్చు, కానీ అది మొదటగా మనిషిలోని కరుణను చంపేస్తుంది. అందుకే అంటారు, యుద్ధం వేరే దేశపు ప్రజలను చంపదు అది మన లోపలి మానవత్వాన్ని మొదట సమాధి చేస్తుంది.చరిత్రలో అత్యంత భయానక ఘట్టం అంటే రెండో ప్రపంచ యుద్ధమే. హిరోషిమా, నాగసాకిలపై అణుబాంబులు కురిసినప్పుడు ప్రపంచం తన ముఖాన్ని చేతుల్లో దాచుకుంది. లక్షల మంది ఆవిరైపోయారు. కానీ, ఆ బూడిద కుప్పల మధ్య నుంచే అద్భుతమైన మానవతా గాథలు పుట్టుకొచ్చాయి. జపాన్ శిథిలాల మధ్య రెడ్‌క్రాస్ కార్యకర్తలు, సామాన్య పౌరులు జాతి వైరాగ్యాన్ని పక్కనపెట్టి ఒకరినొకరు ఆదుకున్నారు. యుద్ధాలను నాయకులు ప్రారంభిస్తారు, కానీ గాయాలను మాన్పేది మాత్రం సామాన్య జనం మాత్రమే.భారత పాక్ విభజన కాలం నాటి రక్తం ఓడిన రోజులను గుర్తు చేసుకుంటే, మతం పేరుతో మనుషులు మృగాలైన వేళ, మానవత్వం వెలుగులు విరజిమ్మింది. ఒక సిక్కు రైతు ముస్లిం చిన్నారులను తన ప్రాణాలకు తెగించి రక్షించడం, ఒక ముస్లిం జమీందారు హిందూ కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు చేర్చడం ఇవి ఏ చరిత్ర పుస్తకాల్లోనూ ప్రస్ఫుటంగా కనిపించవు. కానీ, ఈ అనామక వ్యక్తులే నిజమైన చరిత్ర



నిర్మాతలు. ఆయుధం లేని నిశ్శబ్ద వీరులు వీరు.యుద్ధంలో అత్యంత క్రూరమైన వాస్తవం ఏంటంటే, యుద్ధం చేయని వారే దాని వల్ల ఎక్కువగా నష్టపోతారు. యుద్ధం ప్రకటించే సభల్లో మహిళలకు ఓటు ఉండదు, నిర్ణయాల్లో భాగస్వామ్యం ఉండదు. కానీ, బాంబుల తాకిడికి కూలిపోయే ఇళ్లలో, శరణార్థి శిబిరాల్లో వారు అనుభవించే నరకం వర్ణనాతీతం. సిరియా నుండి ఉక్రెయిన్ వరకు, గాజా నుండి వియత్నాం వరకు తల్లులు తమ బిడ్డలను రక్షించుకోవడానికి పడే తపన అసాధారణం. ఆకాశం నుండి మృత్యువు నిప్పుల వర్షం కురిపిస్తుంటే, ఆ తల్లులు తమ బిడ్డలకు జోలపాటలు పాడి నిద్రపుచ్చుతారు. ఆ పాటలో ఉండే ధైర్యం, ఆ ప్రేమ యుద్ధం కంటే వెయ్యి రెట్లు శక్తివంతమైనవి.మహిళలు కేవలం బాధితులు మాత్రమే కాదు, వారు శాంతిని నెలకొల్పే శక్తులు కూడా. రువాండాలో మారణహోమం తర్వాత దేశాన్ని మళ్లీ నిలబెట్టింది అక్కడి మహిళలే. బోస్నియా యుద్ధం తర్వాత ఛిన్నాభిన్నమైన సమాజాన్ని ఒక తాటిపైకి తెచ్చింది అమ్మలే. యుద్ధం పురుషుల అహంతో మొదలవుతుంది, కానీ దాన్ని ప్రేమతో శాంతింపజేసేది మాత్రం స్త్రీ హృదయమే. బాంబులు భవనాలను నేలమట్టం చేయగలవేమో కానీ, ఒక తల్లి ప్రేమను, మనిషిలోని దయను ఎప్పటికీ కూల్చలేవు .మహాత్మా గాంధీ గారు ఒక గొప్ప మాట చెప్పారు.కంటికి కన్ను అనే సూత్రాన్ని పాటిస్తే, ఈ ప్రపంచం మొత్తం గుడ్డిదైపోతుంది. ఇది కేవలం నినాదం కాదు, యుద్ధం నేర్పిన చేదు పాఠం. ఒక యుద్ధం ముగిసిన ప్రతిసారీ, మరో యుద్ధానికి బీజాలు నాటబడతాయి. మొదటి ప్రపంచ యుద్ధం ఫలితం రెండో యుద్ధానికి దారితీస్తే, ఆ తర్వాత ప్రచ్ఛన్న యుద్ధం ప్రపంచాన్ని వణికించింది. హింస నుండి హింస మాత్రమే పుడుతుంది. శాంతి అనే విత్తనం నాటినప్పుడే మానవత్వం వికసిస్తుంది. దక్షిణ ఆఫ్రికాలో నెల్సన్ మండేలా జీవితం మనకు ఒక అద్భుత పాఠం. 27 ఏళ్ల పాటు జైలులో మగ్గిపోయిన ఆయనకు, విడుదలయ్యాక ప్రతీకారం తీర్చుకునే అవకాశం ఉంది. కానీ ఆయన క్షమాపణ ను ఆయుధంగా ఎంచుకున్నారు. 'ఏతీబ్ప్త ఖఅఐ =వఽశీఅఽఱశ్రీఱఖ్ఱశీఅ జశీఎఎఱంంఱశీఅ' ద్వారా దేశాన్ని రక్తపాతం నుండి కాపాడారు. యుద్ధం అంటే శత్రువును చంపడం కాదు, శత్రుత్వాన్ని చంపడం అని ఆయన నిరూపించారు. శాంతి, సయోధ్య మాత్రమే యుద్ధానికి అసలైన జవాబులు.నేడు ప్రపంచం ఒక కీలక మలుపులో ఉంది. ఒకవైపు డిజిటల్ యుగంలో యుద్ధాల భయానక దృశ్యాలను సోషల్ మీడియాలో నేరుగా చూస్తున్న యువత, మరోవైపు శాంతి కోసం గొంతు ఎత్తుతోంది. స్వీడన్‌కు చెందిన గ్రెటా థన్‌బర్గ్ పర్యావరణం కోసం, మలాలా యూసఫ్‌జాయ్ విద్య కోసం పోరాడినట్లే నేటి తరం యుద్ధాలకు వ్యతిరేకంగా ఒక బలమైన గొంతుకను వినిపిస్తోంది. యుద్ధం చేయడం కంటే యుద్ధాన్ని ఆపడం గొప్పని ఈ తరం నమ్ముతోంది. భవిష్యత్తు వారి చేతుల్లోనే ఉంది. వారు ఆయుధాలను కాకుండా, ఆలోచనలను పదును పెడితే ఈ లోకం మరింత సుందరంగా మారుతుంది.తెలుగు నేల సంస్కృతి కూడా శాంతికే పెద్దపీట వేసింది. పోతన భాగవతంలోని శ్రీకృష్ణుడి రాయబారం యుద్ధం వద్దు, శాంతి ముద్దు అనే సందేశాన్ని ఇచ్చింది. “అహింసా పరమో ధర్మః” అనేది మన రక్తంలోనే ఉంది. అన్నమయ్య, వేమన వంటి మహనీయులు పరులను హింసించడం మహా పాపం అని బోధించారు. ఈ ప్రాచీన విలువలనే నేటి ఆధునిక కాలానికి అన్వయించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.ముగింపుగా చెప్పాలంటే, యుద్ధం మనకు ఒక కఠినమైన సత్యాన్ని బోధిస్తుంది. మనకు ఏది విలువైనదో అది కోల్పోయినప్పుడే తెలుస్తుంది. ఆకలితో ఉన్నప్పుడు మతం గుర్తుకు రాదు, ప్రాణాపాయంలో ఉన్నప్పుడు కులం అడ్డు రాదు. యుద్ధం మనిషిలోని క్రూరత్వాన్ని వెలికితీస్తుంది, అలాగే అద్భుతమైన దివ్యత్వాన్ని కూడా బయటకు తెస్తుంది.ఈ భూమిపై మళ్లీ ఒక్క యుద్ధం కూడా జరగకూడదు అని ఆశించడం ఒక కల కావచ్చు. కానీ ఆ కల వైపు అడుగులు వేయడమే మానవజాతి చేయాల్సిన పరమార్థం. ప్రతి మనిషి తన హృదయంలో శాంతిని పెంచుకుంటే, ప్రపంచం ఒక నందనవనం అవుతుంది. మన పిల్లలకు కత్తుల కథల కంటే, కరుణ కథలు చెబుదాం. బాంబులు చరిత్రను మారుస్తాయో లేదో తెలియదు కానీ, మారిన మనసులే చరిత్రను గొప్పగా నిర్మిస్తాయి. మానవత్వమే మన అసలైన ఆయుధం కావాలి.



డా .సూర్యదేవర రామకృష్ణ ,
9490754169

---

# చట్టసభల్లో మహిళలకు తగు ప్రాధాన్యత మన బాధ్యత

**“యత్ర నార్యస్తు పూజ్యంతే రమంతే తత్ర దేవతా:”**

**మనుస్మృతిలోని ఈ శ్లోకానికి అర్థం “ఎక్కడైతే స్త్రీలకి గౌరవం లభిస్తుందో ఆ ప్రదేశంలో దైవత్వం వికసిస్తుంది”, భారతదేశ సనాతన ధర్మంలో స్త్రీల పట్ల ఉన్న గౌరవాన్ని ప్రతిభంబించే అద్భుత శ్లోకం ఇది. ఈ శ్లోకం యొక్క స్ఫూర్తితోనే నేడు పార్లమెంటు ఒక అద్భుత చారిత్రిక ఘట్టానికి వేదిక కాబోతోంది.**

ఏ యుగంలోనైనా ఏ కాలంలోనైనా మహిళామూర్తులు తమ యొక్క యుక్తిని శక్తిని ప్రదర్శిస్తూ యావత్ సమాజానికి స్ఫూర్తిని అందిస్తూనే ఉన్నారు. రామాయణ కాలంలో కైకేయి తన భర్త దశరథ మహారాజు రథసారథిగా రాక్షసులపై చేసిన యుద్ధం, మహాభారత కాలంలో సత్యభామ శ్రీకృష్ణుని వారితో జత కలిసి నరకాసుడ్ని వధించిన తీరు అందరికీ ఎల్లప్పుడూ స్ఫూర్తిని రగిలిస్తూనే ఉంటుంది. 13వ శతాబ్దంలో తైమూర్ లంగ్ అనే ముస్లిం దురాక్రమదారుడు భారతదేశాన్ని కబడించాలని ప్రయత్నిస్తూ అనేక మందిని చంపుతున్న రోజుల్లో రాణి రామ్ ప్యారి గుర్జర్ తన నేతృత్వంలో 40,000 మంది మహిళ సైనికుల్ని తయారుచేసి పోరాడిన తీరు అజరామరణం. అక్బర్ ఆధ్వర్యంలోని మొగల్ సేనలపై రాణి దుర్గావతి పోరాడిన తీరు మనకి స్ఫూర్తిని రగిలిస్తూనే ఉంటుంది. రాణి రుద్రమదేవి, రాణి అహల్యాబాయ్ హోల్కర్ వంటి ఎందరో మహిళామూర్తులు గొప్ప పరిపాలనా దక్షులుగా కీర్తింపబడుతున్నారు. కిత్తూరు చిన్నమ్మ, ఝాన్సీ రాణి వంటి మేటి యోధులు బ్రిటిష్ వారిపై కలపడిన తీరు చూపిన తెగువ ప్రతి భారతీయుడి నర నారాయణ దేశభక్తిని నింపుతూనే ఉంటుంది. ఇటువంటి ఎందరో వీరనారుల చరిత్ర ఈ భరతభూమి సొంతం.

భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారు రాజ్యాంగాన్ని రచిస్తున్న రోజుల్లో ప్రపంచంలో అనేక దేశాలలో మహిళలకి ఓటు హక్కు ఇవ్వని రోజులు, కానీ మన రాజ్యాంగ సభ ఇది తప్పుడు విధానమని సమాజంలో సగభాగమైన మహిళలకి ఓటు హక్కు లేకపోతే ఆ సమాజం ముందుకు సాగదని ఓటు హక్కు ఇచ్చి చరిత్ర సృష్టిస్తే నేడు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గారి నేతృత్వంలో మహిళలకి చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ పార్లమెంటులో బిల్లుని ప్రవేశపెడుతూ అదీ 2029 సార్వత్రిక ఎన్నికల నుండి ఇది అమల్లోకి వచ్చేలా మార్పు చేయటం మరోచరిత్ర అని చెప్పక తప్పదు.

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గారు 2014లో బాధ్యతలు తీసుకున్నప్పటి నుంచి మహిళలకి అన్ని రంగాలలో ప్రాధాన్యత పెంచారు. మహిళలకి బ్యాంకు ఖాతాలు వ్యాపారం చేసుకుంటాకి ముద్ర రుణాలు, ప్రభుత్వం అందిస్తున్న ఇళ్లల్లో గరిష్టంగా మహిళల పేరు మీదే ఇల్లు రిజిస్ట్రేషన్ చేయటం, మహిళల ఆత్మగౌరవ పరిరక్షణకు మరుగుదొడ్ల నిర్మాణం, మహిళల ఆరోగ్య పరిరక్షణ కి గ్యాస్ ఉచితంగా అందించడం, సుదూర ప్రాంతాల నుండి నీళ్లు మోసుకొచ్చే శ్రమ తగ్గిస్తూ ప్రతి ఇంటికి కొళాయి కనెక్షన్ ఇవ్వటం, డ్వాక్రా సంఘాలకి 20 లక్షల వరకు ఏ పూచీకత్తు లేకుండా రుణాలు అందించటం, డ్రోన్ దిది అంటూ డ్రోన్ నడపటం లో వారికి శిక్షణ ఇవ్వడం వంటి అనేక పథకాలతో మహిళ సాధికారికత కోసం కృషి చేస్తున్నారు. ప్రధాని మోడీ గారు తన క్యాబినెట్లో మహిళలకి ప్రాధాన్యత ఇస్తూ కీలక శాఖలు రక్షణ ఆర్థిక విభాగం వంటి వాటిని మహిళా మూర్తులకి ఇచ్చారు. భారత త్రివిధ దళాలలో మహిళలు యొక్క పాత్రని పెంచారు అలాగే ప్రధాని మోడీ గారి స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూప్ లో కూడా మహిళలకి స్థానం కల్పించారు. శాస్త్ర సాంకేతిక రంగంలో వ్యాపారాలలో మహిళలు యొక్క పాత్ర పెంచటానికి ప్రధాని మోడీ గారు అనేక పథకాలు అమలు చేస్తున్నారు.

సమాజంలో సగభాగంగా ఉన్న మహిళలకి ఇప్పుడు పార్లమెంట్లో గానీ రాష్ట్రాల శాసనసభలో గానీ ప్రాతినిధ్యం 10% లోపే.

ఇది ఘోరమైన వివక్షకి ప్రతిరూపం. అందుకే ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గారు ఈ చారిత్రక తప్పిదాన్ని సవరిస్తూ మహిళలకు చట్టసభల్లో అంటే అటు పార్లమెంట్లో ఇటు రాష్ట్రాల శాసనసభలో 33 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ నేడు పార్లమెంట్లో బిల్లుని ప్రవేశపెడుతున్నారు. భరతమాత ముద్దుబిడ్డలుగా మాతృమూర్తులను గౌరవించి పూజించి ప్రోత్సహించిన తరతరాల వారసులుగా ఈ బిల్లుని సమర్థించటం మన బాధ్యతే కాదు కర్తవ్యం కూడా.



పెద్దిరెడ్డి రవికిరణ్, బిజెపి
రాష్ట్ర అధికార ప్రతినిధి, ఆంధ్ర ప్రదేశ్

---

# అమరులను గుర్తుంచుకోని గత సర్కార్...! కాంగ్రెస్ సర్కార్ అన్న పట్టించుకుంటుందా...?

**తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం అనేది కేవలం రాజకీయ ప్రక్రియ కాదు... అది ఒక సమాజం, ఒక భావజాలం, ఒక ఆవేదన, ఒక చరిత్రకు ప్రతీక. ఈ చరిత్రలో అత్యంత గొప్ప స్థానాన్ని సంపాదించుకున్న వారు తెలంగాణ అమరవీరులు. “వీరులారా వందనం... విద్యార్థి అమరులారా వందనం...” అంటూ ప్రతి సభలో, ప్రతి వేదికపై గర్జించిన నాయకులు, అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ అమరుల త్యాగాలను ఎంతవరకు గౌరవించారు? ఈ ప్రశ్నకు సమాధానం వెతికితే మన ముందుకు వస్తున్న వాస్తవం బాధాకరమైనది, కలవరపెట్టేది.**

2014 జూన్ 14న అసెంబ్లీలో జరిగిన చర్చలు చూస్తే తెలంగాణ నాయకత్వం అప్పట్లో అమరవీరులపై ఎంతటి గౌరవ భావం వ్యక్తం చేసిందో స్పష్టంగా తెలుస్తుంది. ముఖ్యమంత్రి కేసీఆర్ అమరవీరుల త్యాగాన్ని “హయ్యెస్ట్ సాక్రిఫైస్”గా అభివర్ణిస్తూ, వారి త్యాగానికి మించినది మరొకటి లేదని పేర్కొన్నారు. వారి కుటుంబాలకు పూర్తి గౌరవం ఇవ్వాలని, రాష్ట్ర అవతరణ దినోత్సవం రోజున అమరుల స్థూపానికి సెల్యూట్ చేసిన తర్వాతే అధికారిక కార్యక్రమాలు జరగాలని స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని చెప్పారు. హైదరాబాదులో గర్వపడే విధంగా అమరవీరుల స్మారక చిహ్నాన్ని నిర్మిస్తామని, అమరుల ఫోటోలు, వివరాలు ప్రతిష్టాత్మకంగా ప్రదర్శిస్తామని హామీ ఇచ్చారు.

అదే సభలో అప్పటి ప్రతిపక్ష నాయకులు కూడా అమరుల గౌరవంపై తమ అభిప్రాయాలను వెల్లడించారు. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా అప్పట్లో అమరవీరుల కోసం ప్రత్యేక దినోత్సవం ఉండాలని సూచించారు. అమరవీరుల కుటుంబాలకు స్వాతంత్ర్య సమరయోధుల మాదిరిగా అన్ని సౌకర్యాలు కల్పించాలని ప్రతిపాదించారు. అంటే ఆ రోజుల్లో అన్ని రాజకీయ పక్షాలు అమరుల విషయంలో ఒకే స్వరంతో మాట్లాడినట్లు కనిపిస్తుంది.

**కానీ, ఆ మాటలు వాస్తవంగా అమలయ్యాయా? ఇదే ప్రశ్న తెలంగాణ సమాజాన్ని వేధిస్తున్నది.**

టిఆర్ఎస్ ప్రభుత్వం దాదాపు పది సంవత్సరాల పాటు అధికారంలో ఉన్నప్పటికీ, అమరవీరుల కుటుంబాల సమస్యలను పూర్తిగా పరిష్కరించలేకపోయింది. జీవో నెంబర్ 80 ద్వారా ఇచ్చిన హామీలలో చాలా భాగం అమలుకాలేదన్న అసంతృప్తి అమరుల కుటుంబాల్లో స్పష్టంగా కనిపించింది. కొందరికి రూ.10 లక్షల ఆర్థిక సహాయం అందించినప్పటికీ, మిగిలిన హామీలు కేవలం పత్రాలపైనే మిగిలిపోయాయి. అసెంబ్లీలో 1200 మంది అమరవీరులు ఉన్నారని చెప్పిన ప్రభుత్వం, వారిలో సగం మందికి కూడా సరైన గుర్తింపు ఇవ్వలేకపోవడం విచారకరం. ఇంకా బాధాకరమైన విషయం ఏమిటంటే, అమరవీరుల స్మారక చిహ్నం నిర్మాణం కూడా రాజకీయ ప్రదర్శనగా మారిపోయింది. అమరుల కుటుంబ సభ్యులను ఆహ్వానించకుండా స్మారక చిహ్నం ప్రారంభోత్సవం జరపడం వారి మనసులను మరింత గాయపరిచింది. తమ పిల్లల ఫోటోలు అక్కడ ప్రదర్శించబడ్డాయో లేదో చూడడానికి కూడా అవకాశం లేకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనం.

అమరుల కుటుంబాలు గన్ పార్క్ దగ్గరకు వెళ్లి తమ బాధను వ్యక్తం చేయాలనుకున్నప్పుడు కూడా పోలీసు ఆంక్షలు ఎదురవడం, ఈ ప్రభుత్వం అమరుల పట్ల చూపిన వైఖరిని స్పష్టంగా తెలియజేస్తుంది. త్యాగాల పునాదులపై ఏర్పడిన రాష్ట్రంలో, ఆ త్యాగాలను గుర్తించడంలో ఇంతటి నిర్లక్ష్యం అనేది అసహ్యకరమైన విషయం.

ఈ నేపథ్యంలో ప్రజలు టిఆర్ఎస్ ప్రభుత్వాన్ని తిరస్కరించి కాంగ్రెస్‌కు అవకాశం ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో అమరవీరులు, ఉద్యమకారుల కోసం అనేక హామీలు ఇచ్చింది. ముఖ్యంగా ప్రతి ఉద్యమకారుడికి పింఛన్‌తో పాటు 250 గజాల స్థలం కేటాయిస్తామని చెప్పడం పెద్ద ఆశలను కలిగించింది. అమరుల కుటుంబాలకు మరింత గౌరవం, ఆర్థిక భరోసా కల్పిస్తామని హామీ ఇచ్చింది.

కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే మార్గంలో నడుస్తున్నదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. రెండున్నర సంవత్సరాలు గడిచినా, అమరవీరుల కుటుంబాలకు ఇచ్చిన హామీల అమలు స్పష్టంగా కనిపించడం లేదు. 250 గజాల స్థలం, పింఛన్ వంటి హామీలు ఇంకా ఆచరణలోకి రాలేదు. ఉద్యమకారులు కూడా తమకు తగిన గుర్తింపు లేదని, ప్రభుత్వ దృష్టిలో పడడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇది కేవలం పరిపాలనా వైఫల్యం కాదు... ఇది ఒక చారిత్రక బాధ్యతను విస్మరించడం. తెలంగాణ రాష్ట్రం ఏర్పడటానికి కారణమైన ప్రధాన శక్తి ఉద్యమం. ఆ ఉద్యమానికి ప్రాణం పోసిన వారు అమరవీరులు. వారి త్యాగాన్ని గుర్తించకుండా, వారి కుటుంబాలను ఆదుకోకుండా ప్రభుత్వం ముందుకు సాగడం అంటే ఆ రాష్ట్ర ఆత్మను అవమానించడం వంటిదే.

ప్రతి సంవత్సరం తెలంగాణ అవతరణ దినోత్సవం ఘనంగా జరుపుకుంటున్నాం. కోట్ల రూపాయలు ఖర్చు చేసి వేడుకలు నిర్వహిస్తున్నాం. కానీ అదే సమయంలో అమరవీరుల కుటుంబాలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతూ తమ హక్కుల కోసం అడగాల్సిన పరిస్థితి రావడం మన సమాజానికి మచ్చ. ఈ విరుద్ధ దృశ్యం మన రాజకీయ వ్యవస్థలోని అసమానతలను బయటపెడుతుంది.

అమరుల గౌరవం అనేది కేవలం స్మారక చిహ్నాలు నిర్మించడం ద్వారా రాదు. వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా ఇవ్వడం, వారి పిల్లలకు విద్య, ఉద్యోగ అవకాశాలు కల్పించడం, సమాజంలో గౌరవప్రదమైన స్థానం కల్పించడం ద్వారా మాత్రమే అది సాధ్యమవుతుంది. కానీ ఇప్పటి వరకు రెండు ప్రభుత్వాలు కూడా ఈ బాధ్యతను పూర్తిగా నిర్వర్తించలేకపోయాయి.

ఇక మరో ముఖ్యమైన అంశం – ఉద్యమకారుల గౌరవం. తెలంగాణ ఉద్యమంలో వేలాది మంది విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు పాల్గొన్నారు. వారిలో చాలా మంది తమ జీవితాలను, అవకాశాలను త్యాగం చేశారు. కానీ రాష్ట్రం ఏర్పడిన తర్వాత వారిలో చాలా మంది మరచిపోయారు. ఇది ఒక సామాజిక అన్యాయం.

కాంగ్రెస్ ప్రభుత్వం తన మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి. 250 గజాల స్థలం, పింఛన్ వంటి అంశాలు కేవలం ఎన్నికల హామీలుగా మిగిలిపోవద్దు. అవి ఆచరణలోకి రావాలి. అలాగే అమరవీరుల కుటుంబాలకు ప్రత్యేక పథకాలు రూపొందించి, వారిని సమాజంలో గౌరవప్రదంగా నిలబెట్టాలి.

అదేవిధంగా, తెలంగాణలో ప్రతి జిల్లా కేంద్రంలో అమరవీరుల స్మారక చిహ్నాలను నిర్మించాలి. ఢిల్లీ లోని ఇండియా గేట్ తరహాలో భారీ స్థూపాలను నిర్మించడం ద్వారా భావితరాలకు ఉద్యమ చరిత్రను పరిచయం చేయాలి. అక్కడ మ్యూజియంలు, సాంస్కృతిక ఆడిటోరియంలు ఏర్పాటు చేసి కళాకారులకు అవకాశాలు కల్పించాలి. ఇది టూరిజాన్ని కూడా పెంచుతుంది. ప్రస్తుతం అవసరం ఉన్నది మాటలు కాదు... చర్యలు. అమరుల పేరుతో రాజకీయాలు చేయడం ఆపాలి. వారి త్యాగాన్ని నిజంగా గౌరవించాలంటే, వారి కుటుంబాలకు న్యాయం చేయాలి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడటానికి కారణమైన వారిని మరచిపోతే, ఆ రాష్ట్రం తన మూలాలను కోల్పోతుంది.

ఇకనైనా ప్రభుత్వం మేల్కొని, అమరవీరుల గౌరవాన్ని కాపాడే దిశగా కఠిన నిర్ణయాలు తీసుకోవాలి. లేదంటే ప్రజల తీర్పు మరలా అదే విధంగా ఉంటుంది. తెలంగాణ ప్రజలు భావోద్వేగాలను గౌరవిస్తారు... కానీ మోసాన్ని మాత్రం ఎప్పటికీ క్షమించరు.

అమరుల త్యాగం అనేది చరిత్రలో ఒక అధ్యాయం కాదు... అది తెలంగాణ ఆత్మ. ఆ ఆత్మను గౌరవించడం ప్రతి ప్రభుత్వానికి, ప్రతి నాయకుడికి, ప్రతి పౌరుడికి ఒక పవిత్ర బాధ్యత.



మన్నారం నాగరాజు.
తెలంగాణ లోక్‌సత్తా పార్టీ.
మాజీ రాష్ట్ర అధ్యక్షుడు.

## జావిద్ మరణ వార్త తెలియగానే తీవ్ర దిగ్భ్రాంతికి గురి అయిన టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్...

### సంతాపం తెలిపిన టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్



**హైదరాబాద్ వెలుతురు ఏప్రిల్ 15:** రోడ్డు ప్రమాదంలో ఖమ్మం మాజీ సిసిసి అధ్యక్షులు మహ్మద్ జావిద్ మృతి. ఖమ్మం నుంచి హైదరాబాద్ స్వంత వాహనంలో వస్తుండగా ప్రమాదం. ఖమ్మం హైదరాబాద్ మార్గమధ్యంలో పిల్లలమర్రి వద్ద డివైడర్ ను ఢీ కొనడంతో ప్రమాదం. ప్రమాదంలో అక్కడికక్కడే మృత్యువాత పడ్డ జావిద్. సంతాపం తెలిపిన టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ జావిద్ మరణ వార్త తెలియ గానే తీవ్ర దిగ్భ్రాంతికి గురి అయిన టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్. నిన్న ఖమ్మంలో జరిగిన సమావేశంలో పాల్గొన్నారు. ఆయనను సన్మానించాము.. చాలా మంచి క్రమశిక్షణ గల నాయకులు అని గుర్తు చేసుకున్న మహేష్ కుమార్ గౌడ్... జావిద్ మరణ వార్త తెలియగానే ఖమ్మం జిల్లా నాయకులకు ఫోన్ చేసి సమాచారం తెలుసుకున్న మహేష్ కుమార్ గౌడ్.. జావిద్ కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి ని తెలియజేసిన టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్.. జావిద్ ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థించిన మహేష్ కుమార్ గౌడ్...

## రోడ్డు ప్రమాదాల నియంత్రణ కోసం విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు

- రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్
- బైక్ ర్యాలీ, మానవహారం
- మంత్రి పొన్నంకు ఘన స్వాగతం పలికిన కలెక్టర్, సీపీ, జిల్లా అధికారులు





**నిజామాబాద్, వెలుతురు ఏప్రిల్ 15 :** రోడ్డు ప్రమాదాల నియంత్రణ కోసం విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని రాష్ట్ర రవాణా, బీ.సీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా అరైవ్ అలైవ్ పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామని అన్నారు. అరైవ్ అలైవ్ కార్యక్రమంలో పాల్గొనేందుకు నిజామాబాద్ నగర పర్యటనకు బుధవారం విచ్చేసిన రాష్ట్ర రవాణా, బీ.సీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, పోలీస్ కమిషనర్ సాయి చైతన్య, ఇతర అధికారులు ఘన స్వాగతం పలికారు. హెలికాప్టర్ ద్వారా మధ్యాహ్నం మూడు గంటల సమయంలో నిజామాబాద్ చేరుకున్న మంత్రిని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం హెలిప్యాడ్ వద్ద కలెక్టర్, పోలీస్ కమిషనర్ తో పాటు అదనపు కలెక్టర్ దిలీప్ కుమార్, సబ్ కలెక్టర్లు వికాస్ మహతో, అభిగ్యాన్ మాల్వియ, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, నుడా చైర్మన్ కేశ వేణు, ఇతర జిల్లా అధికారులు పుష్ప గుచ్చాలు అందించి స్వాగతం పలికారు. అక్కడి నుండి పోలీసు బందోబస్తు మధ్య కాన్వాయ్ ద్వారా మంత్రి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల వద్దకు చేరుకున్నారు. అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా రోడ్డు భద్రతపై అవగాహన కోసం చేపట్టిన బైక్ ర్యాలీని జెండా ఊపి లాంఛనంగా ప్రారంభించారు. ఈ ర్యాలీ కంటేశ్వర్ బైపాస్ చౌరస్తా వరకు చేరుకోగా, అక్కడ విద్యార్థులతో కలిసి మానవహారంగా ఏర్పడ్డారు. జిల్లా అధికారులతో పాటు రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డి, నగర మేయర్ ఉమారాణి, రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి, రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్ తదితరులు మానవహారంలో భాగస్వాములు అయ్యారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు కృషి చేస్తామని, ట్రాఫిక్ నిబంధనలు విధిగా పాటిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, అతివేగం, ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘన కారణంగా రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుని ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వెలిబుచ్చారు. తద్వారా అనేక కుటుంబాలు ఇబ్బందులు పడాల్సి వస్తోందని అన్నారు. ఎన్ని చట్టాలు నిబంధనలు అమలు చేసినా, ప్రజలలో మార్పు రానంత వరకు ప్రమాదాలను నిలువరించడం సాధ్యం కాదని అన్నారు. దీనిని గుర్తిస్తూ పోలీస్ రవాణా శాఖల ఆధ్వర్యంలో ప్రజలలో అవగాహన కల్పించడం కోసం అరైవ్ అలైవ్ పేరుతో ప్రభుత్వం విస్తృత స్థాయిలో కార్యక్రమాలు నిర్వహిస్తోందని గుర్తు చేశారు. అన్ని వర్గాల వారు ఈ కార్యక్రమాల్లో పాల్గొని ప్రమాదాల నివారణకు తమవంతు దోహదపడాలని పిలుపునిచ్చారు. రోడ్డు ప్రమాదాలలో గాయపడిన క్షతగాత్రులను తక్షణమే స్పందించి ఆసుపత్రికి తరలించాలని, అలా కృషి చేసిన వారిని రహ్ వీర్ కింద రూ. 25 వేల నగదు ప్రోత్సాహకం ప్రభుత్వం ద్వారా అందజేయబడుతుందని తెలిపారు. ముఖ్యంగా విద్యార్థులు, యువత వాహనాలు నడిపే సమయంలో తప్పనిసరిగా నిబంధనలు పాటిస్తూ, ప్రమాదాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ హితవు పలికారు. ఈ కార్యక్రమాలలో ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.




# వారసత్వ కట్టడాలకు అంతర్జాతీయ హంగులు





- దేశీయ, అంతర్జాతీయ పర్యాటకులను ఆకర్షించడమే లక్ష్యంగా పర్యాటక అభివృద్ధి
- ఎమ్మెల్యే మీర్ జుల్ఫికర్ అలీతో కలిసి చార్మినార్, చౌమొహల్లా ప్యాలస్‌ను సందర్శించిన మంత్రి జూపల్లి కృష్ణారావు

**హైదరాబాద్, వెలుతురు ఏప్రిల్ 15:** చారిత్రక కట్టడాలు, వారసత్వ సంపద ను అంతర్జాతీయ పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. బుధవారం చార్మినార్ ఎమ్మెల్యే మీర్ జుల్ఫికర్ అలీ, పర్యాటక అభివృద్ధి సంస్థ ఎండీ గౌతమి, పురావస్తు శాఖ డైరెక్టర్ అర్జున రావుతో కలిసి ఆయన చార్మినార్, చౌమొహల్లా ప్యాలస్ ను సందర్శించారు. ఈ సందర్భంగా చార్మినార్ తో పాటు పరిసర ప్రాంతాల్లో కలియ తిరుగుతూ అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. చారిత్రక కట్టడాల పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఇందులో భాగంగా మచిలీ కమాన్ పునరుద్ధరణ కోసం ఇప్పటికే కులీ కుతుబ్ షా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (QQSDA) రూ.3.64 కోట్లు మంజూరు చేసినట్లు మంత్రి వెల్లడించారు. ఈ పనులకు సంబంధించి త్వరలోనే టెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తామన్నారు. అలాగే షేర్-ఇ-బాతీల్ కమాన్ రినోవేషన్ పనులను కూడా తక్షణమే చేపట్టాలని, చార్మినార్ వద్ద ఉన్న ఫౌంటైన్‌ను పర్యాటకులను ఆకర్షించేలా సుందరీకరించాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రూపొందించిన నూతన పర్యాటక విధానం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా పర్యాటక కేంద్రాలను అభివృద్ధి చేస్తున్నట్లు జూపల్లి తెలిపారు. ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్య (పీపీపీ) పద్ధతిలో మౌలిక సదుపాయాలు కల్పించడం ద్వారా అటు ఆదాయం, ఇటు స్థానికులకు ఉపాధి పెరుగుతుందని చెప్పారు.

**నగర వారసత్వ సంపదపై ప్రత్యేక దృష్టి**

హైదరాబాద్ నగరాన్ని పర్యాటక పరంగా ప్రపంచ పటంలో అగ్రస్థానంలో నిలిపేందుకు ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు మంత్రి వివరించారు. దేశ విదేశాల నుండి వచ్చే పర్యాటకుల కోసం అన్ని సౌకర్యాలు కల్పించి, నగర వారసత్వ సంపదను కాపాడుతూనే ఆధునిక హంగులు అద్దుతామని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు స్వీయ నియంత్రణ తప్పనిసరి










- నిర్లక్ష్యం, బాధ్యతారాహిత్యం వల్లే పెరుగుతున్న ప్రమాదాలు
- రాష్ట్ర రవాణా శాఖా మంత్రి పొన్నం ప్రభాకర్

**నిజామాబాద్, వెలుతురు ఏప్రిల్ 15 :** నిర్లక్ష్యం, బాధ్యతారాహిత్యం కారణంగా రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుని ఎంతోమంది నిండు ప్రాణాలను కోల్పోతున్నారని రాష్ట్ర రవాణా, బీ.సీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా బుధవారం నిజామాబాద్ శివారులోని సుగుణ గార్డెన్స్ లో పోలీస్ రవాణా శాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన అరైవ్-అలైవ్ కార్యక్రమానికి మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డి ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించగా, నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ గుప్తా, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, రవాణా శాఖ కమిషనర్ ఇలంబర్తి, ఆర్టీసీ ఎం.డీ నాగిరెడ్డి, కలెక్టర్ ఇలా త్రిపాఠి, పోలీస్ కమిషనర్ సాయి చైతన్య, మేయర్ ఉమారాణి, రాష్ట్ర మైనారిటీ కమిషన్ చైర్మన్ తారిక్ అన్సారీ తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, ట్రాఫిక్ నిబంధనలు పాటించాల్సిన ఆవశ్యకత గురించి నొక్కి చెప్పారు. ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరు స్వీయ నియంత్రణ పాటించాల్సిన ఆవశ్యకత ఉందని అన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించకుండా అజాగ్రత్తగా, అతివేగంగా వాహనాలు నడపడం, మద్యం మత్తులో డ్రైవింగ్ చేయడం, హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించకపోవడం వంటివి రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణం అవుతున్నాయని అన్నారు. వ్యక్తిగతంగా వారి కుటుంబాలతో పాటు సమాజానికి, ఇతరులకు కూడా తీరని నష్టం చేకూరుస్తున్నారని, ఎవరికివారు తమవంతు బాధ్యతగా భావిస్తూ ట్రాఫిక్ రూల్స్ ను విధిగా పాటించినప్పుడే ప్రమాదాల నివారణ సాధ్యమవుతుందని హితవు పలికారు. ముఖ్యంగా యువకులు, విద్యార్థులు వేగంగా వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు కారకులై నిండు ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వెలిబుచ్చారు. మనపై కుటుంబం ఆధారపడి ఉందనే విషయాన్ని గుర్తుంచుకుని, తప్పక ట్రాఫిక్ రూల్స్ పాటించాలని, లేకుంటే కుటుంబం మొత్తం చిన్నాభిన్నం అయ్యే పరిస్థితి నెలకొంటుందని అన్నారు. నిరంతర తనిఖీలు నిర్వహిస్తూ చలానాలు విధించినా, ఎన్ని చట్టాలు వచ్చినా, ప్రభుత్వ యంత్రాంగం ఎంతటి కఠిన చర్యలు చేపట్టినా కూడా, ప్రజల ఆలోచనా విధానాల్లో మార్పు రానంతవరకు రోడ్డు ప్రమాదాల పరిస్థితిలో మార్పు రాదని అభిప్రాయపడ్డారు.

ప్రమాదాలను నిలువరించేందుకు ప్రతిఒక్కరు బాధ్యతాయుతంగా వాహనాలు నడుపుతూ, తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని హితవు పలికారు. ప్రజల్లో అవగాహనను పెంపొందించేందుకు ఉద్దేశించిన అరైవ్-అలైవ్ లో భాగంగా విస్తృత స్థాయిలో ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని, అన్ని వర్గాల వారు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ దిశగా ప్రభుత్వం కూడా పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు చేపట్టడం జరుగుతోందని గుర్తు చేశారు.

ఇదిలాఉండగా, నిజామాబాద్ జిల్లాకు త్వరలోనే కొత్త బస్ డిపో రానుందని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ద్వారా ప్రతిరోజూ 10వేల బస్సులు సుమారు 35 లక్షల కిలోమీటర్లు తిరుగుతూ, 65 లక్షల మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరుస్తున్నాయని తెలిపారు. ఆర్టీసీ కార్మికుల సంక్షేమం, ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం, ఆర్టీసీ సంస్థ పరిరక్షణే ధ్యేయంగా తమ ప్రభుత్వం ముందుకెళ్తోందని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. రవాణా శాఖ పరంగా కూడా చెక్ పోస్టులు ఎత్తివేయడం వంటి అనేక నూతన సంస్కరణలను అమల్లోకి తెచ్చామని గుర్తు చేశారు.

రవాణా శాఖ కమిషనర్ ఇలంబర్తి మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాలలో మన దేశంలో ప్రతి ఏటా లక్షా 50 వేల మంది, రాష్ట్రంలో 7వేల మంది ప్రాణాలు కోల్పోతున్నారని అన్నారు. వీటిలో సుమారు 45శాతం వరకు ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించని కారణంగా ప్రాణాలు కోల్పోతున్నారని అన్నారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నిబంధనలను విధిగా పాటించి ప్రమాదాలకు నియంత్రించేందుకు కృషి చేయాలన్నారు.

కలెక్టర్ ఇలా త్రిపాఠి, సీపీ సాయి చైతన్యలు మాట్లాడుతూ, మద్యం సేవించి వాహనాలు నడపడం, హెల్మెట్, సీటు బెల్టు ధరించకపోవడం, అతివేగం, రాంగ్ సైడ్ డ్రైవింగ్, ఓవర్ టేక్ చేయడం, సెల్ ఫోన్ డ్రైవింగ్, ఆటోలలో సామర్థ్యానికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవడం, రాంగ్ సైడ్ వెళ్లడం, సిగ్నల్స్ జంప్ చేయడం తదితర కారణాల వల్ల ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ట్రాఫిక్ రూల్స్ పాటించకుండా నిర్లక్ష్యంగా వాహనాలు నడపడం ప్రమాదాల సంఖ్య పెరిగేందుకు కారణమవుతోందని అన్నారు. అతివేగాన్ని మానుకోవాలని, రోడ్డు భద్రతా నిబంధనలను తు.చ తప్పకుండా పాటిస్తూ ఎంతో అప్రమత్తతో వాహనాలు నడపాలని హితవు పలికారు.

ఈ సందర్భంగా ఇటీవల రోడ్డు ప్రమాదాలలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలు ఎదుర్కొంటున్న ఇబ్బందుల గురించి బాధితులు వెల్లడిస్తూ కన్నీటి పర్యంతం అయ్యారు. అతి వేగం, అజాగ్రత్తగా వాహనాలు నడిపి తమ లాంటి దుస్థితిని కొని తెచ్చుకోవద్దని విజ్ఞప్తి చేయడం అందరినీ ఆలోచింపజేసింది. రహ్ వీర్, పీ.ఎం రాహత్, హిట్ అండ్ రన్ లకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక తోడ్పాటు, ప్రోత్సాహకాలపై ప్రజలకు అవగాహన పెంపొందించేందుకు వీలుగా రూపొందించిన గోడ ప్రతులను, కర పత్రాలను మంత్రి ఆవిష్కరించారు. రెడ్ క్రాస్ సొసైటీ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, అదనపు కలెక్టర్ దిలీప్ కుమార్, సబ్ కలెక్టర్లు వికాస్ మహతో, అభిగ్యాన్ మాల్వియ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజిరెడ్డి, నుడా చైర్మన్ కేశ వేణు, డాక్టర్ కవితా రెడ్డి, డీటీసీ దుర్గా ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

## నియోజకవర్గాల పునర్విభజన బిల్లును వ్యతిరేకిస్తున్నాం- రాజకీయ లబ్ధి కోసం కేంద్రం ప్రయత్నం : ఖర్గే

డీలిమిటేషన్ బిల్లుకు సంబంధించి కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కీలక వ్యాఖ్యలు చేశారు. నియోజకవర్గాల పునర్విభజన బిల్లును వ్యతిరేకించాలని నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు. అయితే మహిళా రిజర్వేషన్లకు తాము వ్యతిరేకం కాదని ఆయన స్పష్టం చేశారు. రాజకీయ లబ్ధి కోసం కేంద్రం ప్రయత్నిస్తోందని ఖర్గే ఆరోపించారు. “మహిళా రిజర్వేషన్ బిల్లుకు మేమంతా అనుకూలం. కానీ వారు దాన్ని తీసుకువచ్చిన విధానం పట్ల మాకు అభ్యంతరాలున్నాయి. ఇది పూర్తిగా రాజకీయ ప్రేరేపితం. కేవలం ప్రతిపక్ష పార్టీలను అణిచివేయడానికే ప్రభుత్వం ఇలా చేస్తోంది. మహిళా రిజర్వేషన్ బిల్లు మద్దతు ఇవ్వాలని మేమంతా నిర్ణయించాం. 2010 నుంచి 2023 వరకు రాజ్యాంగ సవరణకు అంగీకరించాం. పాత సవరణలనే అమలు చేయాలని కోరుతున్నాం. నియోజకవర్గాల పునర్విభజన(డీలిమిటేషన్) విషయంలో వారు (ప్రభుత్వం) కొన్ని గిమ్మిక్కులు చేస్తోంది. పార్టీలన్నీ ఏకతాటిపై నిలిచి పార్లమెంటులో ఐక్యంగా పోరాడాలి. మేం ఈ బిల్లును వ్యతిరేకిస్తాం, కానీ మహిళా రిజర్వేషన్లకు మేం వ్యతిరేకం కాదు. ఈ బిల్లులో వారు పొందుపరిచిన విధానం చూస్తే కనీసం జనాభా లెక్కల ప్రక్రియను కూడా పూర్తి చేయకుండానే డీలిమిటేషన్ అంశాన్ని చేర్చారు. రాజ్యాంగ అధికారాలన్నింటినీ కార్యనిర్వాహక వ్యవస్థ తన గుప్పిట్లోకి తీసుకుంటోంది. ప్రధానంగా వ్యవస్థలు, పార్లమెంటు



చేతుల్లో ఉండాల్సిన అధికారాన్ని ఎప్పుడైనా డీలిమిటేషన్ మార్చుకునే వీలుగా వారు తమ చేతుల్లోకి తీసుకున్నారు. అసోం, జమ్మూకశ్మీర్‌లో వారు ఇప్పటికే మమ్మల్ని మోసం చేశారు.”

# ఆర్టిసన్ల సమ్మె ఉధృతం-8వ రోజుకు చేరిన విద్యుత్ కార్మికుల

# పోరాటం, పరిష్కారం లేకుంటే మరింత తీవ్రత హెచ్చరిక





**సైనిక్‌పురి, ఏప్రిల్ 15 వెలుతురు:**విద్యుత్ ఆర్టిసన్ కార్మికుల నిరవధిక సమ్మె బుధవారం నాటికి ఎనిమిదవ రోజుకు చేరుకుని మరింత ఉధృతమైంది. తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం సైనిక్‌పురి డివిజన్ కార్యాలయం వద్ద కార్మికులు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. డివిజన్ పరిధిలోని అన్ని సెక్షన్లకు చెందిన కార్మికులు విధులను పూర్తిగా బహిష్కరించి ఆందోళనలో పాల్గొన్నారు.ప్రభుత్వం తమ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ, లేనిపక్షంలో ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని కార్మికులు హెచ్చరించారు. ఎనిమిది రోజులుగా సమ్మె కొనసాగుతున్న నేపథ్యంలో కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ నిర్వహణ పనులకు ఆటంకం ఏర్పడుతున్నట్లు సమాచారం.

**బీసీ ఉద్యోగుల సంఘం సంఘీభావం**

ఈ నిరసన కార్యక్రమానికి విద్యుత్ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముత్యం వెంకన్న గౌడ్ హాజరై కార్మికులకు సంఘీభావం తెలిపారు. కార్మికుల సమస్యలపై ఉన్నతాధికారులతో చర్చలు జరిపి త్వరితగతిన పరిష్కారం తీసుకురావడానికి కృషి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు.అవసరమైతే రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మరియు విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్కను కలిసి సమస్య తీవ్రతను వివరించి చర్చలు జరుపుతామని వెల్లడించారు. ఆర్టిసన్ కార్మికుల న్యాయపోరాటానికి తమ సంఘం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని స్పష్టం చేశారు.

**వంటా-వార్పుతో నిరసన**

సమ్మెలో భాగంగా కార్మికులు కార్యాలయ ప్రాంగణంలోనే వంటా-వార్పు కార్యక్రమం నిర్వహించడం గమనార్హం. నిరసనకు ప్రతీకగా అక్కడే భోజనాలు సిద్ధం చేసి తిన్నారు. ముత్యం వెంకన్న గౌడ్ స్వయంగా కార్మికులకు అన్నం వడ్డించి వారితో కలిసి భోజనం చేయడం సంఘీభావానికి ప్రతీకగా నిలిచింది.ఈ కార్యక్రమంలో హబ్సిగూడ సర్కిల్ జాక్ చైర్మెన్ వెంకట్ రెడ్డి సహా కిష్టాఫర్, జానయ్య, మల్లారెడ్డి, పైసా రవి, మోహన్ రావు, జానీ, ప్రసాద్, జమాల్, నరేష్ గౌడ్, విజయ్, కృష్ణ, రమేష్, రాజు, వెంకటేష్, దేవకుమార్, సుగుణ, లక్ష్మి, మమత, విజయ తదితరులు పాల్గొన్నారు. పురుషులు, మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై ఆందోళనకు బలాన్ని చేకూర్చారు.

**చర్చలకు పిలవాలని డిమాండ్**

సమ్మె కొనసాగుతున్న నేపథ్యంలో ప్రభుత్వం తక్షణమే స్పందించి కార్మిక సంఘాలను చర్చలకు పిలవాలని డిమాండ్‌లు వెల్లువెత్తుతున్నాయి. సమస్య పరిష్కారంపై స్పష్టత లేకపోవడంతో కార్మికుల్లో ఆగ్రహం పెరుగుతోంది. పరిస్థితి ఇలానే కొనసాగితే విద్యుత్ సేవలపై మరింత ప్రభావం పడే అవకాశముందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# ఆరుట్ల గ్రామంలో ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి

# సహకారంతో మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ

### కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం పేద ప్రజలకు

### ఎల్లప్పుడూ అండగా ఉంటుంది

### కాంగ్రెస్ పార్టీ ఆరుట్ల గ్రామశాఖ అధ్యక్షుడు

### నూకం బాలరాజ్ ముదిరాజ్



**మంచాల వెలుతురు ఏప్రిల్ 15:**మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో ప్రవేట్ ఆసుపత్రుల్లో వైద్యం చేయించుకున్న నిరుపేదలకు ఇబ్రహీంప ట్నంఎమ్మెల్యేమల్ రెడ్డి రంగారెడ్డి సహకారంతో మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను కాంగ్రెస్ పార్టీ ఆ రుట్ల గ్రామశాఖ అధ్యక్షుడు నూకం బాలరాజ్ ముదిరాజ్ కార్యదర్శి చిందం శ్రీశైలం ఆధ్వర్యంలో లబ్ధిదారు లు అల్లంపల్లి అన్నమ్మ చీమల మహేష్ కు చెక్కులు పంపిణీ చేశారు ఈసందర్భంగా గ్రామశాఖ అధ్యక్షుడు నూకం బాలరాజ్ రాజ్ కలిసి మాట్లాడుతూ ప్రవేట్ ఆసుపత్రిలో వైద్యం చేయించుకోలేని స్థితిలోఉన్నపేద ప్రజలకోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన సీఎం రిలీఫ్ ఫండ్ పేద ప్రజలకు ఎంతో ఆసరావరం లాంటిది అని అ న్నారు పేద ప్రజల కోసం ప్రవేశపెట్టిన సీఎంరిలీఫ్ ఫండ్ పథకం పేద ప్రజల కోసం అని అన్నారు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం పేదప్రజల కోసం ఎల్లప్పుడూ అండగా ఉంటుంది అన్నారు ఈసందర్భంగా లబ్ది దారులు అల్లంపల్లి అన్నమ్మ మాట్లాడుతూ నావైద్యం ఖర్చుల కోసం సీఎం రిలీఫ్ ఫండ్ డబ్బులు మంజూరు చేయిం చిన ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి గారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు మాకు ఉండటా నికి ఇల్లు లేదు అద్దెఇంట్లో జీవనం సాగిస్తున్నాం మాకు ప్రభుత్వంఇంటి స్థలం కేటాయించి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి మా కుటుంబాని ఆదుకోవాలని మీడియాద్వారా ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రం గా రెడ్డి గారిని కోరారు ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జిలమోని శ్రీనివాస్ ముదిరాజ్ మా ర సురేష్ ఆరుట్ల యూత్ కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు బుడిగెల పరమేష్ నాయకులు ఆర్ల శ్రీకాంత్ గొరిగే కృష్ణ అల్లంప ల్లి శ్రీనివాస్ గుప్తా తదితరులు పాల్గొన్నారు

# కప్పపహా డ్ గ్రామంలో  నవభారత నిర్మాత రాజ్యాంగ

# ప్రదాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 135 జయంతివేడుకలు



### పాల్గొన్న గ్రామ సర్పంచ్ బింగి గీత రాములయ్య, అంబేద్కర్ సంఘం అధ్యక్ష కార్యదర్శులు జంగిలి రాజశేఖర్, జంగిలి ప్రశాంత్

**ఇబ్రాహీంపట్నం వెలుతురు ఏప్రిల్ 15:** ఇబ్రహీంపట్నం మండలం కప్పపహాడ్ గ్రామంలో మంగళవారం రాత్రి జరిగిన డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి వేడుకల సందర్భంగా అంబేద్కర్ విగ్రహా ఆవిష్కరించిన అంబేద్కర్ సంఘంఅధ్యక్ష కార్యదర్శులు జం గిలి రాజశేఖర్ జంగిలి ప్రశాంత్ కోశాధికారి జంగిలి ప్రభుదాస్ గ్రామసర్పంచ్ బింగి గీత రాములయ్య

అంబేద్కర్ శిలఫలకాన్ని ఆవిష్కరించిన గ్రామ సీనియర్ నాయకులు జంగిలి ఆశీర్వాదంచాతల జంగయ్య జంగిలి బిక్షపతి జంగిలి యాదయ్య స్వామి మాజీ ఉపసర్పంచ్ మొహమ్మద్ మునీర్ ఉప సర్పంచ్ పల్లపు రమేష్ వివిధ పార్టీల నాయకులుగ్రామ ప్రజల సహకారంతో విరాళాలతో నిర్మించుకున్న అంబేద్కర్ విగ్రహం ఆవిష్కరణ రాజకీయాలకతీతంగా కులాలకతీతంగా మతాలకతీతంగా ప్రజాప్రతినిధులు గ్రామపంచాయతీ పాలకవర్గం సర్పంచ్ ఉపసర్పంచ్ వార్డ్ మెంబర్లు మాజీ ఉపసర్పంచ్ మాజీ వార్డ్ మెంబర్లు మాజీ ప్రజా ప్రతి నిధులు సీనియర్ నాయకులు గ్రామయువజన నాయకులు మహిళా సంఘం నాయకులుయువకులు అధిక సంఖ్యలో పాల్గొని అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరణలో పాల్గొన్నారుఈ కార్యక్రమంలో గ్రామఅంబేద్కర్ యు వజన సంఘం అధ్యక్షులు జంగిలి రాజశేఖర్ మాట్లాడుతూ అంబేద్కర్ కొందరి వాడు కాదు అందరివాడు చి న్నతనంలో నుండే అడుగడుగునా అవమానాలు ఎదుర్కొని రాజ్యాంగాన్ని రాసినారు భారతదేశానికి దిక్సూ చిగా నిలిచి ప్రపంచ మేధావిగా ఎదిగి అంత గొప్ప మహనీయుడు జయంతి సందర్భంగా అంబేద్కర్ ఆశ యాల ముందుకు తీసుకుపోవాలని ఈకార్యక్రమంలో మాట్లాడారుఅంబేద్కర్ కమిటీ సభ్యులుపల్లపు విగ్నేష్ జంగిలి దాస్ జంగిలి రవి నీట్టు నరసింహ జంగిలి లింగం జంగిలి మహేందర్ జంగిలి లింగం జంగిలినరసిం హగ్రామ సర్పంచ్ బింగి గీతా రాములయ్య ఉపసర్పంచ్ పల్లపు రమేష్ వార్డు సభ్యులు చేతల ఆనంద్ జం గిలీ శంకర్ అరిగే అలివేలు శ్రీశైలం పల్లపు విజయ శేఖర్ దొడ్డి అంజయ్య జంగిలి బాల్రాజ్ బూడిద లక్ష్మారెడ్డి వివిధ పార్టీల నాయకులు ఉడతల జలంధర్ గౌడ్ ఏర్పుల యాదయ్య నెట్టు వీరయ్య, బూడిద మల్లారెడ్డి

ఆశీర్వాదం జంగిలి బిక్షపతి స్వామి బూడిద వెంకటరెడ్డి బూడిద మల్ రెడ్డి రాజిరెడ్డి ఉడతల సతీష్ గౌడ్ జంగిలి దేవదాస్ నీట్టు నరసింహ ఉడుతల నరసింహ వెంకటేష్ నీట్టు బాలరాజ్ ప్రభుత్వ ఉద్యోగులుజంగిలి యాదయ్య, బింగి రాములయ్య, జంగిలి జంగయ్య, జంగిలి కృష్ణ జంగిలి ప్రకాష్,జంగిలి అంజయ్య, జంగిలి రవీందర్ యువజన నాయకులు జంగిలి శివకుమార్ జంగిలి భూషణ్ జంగిలి విష్ణువర్ధన్, జంగిలి బుగ్గ రాములుజంగిలి నరేష్, జీవన్ ప్రవీణ్ సాయి జంగిలి విక్రమ్, ప్రభాకర్ కర్ణాకర్, అరవింద్ తదితరులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసినారు.

## కుత్బుల్లాపూర్  ప్రెస్ క్లబ్ నిర్మాణం పూర్తిచేసి అందుబాటులోకి తెస్తాం..

### యూనియన్లకు అతీతంగా ఉమ్మడి ప్రెస్ క్లబ్ నిర్మాణం

### అందరికీ అందుబాటులోకి సభ్యత్వనమోదు కార్యక్రమం

### బాధ్యతలు స్వీకరించిన 12 మంది బృందం

### దిశానిర్దేశం చేసిన రాష్ట్ర నాయకులు ఆస్కాని మారుతి సాగర్



**కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) ఏప్రిల్ 15:**కొన్ని కారణాల వలన అర్ధాంతరంగా నిర్మాణ దశలో ఆగిపోయిన ప్రెస్ క్లబ్ భవనాన్ని త్వరలోనే పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొస్తామని తెలంగాణ యూనియన్ వర్కింగ్ జర్నలిస్ట్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అస్కానీ మారుతి సాగర్  తెలిపారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ప్రెస్ క్లబ్ నిర్మాణ నిర్వహణ కమిటీని యూనియన్లకు అతీతంగా బుధవారం కుత్బుల్లాపూర్ ప్రెస్ క్లబ్ లో జరిగిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సలహాదారులుగా అస్కాని మారుతిసాగర్, గడ్డమీది బాలరాజు, తన్నీరు శ్రీనివాస్, సభ్యులుగా గుంటూరు శేఖర్, రంగు వెంకటేష్, జగదీష్, కసుకుర్తి వెంకట్, కోలేపాక వెంకట్, గడ్డమీది అశోక్, గోలిపల్లి దయాకర్ రెడ్డి, సుగ్రీవుడు ముదిరాజ్, రెడ్డిబోయిన మల్లేష్ యాదవ్, మాధవరెడ్డి, గోవిందరావు, శివకుమార్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ... ప్రెస్ క్లబ్ నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తెస్తామని హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో అన్ని యూనియన్లకు సంబంధించిన 100 కి పైగా పాత్రికేయులు పాల్గొన్నారు.

## మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రెటరీగా నూతనంగా నియమితులైన అన్నారం గోపాల్ రెడ్డి.



**కుత్బుల్లాపూర్ వెలుతురు ప్రతినిధి ఏప్రిల్ 15:**కుత్బుల్లాపూర్ మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్ ని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రెటరీగా నియమితులైన అన్నారం గోపాల్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు.అనంతరం డిసిసి ఉపాధ్యక్షులు కూన శ్రీనివాస్ గౌడ్ ని సైతం కలిసి శాలువాతో సత్కరించారు.అనంతరం ఇరువురు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు మరింత కృషి చేయాలని, ప్రభుత్వం చేపట్టి అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి మరింత బలంగా తీసుకెళ్లి పార్టీని బలోపేతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా జనరల్ సెక్రెటరీ గోపాల్ రెడ్డి, లేబర్ సెల్ నాయకులు ఉపేందర్ రెడ్డి అశోక్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు నవీన్ ముదిరాజ్, వెంకట్ రెడ్డి, కావలి గోపాల్ తదితరులు పాల్గొన్నారు

## బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ చేతుల మీదుగా అంగన్ వాడి టీచర్లకు నూతన "సెల్ ఫోన్లు" అందజేత.



**కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) ఏప్రిల్ 15:** పేట్ బషీరాబాద్ లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సీడీపీవో అధికారిణి రేణుక ఆధ్వర్యంలో బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్  చేతుల మీదుగా బుధవారం కుత్బుల్లాపూర్ లోని దాదాపు 190 మంది అంగన్ వాడి టీచర్లకు నూతన సెల్ ఫోన్ లను అందజేశారు.ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్లు కృష్ణప్రియ, భాగ్య, జ్యోతి, వరలక్ష్మీ, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మేడ్చల్ జిల్లా అక్రిడిటేషన్ కమిటీ నియామకంలో అవకతవకలు

### అక్రిడిటేషన్ కమిటీని తక్షణమే రద్దు చేయాలి

### డిపిఆర్ఓ పై సమాచార కమిషనర్ కు ఫిర్యాదు

**మేడ్చల్, ఏప్రిల్ 15 వెలుతురు:**మేడ్చల్ జిల్లా అక్రిడిటేషన్ కమిటీలో అవకతవకలు జరిగాయని జిల్లాలోని పలువురు సీనియర్ జర్నలిస్టులు బుధవారం జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి కి ఫిర్యాదు చేశారు. సమాచార పౌర సంబంధాల శాఖ జారీ చేసిన ఉత్తర్వులకు విరుద్ధంగా జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారిని కమిటీని నియమించారని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. ముఖ్యంగా ఒకే యూనియన్ కు పెద్దపీట వేయడంతో పాటు జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారిని తనకు అనుకూలంగా ఉన్నవారిని కమిటీలో నియమించారని సమాచార పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ దృష్టికి తీసుకు వెళ్లినట్లు వారు పేర్కొన్నారు. జిల్లా అక్రిడిటేషన్ కమిటీ నియామకంపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని వారు కోరారు.  ఈ విషయంలో ఇప్పటికే సమాచార హక్కు చట్టం కింద అక్రిడిటేషన్ కమిటీ నియామకంపై పూర్తి సమాచారం ఇవ్వాలని జిల్లా పౌర సంబంధాల అధికారిని కోరినట్లు వారు తెలిపారు.  ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లనున్నట్లు వారు తెలిపారు.  నిబంధనలకు విరుద్ధంగా నియమించిన జిల్లా అక్రిడిటేషన్ కమిటీని రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు.

# సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ కి, రిజిస్ట్రార్ కి మరియు భారత రాష్ట్రపతి లకు లేఖలు వ్రాసిన పెన్షనర్లు



**హైదరాబాద్ వెలుతురు ఏప్రిల్ 15:** పెన్షనర్లకు ఇవ్వాల్సిన బకాయిలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సంఘాలు విడి విడిగా మరియు ఉద్యోగ ఉపాధ్యాయ జెఏసి, పెన్షనర్ల జెఏసి పక్షాన రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో అనేక ఉద్యమాలు చేస్తున్నాయి. 2024 మార్చి నుండి రిటైర్ అయిన ఉద్యోగులు "రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్" లాంటి వేదికలేర్పర్చుకొని మండల జిల్లా రాష్ట్ర స్థాయిల్లో అనేక ఉద్యమాలు చేస్తున్నారు. బీజేపి ఎమ్మెల్సీలు కూడా నిరాహారదీక్షలు చేశారు. అయినా ప్రభుత్వం బకాయిల చెల్లింపులో మీనమేషాలు లెక్కిస్తుంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వంపై వత్తిడి తేవడంకోసం రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్యం, నిర్లిప్తతకు నిరసనగా సామాజికవేత్త బక్కా జడ్సన్ గారు వ్రాసిన లేఖను సుప్రీం కోర్టు ప్రజా ప్రయోజన వ్యాజ్యం(పిల్) గా స్వీకరించింది. అందుకు మద్దతుగా రాష్ట్రంలోని రిటైర్డ్ ఉద్యోగులు అందరూ ఈ నెల 15 వ తేదీన సామూహికంగా సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ గారికి, రిజిస్ట్రార్ గారికి మరియు భారత రాష్ట్రపతి గారికి లేఖలు వ్రాయాలని, తెలంగాణ రాష్ట్రంలోనీ పెన్షనర్లు అందరూ అందుబాటులో ఉన్న పోస్టాఫీసులకు వెళ్ళి మూకుమ్మడిగా అట్టి లేఖలు పోస్టు చేయాలని కోరడం జరిగింది. అందులో భాగంగానే బుధవారం రోజున వాసవీ శ్రీ నిలయం ఎల్ బి నగర్ గేటెడ్ కమ్యూనిటీలో ఉన్న పెన్షనర్లు ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ ప్రదర్శన చేయడం జరిగింది. దాదాపు 15 మంది తాము సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ గారికి, రిజిస్ట్రార్ గారికి మరియు భారత రాష్ట్రపతి గారికి వ్రాసిన లేఖలు సమీప పోస్టు ఆఫీసుకు వెళ్ళి సామూహికంగా పోస్టు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పెన్షనర్లు ఆకుల సురేష్ కుమార్, గోలి రాజయ్య, ఇమ్మడి వెంకటేశం, సూర్యపల్లి ఉమాదేవి, ఇంజమూరి రఘునందన్,వీరమల్ల అంజయ్య, టి. యాదగిరి, లంకా సత్యవర్ధన్, రచ్చ ఎల్లయ్య, పల్లాటి నాగయ్య, కొనకంచి భరత్ కుమార్, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

# స్టార్ట్ ఎర్లీ - గో స్లోలీ - రీచ్ సేఫ్లీ - అరైవ్ అలైవ్ సదస్సులో కూకట్పల్లి ఏడీసీపీ సుదర్శన్





**సైబరాబాద్ వెలుతురు ఏప్రిల్ 15:** సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'అరైవ్ ఆలైవ్' రోడ్డు భధ్యత అవగాహన కార్యక్రమంలో భాగంగా, నేడు కూకట్పల్లిలోని జెనెసిస్ స్కూల్‌లో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కూకట్పల్లి ఏడీసీపీ సుదర్శన్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. నేటి కాలంలో మారుతున్న జీవన విధానం, సరైన నిద్ర లేకపోవడం మరియు గమ్యస్థానాలకు త్వరగా చేరుకోవాలనే తొందర వల్లే అత్యధికంగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.మానవ ప్రాణం ఎంతో అమూల్యమైనదని, ప్రతి ఒక్కరూ తమపై ఆధారపడి ఉన్న కుటుంబ సభ్యుల క్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని బాధ్యతాయుతంగా వాహనాలు నడపాలని సూచించారు. ప్రయాణాల్లో "స్టార్ట్ ఎర్లీ ఉ గో స్లోలీ ఉ రీచ్ సేఫ్లీ" అనే నినాదాన్ని ప్రతి ఒక్కరూ పాటించాలని కోరారు. ముఖ్యంగా యువత మరియు విద్యార్థులు ఎక్కువగా రోడ్డు ప్రమాదాల బారిన పడుతున్నారని, అందుకే వారిలో మార్పు తీసుకురావడమే లక్ష్యంగా ఈ సదస్సుల నిర్వహిస్తున్నామని తెలిపారు.ముఖ్యంగా హెల్మెట్ ధరించడంపై ఉన్న అపోహల గురించి స్పందిస్తూ, హెల్మెట్ పెట్టుకుంటే జుట్టు రాలిపోతుందనే అపోహతో ప్రాణాలను రిస్క్ లో పెట్టవద్దని అదనపు ఏడీసీపీ హితవు పలికారు. ప్రమాదం జరిగినప్పుడు ప్రాణాలను కాపాడే ఏకైక రక్షణ కవచం హెల్మెట్ మాత్రమేనని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమం లో కూకట్‌పల్లి లా అండ్ ఆర్డర్ ఎస్‌హెచ్‌ఓ కె.వి. సుబ్బారావు, ట్రాఫిక్ ఎస్‌హెచ్‌ఓ తిమ్మప్ప జెనెసిస్ స్కూల్ విద్యార్థులు, పోలీసులు మరియు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# ఇబ్రహీంపట్నంలో తెలంగాణ ఉద్య మకారుడు బిఆర్ఎస్ పార్టీ యువ నాయకుడు కర్నే అరవింద్ కుటుంబాన్ని పరామర్శించిన కేటీఆర్





**ఇబ్రహీంపట్నం వెలుతురు ఏప్రిల్ 15:** బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్సీ శ్రీ కర్నె ప్రభాకర్ గారి సోదరుడి కుమారుడు బీఆర్ఎస్ నా యకులు కర్నె అరవింద్ ఇటీవల మరణించిన నేపథ్యంలో ఇబ్రహీంపట్నంలోని వారి నివాసానికి వెళ్లి అరవిం ద్ గారి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించికర్నె ప్రభాకర్ గారిని మరియు వారి కుటుంబ సభ్యు లను పరామర్శించి ధైర్యం చెప్పిన బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రంగారెడ్డి జిల్లా పార్టీ అధ్యక్షు లు శ్రీ మంచిరెడ్డి కిషన్ రెడ్డిలి గారు, ఎమ్మెల్సీశంబిపూర్ రాజు రాష్ట్రనాయకులు క్యామ మల్లేష్ యువనేత మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి(బంటి) ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ చైర్మన్ టేకుల సుదర్శన్ రెడ్డి రంగా రెడ్డి జిల్లా మాజీ గ్రంథాలయం చైర్మన్ వెంకటరమణారెడ్డి స్థానిక ఇబ్రహీంపట్నం నియోజకవర్గంప్రజాప్రతిని ధులు బిఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు

# సీబీఎస్ఈ 10వ తరగతి ఫలితాలు విడుదల... గతేడాది కంటే పెరిగిన ఉత్తీర్ణత



సుమారు 1.47 లక్షల మందికి కంపార్ట్‌మెంట్ అవకాశం

సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) 10వ తరగతి పరీక్షా ఫలితాలను బుధవారం విడుదల చేసింది. ఈ ఏడాది మొత్తం 93.70 శాతం ఉత్తీర్ణత నమోదైంది. గత ఏడాది (93.66 శాతం) ఉత్తీర్ణత శాతంతో పోలిస్తే ఇది స్వల్పంగా ఎక్కువ కావడం గమనార్హం.బుధవారం సాయంత్రం 4 గంటలకు విడుదల చేసిన ఈ ఫలితాలు బోర్డు అధికారిక వెబ్‌సైట్లతో పాటు డిజీలాకర్, ఉమంగ్ యాప్‌లలో అందుబాటులో ఉన్నాయని అధికారులు తెలిపారు. ఈ ఏడాది పరీక్షల కోసం మొత్తం 24,83,479 మంది విద్యార్థులు నమోదు చేసుకోగా, వారిలో 24,71,777 మంది హాజరయ్యారు. వీరిలో 23,16,008 మంది ఉత్తీర్ణత సాధించినట్లు బోర్డు వెల్లడించింది.

అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారిలో 55,368 మంది విద్యార్థులు (2.24 శాతం) 95 శాతానికి పైగా మార్కులు సాధించారు. అలాగే, 2,21,574 మంది విద్యార్థులు (8.96 శాతం) 90 శాతానికి పైగా మార్కులు పొందారు. ప్రత్యేక అవసరాలున్న విద్యార్థులలో 91 మంది 95 శాతం పైగా, 452 మంది 90 శాతం పైగా మార్కులు సాధించి సత్తా చాటారు.

మరోవైపు, 1,47,172 మంది విద్యార్థులు (5.95 శాతం) కంపార్ట్‌మెంట్ కేటగిరీలో ఉన్నారు. వీరికి సప్లిమెంటరీ పరీక్షల ద్వారా ఫలితాలను మెరుగుపరుచుకునే అవకాశం కల్పించారు. జపాన్ నుంచి ఘనా వరకు 27 దేశాల్లో విస్తరించి ఉన్న సీబీఎస్ఈ, సకాలంలో ఫలితాలు విడుదల చేయడం ద్వారా తమ పారదర్శక, సమర్థవంతమైన పరీక్షా విధానాన్ని మరోసారి చాటుకున్నామని బోర్డు పేర్కొంది.

# తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ ఎంప్లాయిస్ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

### ఇబ్రహీంపట్నం డివిజన్ విద్యుత్ ఆర్టిజన్ కార్మిక సంఘం నాయకుడు చీమల మహేశ్వర రావు



**ఇబ్రహీంపట్నం వెలుతురు ఏప్రిల్ 15:** ఇబ్రహీంపట్నం మండలం ఇబ్రహీంపట్నం డివిజన్ విద్యుత్ ఆర్టిజన్ కార్మిక సంఘం నాయకుడు చీమల మ హేశ్వరరావు మాట్లాడుతూ రాత్రనక పగలనక విద్యుత్ సబ్ స్టేషన్ లో నిరంతరం పనిచేసే ఏకైక కార్మికులు ఆర్టిజన్ విద్యుత్ కార్మికులు అన్నారు ప్రజలకు రైతులకు విద్యుత్ కు ఎలాంటి అంతరాయం కలిగిన వెంటనే స్పందించి ప్రజల విద్యుత్ సమస్యలు పరిష్కరించేది ఆర్టిజన్ విద్యుత్ కార్మికులు అన్నారు తెలంగా ణ విద్యుత్ ఆర్టిజన్ ఎంప్లాయిస్ కార్మికుల న్యాయపరమైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గత 8రోజులుగా విద్యుత్ ఆర్టిజన్ కార్మికులు సమ్మెచేస్తున్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి చీమకుట్టినట్టు కూడా కావడంలేదు అని అన్నారు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తమ న్యాయపరమైన డిమాండ్లు పరిష్కరిం చే వరకు సమ్మె కొనసాగిస్తామని హెచ్చరించారు ఆర్టిజన్ లను రెగ్యులర్ ఉద్యోగులుగా మార్చాలనిఆన్ మ్యాన్ డిస్ట్రీ బ్యూషన్ వర్కర్లు బిల్ కలెక్టర్లను పీస్ రేట్ వర్కర్లను ఆర్టిజన్ లుగా కన్వర్షన్ చేయాలి ఆర్టిజన్ విద్యుత్ కార్మికులకు ప్రభుత్వం నుండి అన్నిరకాల బెనిఫిట్స్ వచ్చేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డి మాండ్ చేశారు ప్రభుత్వంతమ డిమాండ్లను పరిష్కరించకపోతే ఉద్యమాన్ని ఎంతవరకైనా తీసుకొని వెళ్తా మ ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు సమ్మెలో పాల్గొన్న ఉద్యోగులను ఉద్యోగం నుండి తొలగి స్తామని బెది రింపులకు పాల్పడుతున్నారని ఇలాంటి బెదిరింపులకు భయపడేది లేదు.అని అన్నారు ప్రభు త్వం వెంటనే స్పందించి మా సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమం వేగవంతం చేస్తామని హెచ్చరించారు

# నూతన దంపతులు ప్రణతి భాస్కర్ ను ఆశీర్వదించిన మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి



**ఇబ్రహీంపట్నం వెలుతురు ఏప్రిల్ 15:** ఇబ్రహీంపట్నం మండలం ఎలిమినేడు గ్రామానికి చెందిన ప్రణతి భాస్కర్ ల రిసెప్షన్ కెఎంఆర్ గార్డెన్ లో జరి గిన రిసెప్షన్ లో ముఖ్యఅతిథి గా మునుగోడుఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి కుటుంబ సమేతంగా హాజరై వధూ వరులను ఆశీర్వదించారు ఈకార్యక్రమంలో శ్రీశైలం లక్ష్మి బాలశివుడు గౌడ్ శ్రీరామ్ యాదవ్ బజార్ బిక్షపతి బండ కుమార్ పొలమోని రామకృష్ణ యాదవ్ బన్నీ సతీష్ మహేందర్ శంకర్ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు

# మహిళా రిజర్వేషన్ బిల్లులో బీసీ మహిళలకు సబ్ కోటా ఉండాల్సిందేనని ఏప్రిల్ 16న ఢిల్లీలోనీ జంతర్ మంతర్ వద్ద దీక్ష

### మహిళా రిజర్వేషన్ బిల్లు అగ్రకులాల మహిళలకే లాభం బీసీ మహిళలకు అన్యాయం

### బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్



**హైదరాబాద్ వెలుతురు ఏప్రిల్ 15:** అగ్రకులాలకు మరో వంద సంవత్సరాలు రాజ్యాధికారం కట్టబెట్టడానికే మహిళా రిజర్వేషన్ బిల్లు తీసుకువస్తున్నారని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ పేర్కొన్నారు.మహిళా రిజర్వేషన్ బిల్లులో బీసీ మహిళలకు సబ్ కోటా ఉండాల్సిందేనని ఏప్రిల్ 16న ఢిల్లీలోనీ జంతర్ మంతర్ వద్ద దీక్ష చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే పార్లమెంటు,అసెంబ్లీ (చట్ట సభలో) లో మెజార్టీగా ఉన్న ఓబీసీలకు ప్రాతినిధ్యం లేక రాజకీయంగా వెనుక బడి పోతుంటే తెర మీదకు మహిళా బిల్లు పేరుతో మళ్లీ అగ్రకులాలకు చెందిన మహిళలే చట్ట సభలకు వెళతారని బీసీ మహిళలు రాజకీయ అణచివేతకు గురవుతారని లింగం గౌడ్ ఆందోళన వ్యక్తం చేశారు.

# కేరళలోని దేవాలయానికి భారీ రోబోటిక్ ఏనుగు బహూకరణ



కేరళలోని ఓ దేవాలయానికి పెటా ఇండియా-అనితా డోంగ్రే ఫౌండేషన్ సంయుక్తంగా భారీ రోబోటిక్ ఏనుగును బహూకరించాయి. త్రిసూర్‌లోని శ్రీ భద్రకాళీ విష్ణుమాయా ఆలయానికి 'పున్నక్కపరంబిల్ మహాదేవన్' అనే రోబోటిక్ ఏనుగును అందజేసినట్లు పెటా వెల్లడించింది. మలయాళ నూతన సంవత్సరం విషు నామ సంవత్సర వేడుకల సందర్భంగా భక్తుల సమక్షంలో ఈ ఏనుగును ఆవిష్కరించారు.ఆలయంలో నిర్వహించే వేడుకల్లో ఎలాంటి హింసాత్మక ఘటనలు చోటుచేసుకోకుండా, సురక్షితంగా నిర్వహించుకోవడానికి వీలుగా దీనిని ఉపయోగించనున్నారు. కేరళ వ్యాప్తంగా వివిధ ఆలయాలకు పెటా అందించిన రోబోటిక్ ఏనుగుల్లో ఇది 14వది కావడం గమనార్హం. దేశవ్యాప్తంగా ఇప్పటి వరకు 25 రోబోటిక్ ఏనుగులను బహుమతిగా ఇచ్చినట్లు పెటా తెలిపింది.

https://epaper.velthuru.com
గురువారం16 ఏప్రిల్ 2026

# ఉపాధి హామీ చట్టానికి రూ.2.5 లక్షల కోట్లు కేటాయించాలి: నారీ ఐలయ్య డిమాండ్

నార్కట్‌పల్లి, వెలుతురు ఏప్రిల్ 15:మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టానికి రూ. రెండున్నర లక్షల కోట్లు కేటాయించి, సక్రమంగా అమలు చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి నారీ ఐలయ్య కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం నాడు నార్కట్‌పల్లి మండలంలోని ఎల్లారెడ్డిగూడెం, చెరువుగట్టు గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పేదల, కష్టజీవుల వ్యతిరేక విధానాలు అమలు చేస్తోందని విమర్శించారు. కేంద్ర బడ్జెట్‌లో ఉపాధి హామీకి నిధులు తగ్గించడం ద్వారా కూలీలకు ఉపాధి లేకుండా చేసే కుట్ర జరుగుతోందన్నారు. వ్యవసాయ కూలీలు పోరాడి సాధించుకున్న ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని, కొత్తగా తీసుకొస్తున్న చట్టాలతో ఈ పథకం బలహీనపడే ప్రమాదం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలపై 40 శాతం నిధుల భారం మోపడం వల్ల భవిష్యత్తులో ఈ పథకం కనుమరుగయ్యే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామాలను పట్టణాలలో విలీనం చేసి ఉపాధి హామీ పనులను రద్దు చేయడం దుర్మార్గ చర్య అని, పట్టణ ప్రాంతాల్లో కూడా ఈ పనులు కొనసాగించాలని డిమాండ్ చేశారు. దీని ద్వారా పట్టణ పేదలకు ఉపాధి కల్పించవచ్చని తెలిపారు. ప్రైవేటీకరణ పేరుతో ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు అప్పగించడం వల్ల నిరుద్యోగం పెరుగుతుందని, వ్యవసాయ రంగం



కూడా దెబ్బతింటోందని అన్నారు. వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్లకు అప్పగించే విధంగా చట్టాలు తీసుకొస్తున్నారని విమర్శించారు. దేశంలో కోట్లాది వ్యవసాయ కార్మికుల జీవనాధారమైన ఈ చట్టానికి ప్రతి సంవత్సరం నిధులు తగ్గించడం వల్ల గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు తగ్గుతున్నాయని చెప్పారు. దీని కారణంగా కూలీలు వలసలు వెళ్లే పరిస్థితి ఏర్పడుతోందని తెలిపారు. ఉపాధి పనుల ప్రదేశాల్లో తాగునీరు, నీడ, మెడికల్ కిట్ వంటి కనీస సౌకర్యాలు కల్పించాలని, కూలీలకు వారం వారంగా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఏప్రిల్ 21 నుంచి 25 వరకు మండల కార్యాలయాల వద్ద నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు, మే 15న జిల్లా కలెక్టర్ కార్యాలయం ముట్టడి కార్యక్రమంలో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు చెరుకు పెద్దలు, దండు నాగరాజు, దండు రవి, శ్రీను, చిక్కుల భగవంతు, నల్లా సరిత, కొండ శారద, రాగిపాని కవిత తదితరులు పాల్గొన్నారు.

## డా. ధైద నాగరాజు కీ దళితరత్న అవార్డు పురస్కారం



నార్కట్ పల్లి వెలుతురు ఏప్రిల్ 15:భారత రాజ్యాగం నిర్మాత, భారతరత్న డా . బీ ఆర్. అంబేద్కర్ 135వ.జయంతి సందర్భంగా హైదరాబాద్ రవీంద్ర భారతిలో జయంతి ఉత్సవాలు నిర్వహించిన ఎస్సీ ఎస్టీ అభివృద్ధి శాఖ మంత్రివర్యులు అడ్లూరి లక్ష్మణ్ కూమర్ జయంతి ఉత్సవాలు చేర్మెన్ దోమ్మటి సుదర్శన్ బాబు,రాష్టంలో వివిధ సేవ రంగాలలో కృషి చేసిన వారికి దళిత రత్న అవార్డు అందచేయడం జరిగింది, అందులో భాగంగా నార్కెట్ పల్లి మండలం కీ చెందిన డా ధైద నాగరాజు మనం స్వచ్చంద సంస్థ ద్వారా 500 రోజులకి పైగా నిత్యం నిరుపేదల ఆకలి తీర్చినందుకు, ఆపదలో ఉన్నవారికి రక్తం అందిచటం, మన ఓటును అమ్ముకోవద్దు ఫ్లక్ కార్డ్ ప్రదర్శనలు ఇంకా పలు రకాల సేవలు అందించినందుకు జాతి గర్వించదగ్గ సేవలు చేసినందుకు డా ధైద నాగరాజు కీ దళితరత్న అవార్డు ప్రదానం చేయడం చాలా సంతోషకరం అని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో జయంతి ఉత్సవాలు వైస్ చైర్మన్ గంట సుదర్శన్, రోజరాణి మరియు కురుపాటి జగదీష్ పాల్గొన్నారు

## అంగన్వాడీ కేంద్రంలో అన్నప్రాసన కార్యక్రమం



గుండాల ఏప్రిల్ 15(వెలుతురు):యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం సీతారాంపురం గ్రామంలో అంగన్వాడి కేంద్రంలో 8 వ పోషణ పక్వాడ కార్యక్రమంలో భాగంగా అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కాలి పద్మ వెంకన్న వార్డు సభ్యులు మలిపెద్ది సుమతి పాల్గొని అన్నప్రాసన కార్యక్రమం చేయించారు. గ్రామ సర్పంచ్ కాళి పద్మా వెంకన్న మాట్లాడుతూ ఆరు నెలలు నిండిన తర్వాత అనుబంధ ఆహారం మొదలు పెట్టాలని పిల్లలకు పౌష్టికాహారం అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్ జి వాణి, ఏఎన్ఎం రేణుక, ఆశా వర్కర్లు లావణ్య, కవిత, ఆయాలు మంజుల సుశీల, తల్లులు, గర్భిణీ స్త్రీలు బాలింతలు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన సర్పంచ్ కాళి పద్మ వెంకన్న



గుండాల ఏప్రిల్ 15 (వెల్తురు):యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం సీతారాంపురం గ్రామంలో ఐకెపి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం రోజున గ్రామ సర్పంచ్ కాలి పద్మా వెంకన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కాళీ పద్మా వెంకన్న మాట్లాడుతూ రైతులు ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల వద్దనే అమ్ముకోవాలని అన్నారు. ధాన్యాన్ని దళారులకు అమ్మి మోసపోవద్దని కోరారు. రైతులు ధాన్యాన్ని ఆరబెట్టి 17 మేటర్ వచ్చాక కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలని అన్నారు. ఏపీఎం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రతి రైతు వద్ద ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేస్తామనిఅన్నారు .ఆందోళన చెందవద్దని అన్నారు. రైతులు నాణ్యమైన వడ్లను మార్కెట్కు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీసీ వెంకటేశ్వర్లు, ఉప సర్పంచ్ మల్లెపాక నరేష్, ఏవో రామ్ సింగ్, మహిళా సంఘం అధ్యక్షురాలు కందుకూరి రేణుక, వార్డు సభ్యులు మోహన్, శేఖర్, కృష్ణ, శ్రీను, లలిత, సుమతి, లలిత, సంఘ బంధం అధ్యక్షురాలు ఆగమ్మ, వి బి కే హైమావతి, రైతులు పాల్గొన్నారు.

## కనికరం లేని కసాయి తండ్రి కూతురిని చంపి వీడియో కాల్ లో భార్యకు చూపించాడు



భువనగిరి ఏప్రిల్ 15,(వెలుతురు న్యూస్): భువనగిరి (మం) హనుమాపురం లో దారుణం రెండేళ్ల కూతురు గొంతు నులిమి చంపిన కసాయి తండ్రి శ్రీరాములు గత కొంతకాలంగా దంపతుల మధ్య వివాదాలు. భార్యపై కోపంతో కిరాతకానికి ఒడిగట్టిన శ్రీరాములు.

## డిగ్రీ కళాశాలలో ప్రధమ సంవత్సరం ప్రవేశాల కోసం దోస్త్ ఆన్లైన్ అడ్మిషన్ నోటిఫికేషన్



రామన్నపేట వెలుతురు న్యూస్ ఏప్రిల్ 15: డిగ్రీ ప్రథమ సంవత్సరం ప్రవేశాల కోసం దోస్త్ ఆన్లైన్ అడ్మిషన్ నోటిఫికేషన్ విడుదలైందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల రామన్నపేట ప్రధానాచార్యులు ఆచార్య రాహత్ ఖానం తెలిపారు. మొదటి ఫేజ్ రిజిస్ట్రేషన్ ఈనెల 15 నుండి మే 7 వరకు, వెబ్ ఆప్షన్ ఈనెల 30 నుండి వచ్చే నెల 8 వరకు చేసుకోవచ్చని అన్నారు. ఎక్కడో సుదూర ప్రాంతాల్లోని కళాశాలలో చేరకుండా స్థానికంగా ఉన్న డిగ్రీ కళాశాలకు మొదటి ప్రాధాన్యత ఇచ్చి విద్యార్థులు అడ్మిషన్లు తీసుకోవాలని అన్నారు. అన్ని అర్హతలు కలిగి అపార అనుభవం ఉన్న అధ్యాపకులు, విశాలమైన తరగతి గదులు, కంప్యూటర్ ల్యాబ్ లు, డిజిటల్ తరగతి గదులు,గ్రంథాలయం, విశాలమైన క్రీడామైదానం, ఎన్ఎస్ఎస్, ఎన్ సిసి వంటి సకల సదుపాయాలు కలిగిన కళాశాలలో తప్పకుండా చేరాలని ఆమె అన్నారు.

# విద్యుత్ ఆర్టిజన్ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి





### -దేవరకొండ డివిజన్లో 8వ రోజు ధర్నా

నల్గొండ జిల్లా వెలుతురు ఏప్రిల్ 15: విద్యుత్ ఆర్టిజెన్ కార్మికుల న్యాయమైన డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని బీసీ విద్యుత్ కార్మిక సంఘం కోరుతుంది. దేవరకొండ డివిజన్లో గత 8 రోజులుగా కొనసాగుతున్న ఆర్టిజన్ కార్మికుల సమ్మెలో బీసీ విద్యుత్ నాయకులు పాల్గొని నిరసన తెలుపుతున్నారు. ఈ సందర్భంగా సంఘము నాయకులు మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని విద్యుత్ కార్మికుల కోరుతున్నారు. సమస్యలను ఆలస్యం చేయకుండా పరిష్కరించాలని అన్నారు. ఇప్పటికే వారం రోజులుగా సమ్మె కొనసాగుతున్నప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడం శోచనీయమన్నారు. కార్మికులు ఏపీఎస్ఈబీ నిబంధనలను యథాతథంగా అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే కార్మికులతో చర్చలు జరిపి సమస్యలకు పరిష్కారం చూపాలని, లేని పక్షంలో జెఏసీ కార్మికులు పెద్ద ఎత్తున పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీసీ విద్యుత్ సంఘం దేవరకొండ అధ్యక్షులు పెద్దిశెట్టి వసంత్ కుమార్, సెక్రటరీ నాతి యాదయ్య గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ కాంచనపల్లి సైదులు, ట్రెజరర్ పాతనబోయిన నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా అరైవ్ అలైవ్ క్యాంపాల్గ్ -2006 ప్రోగ్రాం

### డి నాగరాజు, ఎస్సై రామన్నపేట

రామన్నపేట వెలుతురు న్యూస్ ఏప్రిల్ 15: రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా అరైవ్ అలైవ్ క్యాంపాల్గ్ -2026 పోగ్రామ్ ను జిల్లా ఎస్పీ ఆకాంక్ష్ యాదవ్, ఐపీఎస్ ఆదేశానుసారం రామన్నపేట మండలం లో ఉన్న కృష్ణవేణి టాలెంట్ స్కూల్ లోని విద్యార్థులు లతో సుభాష్ విగ్రహం, రామన్నపేట లో మానవహారం నిర్వహించి వారికి హెల్మెట్ , ఎబిలిటీ ట్రిపుల్ సీట్బెల్ట్ ట్రైబల్ డ్రైవింగ్, మద్యం త్రాగి వాహనాలు




నడపకూడదని వారి తల్లి తండ్రి కి తెలియజేయాలని చెప్పడం జరిగింది ఇంకా స్కూల్ పిల్లలతో "డాడీ ప్లీజ్ బై ఏ ఎలిమెంట్ ఫర్ మీ అండ్ మామ్" వ్యాస రచన రాపియడం జరిగింది. ఇట్టి కార్యక్రమం లో ఎన్. వెంకటేశ్వర్లు, సీఐ రామన్నపేట సర్కిల్, డి. నాగరాజు, ఎస్సై రామన్నపేట ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొనినారు.

# అయ్యప్ప స్వామి పుట్టినరోజు సందర్భంగా అన్నదానం



నార్కట్ పల్లి వెలుతురు ఏప్రిల్ 15:హరిహరపుత్రుడు అయ్యప్ప స్వామి పుట్టినరోజు సందర్భంగా ఘనంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పంచామృత అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులు భక్తి శ్రద్ధలతో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి అన్నప్రసాద దాతలుగా హైదరాబాద్ వాస్తవ్యులు జక్కుల నరసింహా ఉ జంగమ్మ వారి కుమారులు నవీన్ ఉ సంగీత, గణేష్ ఉ మాధవి, అలాగే గండు మచ్చ గిరి ఉ పావని, కన్నెబోయిన రమేష్ ఉ సునీత దంపతులు ముందుకు వచ్చి సేవలందించారు. వారు అయ్యప్ప స్వామికి భక్తిశ్రద్ధలతో అభిషేకాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో హరిహరపుత్ర అయ్యప్ప స్వామి దేవస్థానం చైర్మన్ బెల్లి వెంకన్న, పుల్లెంల బిక్షం, రాపర్తి మోహన్, గడ్డం శివరాం, పుల్లెంల శ్రీనివాస్ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## జహీరాబాద్ ప్రజా సమస్యలపై

# కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే మాణిక్ రావు

**తాగునీటి సమస్యలు, రహదారులు, రైతుల సమస్యలు సహా పలు అంశాలపై వెంటనే చర్యలు కోరిన ఎమ్మెల్యే...**



**జహీరాబాద్ వెలుతురు, ఏప్రిల్ 15:** సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న పలు కీలక సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎమ్మెల్యే కొనింటి మాణిక్ రావు బుధవారం జిల్లా కలెక్టర్ ప్రావీణ్యను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ప్రజలకు అత్యవసరంగా అవసరమైన సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.
ముఖ్యంగా మిషన్ భగీరథ నీటి సరఫరా సక్రమంగా లేకపోవడంతో నియోజకవర్గంలో తాగునీటి సమస్య తీవ్రంగా మారిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని తక్షణమే బోర్లను మంజూరు చేసి ప్రజలకు తాగునీటి సరఫరా అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. అలాగే నియోజకవర్గంలో అనేక గ్రామాల్లో రహదారులు దెబ్బతిన్నాయని, పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. రైతులు ఎదుర్కొంటున్న పంట సమస్యలు, మార్కెట్ సమస్యలను పరిష్కరించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. మిగిలిపోయిన శనగలను ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని సూచించారు. ఝరాసంఘం మండల కేంద్రంలో ప్రధాన రహదారి విస్తరణ పనులు కొనసాగుతున్న నేపథ్యంలో విద్యుత్ స్తంభాల మార్పిడి (షిఫ్టింగ్) కోసం అవసరమైన నిధులను కేటాయించాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. నిరుపేదలైన అర్హులైన లబ్ధిదారులకు నిష్పక్షపాతంగా ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయాలని కోరారు.
అదేవిధంగా మైనారిటీ వర్గాల అర్హులైన లబ్ధిదారులకు కుట్టు మిషన్లను ఎటువంటి ఆలస్యం లేకుండా పంపిణీ చేయాలని తెలిపారు. ముఖ్యంగా గతంలో విధులు నిర్వర్తించిన మాజీ సర్పంచ్‌లకు సంబంధించిన పెండింగ్ బిల్లులను తక్షణమే విడుదల చేయాలని కలెక్టర్‌ను కోరారు. ఈ విషయాలపై స్పందించిన జిల్లా కలెక్టర్ ప్రావీణ్య సంబంధిత అధికారులతో సమీక్షించి, సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా పరిపాలన అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో వారితోపాటు జహీరాబాద్ మండల పార్టీ అధ్యక్షులు తట్టు నారాయణ, ఝరాసంఘం మండల పార్టీ అధ్యక్షులు వెంకటేశం, మొగుడంపల్లి మండల పార్టీ అధ్యక్షులు సంజీవ్ రెడ్డి పాల్గొన్నారు.

# ఝరాసంగం మండలంలో భూసార పరిరక్షణపై అవగాహన కార్యక్రమం



**మట్టి పరీక్షల ప్రాముఖ్యతపై నిపుణుల వివరణ....**

**రైతులకు ప్రాయోగిక శిక్షణ...**



**జహీరాబాద్ వెలుతురు ఏప్రిల్ 15:** సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండలం బొపన్పల్లి, కక్కెరవాడ మరియు ఝరాసంగం గ్రామాలలో డి.డి.యస్ఉకేవీకే ఆధ్వర్యంలో భూమి సుపోషణ, సంరక్షణ మరియు సమతుల్య ఎరువుల యాజమాన్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైతులకు మట్టి ఆరోగ్యం, ఎరువుల వినియోగం, పంటల నిర్వహణపై నిపుణులు విస్తృతంగా మార్గదర్శనం చేశారు. ఈ సందర్భంగా డి.డి.యస్ఉకేవీకే భూసార పరీక్ష నిపుణులు ఈ. స్వామి మాట్లాడుతూ మట్టి పరీక్షల ప్రాముఖ్యతను వివరించారు. పొలాల నుండి మట్టి నమూనాలను సరైన విధంగా ఎలా సేకరించాలి, ఏ సమయంలో తీసుకోవాలి వంటి అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. మట్టి పరీక్షల ద్వారా భూమిలోని పోషక విలువలు, ఉదజని సూచిక (జూ౦), నీటిలో కరిగే లవణాల శాతం, సేంద్రియ కార్బన్ స్థాయి వంటి అంశాలను తెలుసుకోవచ్చని తెలిపారు. ఈ వివరాల ఆధారంగా సరైన వ్యవసాయ యాజమాన్య చర్యలు తీసుకుంటే మంచి దిగుబడులు సాధ్యమవుతాయని చెప్పారు. అనంతరం రైతులతో కలిసి పొలం నుండి మట్టి నమూనాలను సేకరించే విధానాన్ని ప్రాయోగికంగా ప్రదర్శించారు.
అనంతరం శాస్త్రవేత్త (పంటల యాజమాన్యం) వి. రమేష్ మాట్లాడుతూ ప్రతి రైతు తప్పనిసరిగా మట్టి పరీక్షలు చేయించుకుని, ఆ ఫలితాల ఆధారంగా ఎరువులను వినియోగించాలని సూచించారు. దీని ద్వారా రసాయన ఎరువుల ఖర్చు తగ్గించుకోవచ్చని తెలిపారు. ప్రతి సంవత్సరం ఒకే పంటను పండించకుండా, కనీసం రెండు సంవత్సరాలకు ఒకసారి పంట మార్పిడి (క్రాప్ రొటేషన్) పాటించాలని సూచించారు. అదేవిధంగా అంతర పంటలు సాగు చేయడం ద్వారా భూమిలో పోషకాలు సమతుల్యంగా వినియోగించబడతాయని, దిగుబడులు పెరుగుతాయని వివరించారు. సేంద్రియ వ్యవసాయంపై దృష్టి పెట్టాలని, వర్మికంపోస్ట్, ఘనజీవామృతం వంటి సేంద్రియ ఎరువులను తయారు చేసి వినియోగించడం ద్వారా భూమి ఆరోగ్యం మెరుగుపడుతుందని, దీని ఫలితంగా పంటల దిగుబడులు పెరుగుతాయని తెలిపారు.
అనంతరం ముందుగా సేకరించిన మట్టి నమూనాల భూసార పరీక్షల ఫలితాలను రైతులకు పంపిణీ చేసి, వాటి విశ్లేషణను వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచులు, డి.డి.యస్ సూపర్‌వైజర్ సంపత్, నర్సిములు, మహిళా రైతులు మరియు ఇతర రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మహిళా సాధికారతకు చారిత్రాత్మక విజయఘట్టం - 33% రిజర్వేషన్ బిల్లుకు ఘన స్వాగతం

**మహిళల ఉత్సాహభరిత బైక్ ర్యాలీని జెండా ఊపి ఘనంగా ప్రారంభించిన బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రామచంద్ర రావు**

**హైదరాబాద్ వెలుతురు ఏప్రిల్ 15:** దేశంలో మహిళల సాధికారతను మరింత బలపరిచే దిశగా కేంద్ర ప్రభుత్వం తీసుకున్న 33% రిజర్వేషన్ బిల్లు అపూర్వమైన చారిత్రాత్మక నిర్ణయమని బీజేపీ మాజీ కౌన్సిలర్ మరియు సంగారెడ్డి జిల్లా ఐటీ ఇంచార్జ్ మాధురి ఆనంద్ పేర్కొన్నారు. స్వాతంత్ర్యం అనంతరం 77 సంవత్సరాల తర్వాత మహిళలకు రాజకీయంగా సముచిత ప్రాతినిధ్యం కల్పించడం దేశ ప్రజాస్వామ్యానికి మరింత బలాన్ని చేకూర్చుతుందని తెలిపారు.



హైదరాబాద్‌లోని కేఎంఐటీ ప్రాంగణంలో చారిత్రాత్మక ‘నారీ శక్తి వందన్ అధినియం’కు మద్దతుగా నిర్వహించిన మహిళల ఉత్సాహభరిత బైక్ ర్యాలీని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు శ్రీ రామచంద్ర రావు గారు జెండా ఊపి ఘనంగా ప్రారంభించారు.

అనంతరం బీజేపీ మహిళా మోర్చాఅధ్యక్షురాలు డాక్టర్ శిల్పారెడ్డి గారి ఆధ్వర్యంలో నిర్వహించిన స్కూటీ ర్యాలీ కేశవ మెమోరియల్ లా కాలేజ్ నుండి అసెంబ్లీ వరకు ఉత్సాహంగా కొనసాగింది. ఈ ర్యాలీ మహిళల ఐక్యత, ఆత్మవిశ్వాసం, శక్తిని ప్రతిబింబించింది. ఈ చారిత్రాత్మక బిల్లును అమలు చేసిన భారత ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారికి మహిళా లోకం హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తోంది. మహిళలకు సమాన అవకాశాలు కల్పిస్తూ, వారి నాయకత్వాన్ని పెంపొందించే ఈ నిర్ణయం దేశ భవిష్యత్తును మరింత శక్తివంతంగా తీర్చిదిద్దుతుంది. మహిళలు ప్రతి రంగంలో ముందంజలో నిలిచి దేశ నిర్మాణంలో కీలక పాత్ర పోషించాలని పిలుపునిస్తూ, మహిళల అభ్యున్నతికి బీజేపీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని మాధురి గారు స్పష్టం చేశారు.

# కోహీర్ మండలంలో ఉద్యమ్ ఆధార్ నమోదు పై మహిళలకు శిక్షణ కార్యక్రమం

**స్వయం సహాయక సంఘాల ఆర్థికాభివృద్ధికి ఆన్‌లైన్ మార్కెటింగ్‌పై దృష్టి పెట్టాలి ...**

**నిపుణుల సూచనలు**



**జహీరాబాద్ వెలుతురు ఏప్రిల్ 15:** సంగారెడ్డి జిల్లా కోహీర్ మండల మహిళ సమాఖ్య ఆధ్వర్యంలో ఈరోజు ఉద్యమ్ ఆధార్ నమోదు (ఖఎఖఎ౼ాఖుఎష్ఖుఖుతీ =వస్త్రఅర్తీఫ్అశీఅ) పై అవగాహన మరియు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా స్వయం సహాయక సంఘాల (ాూ+౦) మహిళలకు వ్యాపార అవకాశాలు, ఆర్థికాభివృద్ధి మార్గాలు, ప్రభుత్వ పథకాల వినియోగంపై విస్తృతంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నిపుణులు మాట్లాడుతూ, చిన్న వ్యాపారాలు నిర్వహిస్తున్న మహిళలు తప్పనిసరిగా ఉద్యమ్ ఆధార్ నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ నమోదు ద్వారా ప్రభుత్వ ప్రోత్సాహకాలు, రుణ సదుపాయాలు, ఇతర ప్రయోజనాలు పొందవచ్చని వివరించారు. గ్రామ స్థాయిలో తయారు చేసే స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులను విస్తృతంగా మార్కెట్‌లో ప్రవేశపెట్టి ఆదాయం పెంచుకోవాలని తెలిపారు. ముఖ్యంగా ఆన్‌లైన్ వేదికలను వినియోగించుకొని మార్కెటింగ్‌ను విస్తరించుకోవాలని, సోషల్ మీడియా, డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా విక్రయాలను పెంచుకోవచ్చని వివరించారు. అలాగే వివిధ రంగాల్లో శిక్షణలు పొందడం ద్వారా వ్యాపార నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలని సూచించారు. ప్రతి మహిళా కుటుంబం ఆర్థికంగా బలోపేతం కావాలంటే అందుబాటులో ఉన్న వనరులను సమర్థంగా వినియోగించుకోవాలని, స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని నిపుణులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిఎంలు, సీసీలు, వీఓఏలు, గ్రామ సంఘం అధ్యక్షులు మరియు మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు. కార్యక్రమం ద్వారా మహిళల్లో వ్యాపారాభిలాష పెంపొందించి, ఆర్థిక స్వావలంబన సాధించేందుకు దోహదపడుతుందని నిర్వాహకులు తెలిపారు.

## పార్లమెంట్‌లో ‘నారీ శక్తి బంధన్’ బిల్లు ఉ మహిళలకు 33% రిజర్వేషన్ సాధ్యం

**ఈనెల 16న బిల్లు ప్రవేశపెట్టనున్న ప్రధాని మోదీ: బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నౌబాద్ జగన్నాథ్....**



**జహీరాబాద్ వెలుతురు ఏప్రిల్ 15:** పార్లమెంట్‌లో ‘నారీ శక్తి బంధన్’ చట్టం ద్వారా మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించే బిల్లును ఈనెల 16వ తేదీన ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రవేశపెట్టనున్నారని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నౌబాద్ జగన్నాథ్ తెలిపారు. ఈ బిల్లు కోసం మహిళలు ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఈరోజు జహీరాబాద్ అసెంబ్లీ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఈ బిల్లు అమలులోకి వస్తే దేశవ్యాప్తంగా మహిళలకు 33 శాతం రిజర్వేషన్ లభిస్తుందని చెప్పారు. పార్లమెంట్‌లో ప్రత్యేక సమావేశాలను ఈనెల 16, 17, 18 తేదీల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. మహిళా రిజర్వేషన్ బిల్లును గతంలో కాంగ్రెస్ సహా అనేక రాజకీయ పార్టీలు వ్యతిరేకించాయని ఆయన విమర్శించారు. గతంలో పలువురు నాయకులు ఈ బిల్లును తీసుకురావడానికి ప్రయత్నించినప్పటికీ అమలు చేయలేకపోయారని, అయితే ప్రధాని మోదీ నాయకత్వంలో ఈ బిల్లు సాకారం కానుందని విశ్వాసం వ్యక్తం చేశారు. కేవలం చట్టం చేయడమే కాకుండా, అమలు చేయడంపైనా కేంద్ర ప్రభుత్వం దృష్టి పెట్టిందని తెలిపారు. ఈ బిల్లుకు పార్టీలకతీతంగా అందరూ మద్దతు తెలపాలని కోరారు. 2029 ఎన్నికల నాటికి మహిళలకు 33 శాతం రిజర్వేషన్ అమలులోకి రావాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇది సాధారణ చట్టం కాదని, కోట్లాది మహిళల ఆశలు, ఆకాంక్షలకు ప్రతీక అని ఆయన పేర్కొన్నారు. ఈ చట్టానికి ఆమోదం లభిస్తే దేశంలో మహిళా సాధికారతకు కొత్త దిశలో ముందడుగు పడుతుందని అన్నారు. ప్రస్తుతం తెలంగాణ నుంచి పార్లమెంట్‌లో ఇద్దరు మహిళలు మాత్రమే ప్రాతినిధ్యం వహిస్తున్నారని, ఈ బిల్లు అమలైతే ఆ సంఖ్య పెరుగుతుందని తెలిపారు. డిలిమిటేషన్ పూర్తయితే తెలంగాణ నుంచి 9 మంది మహిళలు పార్లమెంట్‌లోకి ప్రవేశించే అవకాశం ఉందని పేర్కొన్నారు. అలాగే తెలంగాణలో అసెంబ్లీ స్థానాలు 180 వరకు పెరిగే అవకాశం ఉందని, అందులో సుమారు 60 మంది మహిళలు ఎమ్మెల్యేలుగా ఉండే అవకాశం ఉందని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ వర్గాలకు కూడా ఈ బిల్లుతో మంచి అవకాశాలు లభిస్తాయని వివరించారు. ఈ రిజర్వేషన్ తాత్కాలికం కాదని, వరుసగా మూడు టర్మ్‌ల వరకు అమలులో ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.

## నిమ్జ్ భూముల స్వాధీనం వేగవంతం చేయాలి

**45 రోజుల్లో పూర్తి చేయాలి: కలెక్టర్ పి. ప్రావీణ్య....**






**జహీరాబాద్ వెలుతురు ఏప్రిల్ 15:** సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పారిశ్రామిక వాడలోని జాతీయ పెట్టుబడి మరియు తయారీ మండలి (నిమ్జ్) పరిధిలో మొదటి దశలో సేకరించిన 3245 ఎకరాల భూమిని 45 రోజులలో పూర్తిస్థాయిలో ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ భూమిని కేంద్ర ప్రభుత్వ సంస్థ నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు త్వరితగతిన అప్పగించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు.
బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో రెవెన్యూ, నిమ్జ్, టీజీఐఐసీ అధికారులు, ఏఈఓలు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, నిమ్జ్ ఫేజ్ఉ1 పరిధిలో మిగిలి ఉన్న ఎల్గోయి, సిద్ధాపూర్, చిలేపల్లి, ముంగి, రుక్మాపూర్, హద్నూర్ గ్రామాల్లో భూముల స్వాధీన ప్రక్రియను వేగవంతం చేయాలని తెలిపారు. భూముల సర్వే కోసం ప్రత్యేకంగా ఆరు బృందాలను ఏర్పాటు చేయాలని, ప్రతి బృందంలో రెవెన్యూ, పోలీస్, వ్యవసాయ శాఖ అధికారులు, గ్రామపంచాయతీ సిబ్బంది ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతిరోజూ పనుల పురోగతిని సమీక్షిస్తూ సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు. ఫెన్సింగ్ క్లియరెన్స్, రోడ్ల విస్తరణ పనులను సమగ్రంగా చేపట్టాలని, ప్రస్తుతం సాగులో ఉన్న పంటల కోత అనంతరం భూములను స్వాధీనం చేసుకోవాలని పేర్కొన్నారు. అనుమతి లేకుండా ఫెన్సింగ్ తొలగించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. అలాగే చెట్లు, పొదలు, రాళ్లు వంటి అవరోధాలను తొలగించి భూమిని సమతలీకరణ చేసే పనులను తక్షణమే ప్రారంభించాలని, రోడ్ల లొకేషన్‌ను ఖరారు చేసి విస్తరణ పనులను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ మాధురి, టీజీఐఐసీ జోనల్ మేనేజర్ విట్టల్, జహీరాబాద్ ఆర్డీఓ దేవుజా, డీఎస్పీ సైదులు నాయక్, నిమ్జ్ డిప్యూటీ తహసీల్దార్ ఆనంద్ కుమార్, వ్యవసాయ శాఖ ఎక్స్టెన్షన్ అధికారులు, పోలీస్ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## హుగ్గెల్లి గ్రామంలో ఘనంగా ఉచిత కంటి వైద్య శిబిరం

**వైద్య శిబిరాన్ని ప్రారంభించిన గ్రామ సర్పంచ్ పట్లోళ్ళ విమల శ్రీనివాస్‌రెడ్డి....**



**జహీరాబాద్ వెలుతురు ఏప్రిల్ 15:** సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండల పరిధిలోని హుగ్గెల్లి గ్రామంలో బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరం ఘనంగా నిర్వహించబడింది. ప్రముఖ మెగూర్ ఆసుపత్రి వారి సహకారంతో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని గ్రామ సర్పంచ్ పట్లోళ్ళ విమల శ్రీనివాస్‌రెడ్డి రిబ్బన్ కట్ చేసి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ విమల శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామ ప్రజల ఆరోగ్యాన్ని కాపాడటం తమ ప్రధాన బాధ్యతగా భావిస్తున్నామని తెలిపారు. ముఖ్యంగా కంటి సంబంధిత సమస్యలతో బాధపడుతున్న వారికి గ్రామంలోనే నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ప్రజలు దూర ప్రాంతాలకు వెళ్లకుండా ఇక్కడే పరీక్షలు చేయించుకొని చికిత్స పొందాలని సూచించారు. శిబిరంలో వైద్యులు గ్రామస్థులకు కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచిత మందులు పంపిణీ చేశారు. కంటి ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తూ వైద్యులు సూచనలు ఇచ్చారు. పెద్ద సంఖ్యలో గ్రామ ప్రజలు శిబిరానికి హాజరై సేవలను వినియోగించుకున్నారు. గ్రామంలో ఉచితంగా కంటి వైద్య శిబిరం నిర్వహించడంపై స్థానిక ప్రజలు సర్పంచ్ పట్లోళ్ళ విమల శ్రీనివాస్‌రెడ్డి సేవలను ప్రశంసించారు. ప్రజల ఆరోగ్యంపై ఆమె చూపుతున్న శ్రద్ధ అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్‌రెడ్డి, వార్డు సభ్యులు నరేష్, రాసమ్మ, నాయకులు నర్సింహులు, పాండురంగా రెడ్డి, రాములు, సిద్దారెడ్డి, పాండు ముదిరాజ్, మెగూర్ ఆసుపత్రి వైద్య బృందం, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# నారీశక్తి తో నవభారతాన్ని నిర్మిస్తున్న మోదీ ప్రభుత్వం...

### బిజెపి మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు చొప్పరి జయశ్రీ



**కరీంనగర్ వెలుతురు ఏప్రిల్ 15:** దశాబ్దాల నిరీక్షణకు స్వస్తి పలుకుతూ , నారీ శక్తివందన్ అధినియం ద్వారా ఆడబిడ్డలకు మోదీ అపురూప కానుక అందించి మోదీ ప్రభుత్వం నవ భారతాన్ని నిర్మిస్తుందని బిజెపి మహిళా మోర్చా అధ్యక్షురాలు చొప్పరి జయశ్రీ అన్నారు. ఏప్రిల్ 16 న పార్లమెంట్ ప్రత్యేక సమావేశంలో చట్ట సభల్లో మహిళలకు రిజర్వేషన్ కల్పించే నారీ శక్తి వందన్ అధినియం బిల్లును ప్రవేశపెడుతున్న శుభ సందర్భాన్ని పురస్కరించుకొని బిజెపి మహిళా మోర్చా జిల్లా శాఖ ఆధ్వర్యంలో బుధవారం రోజున కరీంనగర్లోనీ ఎస్ఆర్ఆర్ కళాశాల నుండి పట్టణంలోని పలు ప్రాంతాల మీదుగా మార్క్ ఫెడ్ వరకు స్కూటీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన జిల్లా అధ్యక్షులుగంగాడి కృష్ణారెడ్డి , నగర మేయర్ కోలగని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు జెండా ఊపి వాహన ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా చొప్పరి జయశ్రీ మాట్లాడుతూ మహిళలకు చట్టసభలలో 33 శాతం రిజర్వేషన్ కల నెరవేరే సమయం వచ్చిందన్నారు. దశాబ్దాలు దేశాన్ని ఏలిన ఏ పార్టీ కూడా మహిళల సంక్షేమం , అభివృద్ధి కోసం ఆలోచన చేయలేదన్నారు. కేంద్రంలో అధికారంలోకి వచ్చిన మోడీ ప్రభుత్వం మహిళల సంక్షేమం అభివృద్ధి కోసం కట్టుబడి పనిచేస్తుందని తెలిపారు. అలాగే మహిళలకు చట్టసభల్లో ప్రాతినిధ్యం కల్పించడానికి, 33 శాతం రిజర్వేషన్లు అందించే చారిత్రక కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. చారిత్రాక నారి శక్తి వందన్ అధినియం బిల్లుతో మహిళలకు దేశ ప్రధాని పెద్ద గిఫ్ట్ ఇవ్వబోతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ దేశ శిల్ప, నిర్మల రెడ్డి, కోలగని స్వర్ణ, వరాల జ్యోతి, సాధవేని లావణ్య, కర్రె పద్మ, శ్వేత , ప్రభావతి, గాజిరమ, పొన్నం లక్ష్మి, నాంపల్లి రేణుక, పెద్దపల్లి శ్రీలేఖ, ఎన్నం లక్ష్మి, సరస్వతి, సుమ రమణారెడ్డి,సాయిని మల్లేశం, గుజ్జ శ్రీనివాసరావు, శశిధర్, బీజేవైఎం సంపత్, గుగ్గిళ్ళ రమేష్, సత్యనారాయణ రెడ్డి, సోమిరెడ్డి వేణు,, సునీత, స్వప్న, లావణ్య రెడ్డి, చైతన్య,, నరేడ్ల ప్రవీణ్ చంద్ర,, బండారి వేణు, చంద్రిక, వివిధ డివిజన్ మహిళలు పాల్గొన్నారు

# సిసి రోడ్డు పనులు ప్రారంభించిన సర్పంచ్ సంజీవ్,మాజీ జెడ్పిటిసి తీగల తిరుమల గౌడ్



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి (వెలుతురు) ఏప్రిల్ 15** కామారెడ్డి జిల్లా దోమకొండ మండలంలోని గొట్టుముక్కల గ్రామంలో బుధవారం సిసి రోడ్డు పనులను గ్రామ సర్పంచ్ నత్తి సంజు మాజీ జెడ్పిటిసి సభ్యుడు తీగల తిరుమల గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో ఎన్ఆర్ ఈజీఎస్ నిధులు 20 లక్షల రూపాయలు మంజూరైనట్లు తెలిపారు. అట్టి నిధుల ద్వారా గ్రామంలో సిసి రోడ్డు పనులను ప్రారంభించడం జరిగిందన్నారు ఈ సందర్భంగా ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ సహకారం తో నిధులు మంజూరైనట్లు తెలిపారు.కార్యక్రమంలో ఎంపీఓ రవికుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అనంతరెడ్డి దోమకొండ పట్టణ అధ్యక్షుడు సీతారాం మధు, గొట్టిముక్కల గ్రామ అధ్యక్షుడు సంతోష్ రెడ్డి, పాలకవర్గ సభ్యులు,, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి ఫస్ట్ మార్కులు కరీంనగర్ లోని కోట రెజోనెన్స్ విద్యార్థులకు రావడం గర్వకారణం

### విద్యార్థుల అభినందన సభలో చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

### కరీంనగర్లో కోట రెజోనెన్స్ జూనియర్ కళాశాల బ్రాండ్ ఇమేజ్ గా మారింది

### సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి




**కరీంనగర్ వెలుతురు ఏప్రిల్ 15:** కరీంనగర్ లోని కోట ఇన్స్టిట్యూట్ వారి రెజోనెన్స్ జూనియర్ కాలేజ్ కరీంనగర్ కు ఇంటర్ ఫలితాల ద్వారా రాష్ట్ర స్థాయి గుర్తింపు తెచ్చి పెట్టిందని ఇది కరీంనగర్ కు గర్వకారణమని కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు కరీంనగర్ లోని రేకుర్తి లో గల కెపిఎస్ హైస్కూల్లో కోట రెజోనెన్స్ జూనియర్ కాలేజ్ విద్యార్థులకు రాష్ట్రస్థాయి ఫస్ట్ మార్కులు వచ్చిన సందర్భంగా బుధవారం ఏర్పాటుచేసిన అభినందన సభకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు కరీంనగర్లో అనతి కాలంలోనే కార్పొరేట్ కళాశాలలను తలదన్నేలా గ్రామీణ ప్రాంతం నుండి మట్టిలో మాణిక్యాలను వెలికి తీయాలనె ఉద్దేశంతో ఉత్తమ పౌరులుగా తయారు చేయాలనే సంకల్పంతో కోట విద్యాసంస్థలను స్థాపించిన చైర్మన్ డాక్టర్ డి అంజిరెడ్డిని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు ప్రపంచంలో చదువును మించిన ఆయుధం లేదని కష్టపడి చదువుకున్న వారే ఉన్నత స్థానాలలో ఉన్నారని కోట విద్యాసంస్థలు భవిష్యత్తులో మరిన్ని అద్భుత విజయాలు సాధించాలని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆకాంక్షించారు మరో అతిథి సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ సేవ చేయాలనే సంకల్పంతో ముందుకు వచ్చిన అంజిరెడ్డి కరీంనగర్ కు రాష్ట్రస్థాయిలో కీర్తి తీసుకురావడం మనందరికీ గర్వకారణం అన్నారు ఫలితాలు రావడానికి ఇంకా టైం పడతది అనుకున్నా ఒక యజ్ఞంలా కృషిచేసి తొందరలోనే ఫలితం వచ్చేలా కృషిచేసిన డాక్టర్ డి అంజిరెడ్డి ఇదే స్ఫూర్తితో రాష్ట్రస్థాయి పరంపర కొనసాగించాలని కోరారు కోట ఇన్స్టిట్యూట్ అనేది ఇప్పుడు కరీంనగర్లో బ్రాండ్ ఇమేజ్ గా మారిందని కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు రాబోయే రోజుల్లో నెంబర్ వన్ గా కరీంనగర్ను తీర్చిదిద్దాలనే దానికి కోట విద్యాసంస్థలు బాటలు వేశాయని అన్నారు మరో అతిథి ట్రస్మ అధ్యక్షులు యాదగిరి శేఖర్ రావు మాట్లాడుతూ కోట విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ డి అంజిరెడ్డి యొక్క క్రమశిక్షణ అతనిని బ్రాండ్ ఇమేజ్కు దగ్గరగా తీసుకు వెళ్లిందని అన్నారు కోట విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ డి అంజిరెడ్డి మాట్లాడుతూ ఇక్కడి విద్యార్థులు ఎక్కడికో వెళ్లకుండా స్మార్ట్ క్లాస్ విద్యా విధానం ద్వారా స్థానికంగానే మంచి విద్య అందించాలనే ఉద్దేశంతో కోట విద్యాసంస్థలను స్థాపించి తొలి ప్రయత్నం లోనే రాష్ట్రస్థాయి మార్కులు సాధించడం గర్వకారణంగా ఉందని అన్నారు విద్యార్థులు వారి తల్లిదండ్రులు అధ్యాపక బృందం ఇచ్చిన ప్రోత్సాహంతో భవిష్యత్తులో మరిన్ని సంచలనాలు నమోదు చేస్తామని డాక్టర్ డి అంజిరెడ్డి అన్నారు రాష్ట్రస్థాయిలో ఫస్ట్ మార్క్ సాధించిన ప్రథమ సంవత్సరం ఎంపీసీలో గాలి సౌమ్యశ్రీ 469, ద్వితీయ సంవత్సరం కే సహన శ్రీ 995 , ద్వితీయ సంవత్సరం బైపీసీలోజి రోషిని 993 , బైపిసి ప్రథమ సంవత్సరంలో పి శరణ్య438 లను చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి ట్రస్మా అధ్యక్షులు యాదగిరి శేఖర్ రావు లు అందించి పూల గుచ్చం అందించి శాలువాతో ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమంలో కోట విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ డి అంజిరెడ్డి ప్రిన్సిపాల్ అధ్యాపక బృందం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# టి పి సి సి స్టేట్ జనరల్ సెక్రటరీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన గౌడ సంఘం సభ్యులు



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి (వెలుతురు) ఏప్రిల్ 15** బుధవారం నాడు కామారెడ్డి పట్టణ కేంద్రంలోని టీపీసీసీ స్టేట్ జనరల్ సెక్రెటరీ గడ్డం చంద్రశేఖర్ రెడ్డి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సన్మానం చేసి వేల్పుగొండ,సింగరాయపల్లి గౌడ సంఘం సభ్యులు,మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పట్ల ఆకర్షితులై బీజేపీ, బిఆర్ఎస్,పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. రాబోయే ఎంపీటీసీ, జడ్పిటిసి,ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగరవేస్తామని ధీమా వ్యక్తం చేశారు.బీజేపీ పార్టీ యువకులు,రేవంత్ రెడ్డి గారి పాలన బాగుందని అది చూసి మేం పార్టీలో జాయిన్ అవుతున్నామని తెలిపారు,టిపీసీసీ స్టేట్ జనరల్ సెక్రెటరీ గడ్డం చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ .రాబోయే ఎంపిటిసి, జడ్పిటిసి ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలుపించుకోనేలా కృషి చేయాలనీ కోరారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుక వెళ్లాలని అకాంక్షించారు. కాంగ్రెస్ పథకాలు, అభివృద్ధి పనులు.ఈ కార్యక్రమంలో, రమేష్ గౌడ్, శంకర్ గౌడ్, వెంకట్ గౌడ్, రాజా గౌడ్, శ్రీనివాస్ గౌడ్, రమా స్వామి గౌడ్, అంజా గౌడ్, నవీన్ గౌడ్, చరణ్ గౌడ్, కాంగ్రెస్ కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

# పేద ప్రజలకు సేవలందించడమే ఆలయ ఫౌండేషన్ లక్ష్యం...!

### ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఫౌండేషన్ సభ్యులు తీట్ల రమేష్.



**కరీంనగర్ వెలుతురు ఏప్రిల్ 15:** పేద ప్రజలకు అవసరమైన విద్య, వైద్య సదుపాయాలకు సంబందించిన సేవలందించడమే ఐఏఎస్ అధికారి పరికిపండ్ల నరహరి మార్గదర్శనం లో నడుస్తున్న ఆలయ ఫౌండేషన్ లక్ష్యమని ఉమ్మడి కరీంనగర్ జిల్లా సభ్యులు తీట్ల రమేష్ బాబు పేర్కొన్నారు.తిమ్మాపూర్ మండలం మొగిలిపాలెం గ్రామానికి చెందిన నక్క మొండయ్య భార్య లక్ష్మి కి గతంలో అనారోగ్యం వల్ల శస్త్ర చికిత్స ద్వారా మోకాలు పై వరకు తొలగించారు. ఆలయ ఫౌండేషన్ సిఈఓ కీర్తి నాగార్జున ద్వారా హైదరాబాద్ కు వెళ్లిన లక్ష్మికి ఇటీవల కృత్రిమ కాలు అమర్చడం జరిగింది.బుధవారం మొగిలిపాలెం వచ్చిన సందర్బంగా రమేష్ బాబు మాట్లాడుతూ ఫౌండేషన్ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కంటి పరీక్షలు, శస్త్ర చికిత్సల కోసం నరహరి బసంత్ నగర్ లో పెద్ద ఆసుపత్రి కట్టించినట్లు తెలిపారు. ఉన్నత చదువులతో పాటుగా ఉపాధి కల్పన లో పెద్ద, పెద్ద కార్పొరేటు కంపెనీ ల ద్వారా ఉద్యోగ అవకాశాలకోసం క్యాంప్ లు కూడా ఫౌండేషన్ ద్వారా ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.కృత్రిమ కాలు అమర్చడం కోసంభాధితుల పక్షాన ఫౌండేషన్ ను సంప్రదించిన మాజీ వైస్ ఎంపిపి తుమ్మనపల్లి శ్రీనివాసరావ్ మరియు న్యాయవాది బీజేపీ మాజీ మండల అధ్యక్షులు సుగుర్తి జగదీశ్వరాచారి లకు ధన్యవాదములు తెలిపారు. సర్పంచ్ తాట్ల తిరుపతి, కాంగ్రెస్ మాజీ మండల అధ్యక్షులు మోరపల్లి రమణారెడ్డి,వార్డు సభ్యులు చెన్నబోయిన రవి,పాశం రాఘవరెడ్డి, ఎల్కపల్లి స్వామి, జక్కుల శ్రీనివాస్, జనార్ధన్ రావు,రవికుమార్, వరుణ్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# అక్షర పాలిసెట్ కోచింగ్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు

### పాలిటెక్నిక్ కోర్సులతో ఎన్నో ఉద్యోగ అవకాశాలు

### పరీక్ష విధానాన్ని తెలియజేసిన ప్రముఖ గణిత శాస్త్ర అధ్యాపకుడు జాలిగామ శ్రీకాంత్





**కామారెడ్డి జిల్లా ప్రతినిధి (వెలుతురు) ఏప్రిల్ 15** కామారెడ్డి జిల్లా కేంద్రంలోని విజన్ జూనియర్ కళాశాలలో పదవ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులకు అక్షర పాలిటెక్నిక్ కోచింగ్ సెంటర్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సును,పాలీసెట్ నమూనా పరీక్ష ను నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమానికి విచ్చేసిన ప్రముఖ గణిత శాస్త్ర అధ్యాపకులు జాలిగామ శ్రీకాంత్ మాట్లాడుతూ పాలిటెక్నిక్ కోర్సులతో ఎక్కువగా ఉద్యోగ అవకాశాలు ప్రభుత్వ ప్రైవేటు రంగంలో ఉన్నాయని,ఈ విద్యా సంవత్సరంలో కొత్త కోర్సులను కూడా ప్రారంభించడం జరుగుతుందని రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పోటీ పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని విద్యార్థులు దానికి అనుగుణమైన ప్రణాళికలను రూపొందించుకొని ర్యాంకులను సాధించాలని విద్యార్థులకు సూచించారు. అక్షర పాలిటెక్నిక్ కోచింగ్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ బాలు మాట్లాడుతూ ప్రస్తుతం పాలిటెక్నిక్ ఎంట్రెన్స్ లో ర్యాంకులు సాధించడానికి కావాల్సిన శిక్షణను అందజేయడం జరుగుతుందని,అనుభవజ్ఞులైన అధ్యాపక బృందం విద్యార్థులకు వారి యొక్క సూచనలను సలహాలను అందజేస్తారని ఈ అవకాశాన్ని కామారెడ్డి జిల్లా విద్యార్థులు అందరూ ఉపయోగించుకోవాలని అన్నారు మరిన్ని వివరాలకు 9492874006 నెంబర్ కి సంప్రదించాలని అన్నారు.

# ట్రంప్ ఆంక్షలు ముగియడానికి ముందు భారత్‌కు పెద్ద ఎత్తున ఇరాన్ చమురు

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్న తరుణంలో, ఇరాన్ నుంచి భారత్‌కు దాదాపు 4 మిలియన్ బ్యారెళ్ల ముడి చమురు వచ్చింది. సుమారు ఏడేళ్ల తర్వాత ఇరాన్ నుంచి భారత్ చమురును కొనుగోలు చేస్తోంది. యుద్ధం నేపథ్యంలో ఇరాన్ చమురుపై ఉన్న ఆంక్షలను అమెరికా ఇటీవల తాత్కాలికంగా ఎత్తివేసింది. ఈ నెల 19న గడువు ముగియనుండగా, దీనిని పొడిగించేది లేదని అమెరికా స్పష్టం చేసింది.ట్రంప్ ప్రభుత్వం ఇరాన్ చమురుపై విధించిన గడువు ఈ వారాంతంలో ముగియనున్నందున, భారత్ వ్యూహాత్మకంగా అంతకుముందే టెహ్రాన్ నుంచి చమురును దిగుమతి చేసుకుంటోంది. ఫిబ్రవరి చివరలో ప్రారంభమైన యుద్ధం కారణంగా ప్రపంచవ్యాప్తంగా చమురు సరఫరాలో అంతరాయం ఏర్పడింది. ప్రపంచ ఇంధన కొరత, ధరల స్థిరీకరణ కోసం అమెరికా రష్యా, ఇరాన్ ముడి చమురు కొనుగోళ్లకు తాత్కాలికంగా అనుమతించింది.దీనితో ఇరాన్ నుంచి భారత్ చమురును దిగుమతి చేసుకుంటోంది. ఇరాన్ చమురుతో నిండిన అతిపెద్ద ముడి చమురు రవాణా నౌక 'జయ' ఇప్పటికే భారత తూర్పు తీరంలోని పారాదీప్ వద్ద సరుకును దింపుతోంది. మరో చమురు నౌక 'ఫెలిసిటీ' పశ్చిమ తీరంలోని సిక్కాలో చమురును అన్‌లోడ్ చేస్తోంది. ఈ రెండు నౌకల్లో 2 మిలియన్ బ్యారెళ్ల చమురు చొప్పున వచ్చింది. భారతదేశం అవసరాల కోసం ఇరాన్ నుంచి ముడి చమురును సేకరిస్తామని ఈ నెల ప్రారంభంలో భారత్ తెలిపింది.ఇదిలా ఉండగా, ఇరాన్‌లోని ఖర్గ్‌లో ముడి చమురు నింపుకున్న 'డెర్యా' నౌక భారతదేశ పశ్చిమ తీరంలో నిలిచి ఉంది. అయితే ఏ రేవుకు వెళ్లాలన్నదానిపై ఈ నౌక తదుపరి ఆదేశాల కోసం వేచి చూస్తున్నట్లు తెలుస్తోంది.

# ఉదయనిధి స్టాలిన్ ఆస్తులపై ఐటీ విచారణ.. మద్రాస్ హైకోర్టు కీలక ఆదేశం

తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల వేళ డీఎంకే కీలక నేత, మంత్రి ఉదయనిధి స్టాలిన్‌కు మద్రాస్ హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ఆయన సమర్పించిన ఎన్నికల అఫిడవిట్‌లోని ఆస్తుల వివరాల్లో తీవ్రమైన వ్యత్యాసాలు ఉన్నాయన్న ఆరోపణలపై ప్రాథమిక విచారణ జరపాలని ఆదాయపు పన్ను (ఐటీ) శాఖను ఉన్నత న్యాయస్థానం ఆదేశించింది. ఈ నెల 23న పోలింగ్ జరగనున్నందున, ఓటర్లకు అభ్యర్థుల ఆర్థిక విషయాలపై కచ్చితమైన సమాచారం తెలుసుకునే హక్కు ఉందని స్పష్టం చేసింది. ఈ మేరకు ఏప్రిల్ 20వ తేదీలోగా నివేదిక సమర్పించాలని ఐటీ శాఖ డైరెక్టర్ జనరల్‌కు గడువు విధించింది. ఉదయనిధి స్టాలిన్ పోటీ చేస్తున్న చేపాక్-తిరువల్లికేణి నియోజకవర్గానికి చెందిన ఆర్. కుమార్వేల్ అనే వ్యక్తి ఈ పిల్ దాఖలు చేశారు. 2021 అసెంబ్లీ ఎన్నికల అఫిడవిట్‌తో పోలిస్తే, ప్రస్తుత ఎన్నికల కోసం సమర్పించిన అఫిడవిట్‌లో అనేక తేడాలు ఉన్నాయని పిటిషనర్ తరఫు సీనియర్ న్యాయవాది వి. రాఘవాచారి కోర్టుకు వివరించారు. గతంలో ప్రకటించిన కొన్ని ఆస్తులు తాజా అఫిడవిట్‌లో కనిపించకపోవడం, అప్పుల లెక్కల్లో మార్పులు, ఆర్థిక లావాదేవీల వివరాల్లో పొంతన లేకపోవడం వంటి అంశాలను ఆయన ప్రస్తావించారు. ఇలాంటివి ఎన్నికల పారదర్శకతపై తీవ్ర ప్రభావం చూపుతాయని వాదించారు.
ఈ అంశంపై ఎన్నికల సంఘం (ఈసీఐ) తరఫు న్యాయవాది నిరంజన్ రాజగోపాలన్ వాదనలు వినిపిస్తూ, అభ్యర్థులు తమ ఆస్తుల వివరాలను నిజాయతీగా ప్రకటించాలని సుప్రీంకోర్టు ఆదేశాలు ఉన్నాయని తెలిపారు.

# రహదారి భద్రత-అందరి బాధ్యత



- ఆదిలాబాద్‌లో ఘనంగా రహదారి భద్రత అవగాహన కార్యక్రమం
- విద్యార్థులతో భారీ మానవహారం..
- బైక్ ర్యాలీని ప్రారంభించిన మంత్రి




**ఆదిలాబాద్ వెలుతురు ఏప్రిల్ 15 : రహదారి నిబంధనలు పాటించడం కేవలం చట్టం కోసం కాదని, అది మన ప్రాణాలకు రక్షణ కవచమని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో రవాణా శాఖ ఆధ్వర్యంలో ప్రజా పాలనా- ప్రగతి ప్రణాళిక లో భాగంగా నిర్వహించిన అరైవ్ అలైవ్, రహదారి భద్రత అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.**



**ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..**

ట్రాఫిక్ నియమాలపై సమాజంలో అవగాహనా పెంపొందించడంలో విద్యార్థుల పాత్ర కీలకమని అన్నారు. దేశంలో సహజ మరణాల కంటే, రోడ్డు ప్రమాదాల వల్ల ప్రాణాలు కోల్పోతున్న వారే ఎక్కువగా ఉండటం అత్యంత ఆవేదన కలిగించే అంశమని అన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రభుత్వం నాలుగు ప్రధాన అంశాలపై దృష్టి సారించిందని మంత్రి వివరించారు. ప్రజల్లో అవగాహన కల్పించడం, రహదారుల నిర్మాణం, లోపాల సవరణ, నిబంధనల కఠినంగా అమలు చేయడం, ప్రమాదం జరిగిన వెంటనే వైద్యం అందించేలా చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ముఖ్యంగా 25 నుంచి 40 ఏళ్ల మధ్య వయస్సు గల వారు అతివేగం, మద్యం సేవించి వాహనం నడపడం, రాంగ్ రూట్ ప్రయాణం వల్ల ప్రమాదాలకు గురవుతున్నారని ఆయన హెచ్చరించారు. హెల్మెట్, సీటు బెల్టు ధరించడం వల్ల ప్రాణాపాయం నుంచి తప్పించుకోవచ్చని, నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

**స్థానిక ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడుతూ..**

యువత వేగాన్ని నియంత్రించుకోవాలని, మద్యం సేవించి వాహనాలు నడపడం ఆత్మహత్యతో సమానమని అన్నారు. ప్రజల్లో మార్పు వచ్చినప్పుడే పోలీసు, రవాణా శాఖల కృషి ఫలిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమం ప్రారంభానికి ముందు స్టేడియం మైదానంలో పాఠశాల విద్యార్థులతో కలిసి మంత్రి 'హెల్మెట్ – సేవ్ లైవ్స్' (Helmet - Save Lives) ఆకారంలో భారీ మానవహారాన్ని నిర్వహించారు. విద్యార్థులు రహదారి భద్రతపై నినాదాలు చేస్తూ ప్రజల్లో చైతన్యం నింపారు. అనంతరం యువతకు లెర్నింగ్ లైసెన్స్‌లను, డ్రైవర్లకు ఉచితంగా కళ్లద్దాలను మంత్రి పంపిణీ చేశారు. అనంతరం మంత్రి స్టేడియం ఆవరణలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఇందిరా ప్రియదర్శిని స్టేడియం నుంచి అంబేద్కర్ చౌక్ వరకు నిర్వహించిన భారీ బైక్ ర్యాలీని మంత్రి ప్రారంభించడమే కాకుండా, స్వయంగా పాల్గొని ఉత్సాహపరిచారు. అనంతరం అంబేద్కర్ చౌక్‌లో రవాణా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి పాల్గొని వాహనదారులకు హెల్మెట్లను పంపిణీచేశారు.

ఈ కార్యక్రమంలో రవాణా శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ వికాస్ రాజ్, ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష, గ్రంథాలయ సంస్థ ఛైర్మెన్ మల్లెపూల నర్సయ్య, జిల్లా ఇంచార్జి కలెక్టర్ యువరాజు మర్మాట్, ఎస్పీ అఖిల్ మహాజన్, అదనపు కలెక్టర్ రాజేశ్వర్, ఆర్డీఓ స్రవంతి, రవాణా శాఖ డిప్యూటీ ట్రాన్స్పోర్ట్ కమిషనర్ పి. రవీందర్ కుమార్ గౌడ్, మోటార్ వెహికిల్ ఇన్స్పెక్టర్ ఎస్. శ్రీనివాస్, అసిస్టెంట్ మోటార్ వెహికిల్ ఇన్స్పెక్టర్ కె. హరీంద్ర కుమార్, అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.
















Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com